అనుదినం... జనస్వరం సమగ్ర తెలుగు దినపత్రిక

Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam,

సంపుటి: 11 సంచిక: 46 12 పేజీలు వెల: 6.50

సోమవారం 07-04-2025

నవతెలంగాణ



భవిష్యత్తు ఎర్రజెండాదే

ఇప్పటికే సోషలిజం నీడలో 25 శాతం ప్రపంచం : సీపీఐ(ఎం) నూతన కార్యదర్శి ఎంఏ బేబి

మదురైలో దిగ్విజయంగా ముగిసిన సీపీఐ(ఎం) 24వ మహాసభ

ఎన్ శంకరయ్య మైదానం నుంచి నవతెలంగాణ ప్రతినిధి

ప్రపంచంలో ఎర్రజెండాదే భవిష్యత్తు అని సీపీఐ(ఎం) నూతన ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తరువాత మదురైలోని ఎస్. శంకరయ్య మైదానం (రింగ్‌రోడ్ గ్రౌండ్)లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని 25 శాతం మంది ఇప్పటికే సోషలిజం నీడలో ఉన్నారని, అభ్యుదయ శక్తుల పాలనలో ఉన్న దేశాల జనాభాను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య మరింతగా పెరుగుతుందని అన్నారు. దీనికి సంబంధించిన గణాంకాలు కూడా తన దగ్గర ఉన్నాయని చెప్పారు. ఈ నెల రెండవ తేదీ నుంచి ఐదు రోజుల పాటు స్థానిక సీతారాం ఏచూరి నగర్ లో జరిగిన సీపీఐ(ఎం) అఖిల భారత 24వ మహాసభ ఆదివారం నాటితో దిగ్విజయంగా ముగిసింది. అనంతరం స్థానిక మదురై పాండి గుడి సెంటర్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన లక్షలాది మంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శనకు ముందుభాగంలో వేలాదిమంది రెడ్‌షర్ట్ వాలంటీర్లు కవాతు చేశారు. దీంతో ఆ పరిసర ప్రాంతాలు ఎర్రసముద్రంగా కనిపించాయి. బహిరంగ సభకు సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం అధ్యక్షత వహించారు. లక్షలాదిమందితో శంకరయ్యమైదానం, పరసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా బేబీ మాట్లాడుతూ చారిత్రాత్మకంగా ప్రఖ్యాతిగాంచిన మదురైలోని వైగైనది ఎరుపురంగు సంతరించుకున్నట్టు కనిపిస్తోందని ఆయన అన్నారు. ప్రధాన కార్యదర్శి హోదాలో తొలిసారి ఆయన చేసిన ప్రసంగం కవితాత్మకంగా పోలికలతో, ఉదాహరణలతో సాగింది. పలువురు ప్రజా రచయితల, కవుల రచనలను ఆయన ...12లో



ఎంఏ బేబీ ప్రస్థానం

- ఎంఏ బేబి (మరియం అలెగ్జాండర్ బేబి) 1954 ఏప్రిల్ 5న కొల్లంలోని ప్రాక్కులంలో పి.ఎం.అలెగ్జాండర్, లిల్లీ అలెగ్జాండర్ దంపతులకు జన్మించారు.
- విద్యార్థిగా రాజకీయాల్లోకి ప్రవేశించి స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ (ఎస్ఎఫ్ఐ) కేరళ రాష్ట్ర అధ్యక్షుడిగా, అనంతరం జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు.
- కొల్లం ఎస్ఎన్ కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు.
- పుస్తక పఠనం, చర్చలలో పాల్గొన్నడం ఆయన అభిరుచులు. దీంతో తరచూ వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీల్లో పాల్గొంటూ గుర్తింపు పొందారు.
- 1987లో డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ)కు జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
- ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు
- 1985లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు



- 1989లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు.
- 32 ఏండ్లకే రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు.
- 2006లో ఆయన కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు.
- 2006 నుంచి 2011 వరకు అచ్యుతానందన్ మంత్రివర్గంలో విద్య, సాంస్కృతిక శాఖా మంత్రిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పార్టీయేతర వర్గాలను సైతం తన పని తీరుతో ఆకట్టుకున్నారు.
- 2012లో కొజికోడ్‌లో జరిగిన ఆ పార్టీ జాతీయ మహాసభల్లో ఆయన తొలిసారి పొలిట్‌బ్యూరోలోకి వెళ్లారు.
- 2025లో మదురైలో జరిగిన 24వ మహాసభలో సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు.
- కేరళ నుంచి సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రెండో వ్యక్తి ఎంఏ బేబి.
- ఆయన జీవిత భాగస్వామి బెట్టీ లూయిస్, కుమారుడు అశోక్ బెట్టీ నెల్సన్.
- ఎమర్జెన్సీ సమయంలో జైలు శిక్ష అనుభవించిన నాయకులలో ఆయన ఒకరు.

సవాళ్లను అధిగమిద్దాం

"పార్టీ 24వ మహాసభ అనేక సంక్లిష్ట పరిస్థితుల మధ్య జరిగింది. సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య, కొడియేరి బాలకృష్ణన్ లేని లోటు పూడ్చలేకుండా ఉంది. ఆ బాధను దిగమింగుకుంటూనే మహాసభల ఏర్పాట్లపై పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ దృష్టి సారించాయి. పరస్పర సహకారం, సమన్వయంతో మహాసభను దిగ్విజయంగా ముగించాం. ప్రస్తుతం కార్పొరేట్, కమ్యూనల్ (మతోన్మాదం) గొలుసును ఛేదించటమనే అంశంపై అధ్యయనం చేయాలి. పార్టీ రాజకీయ వ్యూహాత్మక పంథాకు అదే కీలకం. కార్మికవర్గ పార్టీగా ఆర్థిక పోరాటాలను కొనసాగిస్తూనే ప్రజల మధ్య చీలికలు తెస్తున్న కేంద్రంలోని బీజేపీ, దాని వెనకున్న ఆరెస్సెస్ కుట్రలను తిప్పికొట్టాలి. మోడీ హయాంలో నయా ఫాసిస్టు ధోరణులు పెచ్చరిల్లుతున్న తరుణంలో వాటి నుంచి దేశాన్ని రక్షించాలి.



విప్లవపథానికి నూతనసేనాని

సీపీఐ (ఎం) నూతన ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ

- 18 మందితో పొలిట్‌బ్యూరో
- 84 మందితో కేంద్ర కమిటీ
- తెలంగాణ నుంచి సీసీలోకి తమ్మినేని, జాన్‌వెస్లీ, ఎస్.వీరయ్య, టి.జ్యోతి

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నూతన ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమిళనాడులోని మదురైలో నిర్వహించిన సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ ఆయన్ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. మొత్తం 18 మందితో పార్టీ పొలిట్‌బ్యూరో, 84 మందితో కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. మహాసభ చివరి రోజైన ఆదివారం సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య బేబీ ఎన్నికను ప్రకటించారు. అనంతరం పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్‌కరత్...బేబీతో కలిసి ప్రతినిధులకు అభివాదం చేస్తూ ఆయన్ను పరిచయం చేశారు. ఈఎమ్ఎస్ నంబూద్రిపాద్ తర్వాత కేరళ నుంచి సీపీఐ (ఎం)కు సారథ్య బాధ్యతలు చేపట్టిన నాయకుడు బేబీయే కావటం గమనార్హం. కాగా తెలంగాణ నుంచి పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేంద్ర కమిటీ(సీసీ)లో కొనసాగనున్నారు. సీసీలోకి కొత్తగా ప్రస్తుత రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతోపాటు ఎస్.వీరయ్య, టి.జ్యోతి ఎన్నికయ్యారు. ఇప్పటి వరకూ కేంద్ర కమిటీలో కొనసాగిన చెరుపల్లి సీతారాములు, జి.నాగయ్య ప్రస్తుత మహాసభలో రిలీవ్ అయ్యారు.



రాములోరికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

భద్రాద్రిలో శ్రీరామనవమి సందర్భంగా సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు



- నిలిచిన ముఖ్యమంత్రుల రాక ఆనవాయితీ పునరుద్ధరణ
- హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు..
- నేడు పట్టాభిషేకం..గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరు
- సారపాకలో సన్నబియ్యం అన్నం రుచి చూసిన సీఎం, మంత్రులు
- ప్రభుత్వ పథకాలపై లబ్దిదారులను ఆరా తీసిన సీఎం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

భద్రాచలంలో ఆదివారం శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. దాదాపు పదేండ్ల క్రితం నిలిచిపోయిన ముఖ్యమంత్రుల రాక ఆనవాయితీని పునరుద్ధరిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, సతీమణి గీతతో కలిసి శ్రీరామనవమి వేడుకలకు వచ్చారు. ఉదయం 11.35 గంటలకు శ్రీసీతారాముల కళ్యాణానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గీత దంపతులకు ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి దంపతులు మల్లు భట్టివిక్రమార్క, నందిని, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి మాధురి, మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరహరి, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ బీఆర్ నాయుడు దంపతులు కళ్యాణానికి హాజరయ్యారు. నవమి సందర్భంగా భద్రాచలానికి భక్తులు భారీగా తరలిరావడంతో మిథిలాస్టేడియం కిక్కిరిసింది. ఇక సోమవారం రామయ్యకు పట్టాభిషేకం జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ...10లో

అమెరికాలో భారీ ఆందోళనలు

ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు

- 'హ్యాండ్స్ ఆఫ్' పేరుతో నిర్వహణ
- ర్యాలీలు, నినాదాలు, ప్లకార్డుల ప్రదర్శన
- పాల్గొన్నవారు ఆరు లక్షల మందికి పైనే
- ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎదురైన తీవ్ర ప్రతిఘటన
- ఇతర దేశాల్లోనూ నిరసన జ్వాలలు



వాషింగ్టన్ : అమెరికాలో ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు అక్కడి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదరవుతున్నది. ట్రంప్, ఆయన యంత్రాంగంలో భాగమైన ప్రపంచ సంపన్నుడు, వివాదాస్పద డోజ్‌కు నేతృత్వం వహిస్తున్న మస్క్ విధానాలకు వ్యతిరేకంగా ఆ దేశంలో ఆందోళనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసనకారులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ట్రంప్ యంత్రాంగానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ చర్యలతో వారు తమ ఆగ్రహావేశాలను వెలిబుచ్చారు. 'హ్యాండ్స్ ఆఫ్' అనే ఈ ...11లో



గుండెపోటుతో యర్రా శ్రీకాంత్ ఆకస్మిక మృతి

పార్టీ అఖిల భారత మహాసభల్లో ఉండగా హార్ట్‌ఎటాక్

- మదురైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స
- ఆదివారం మధ్యాహ్నం మరోసారి స్ట్రోక్‌తో మరణం
- విద్యార్థి దశ నుంచీ వామపక్ష ఉద్యమాల్లోనే..
- ఈయన ప్రస్తుతం సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు
- పార్టీ తెలంగాణ, ఏపీ రాష్ట్ర కమిటీల సంతాపం
- నేటి ఉదయానికి ఖమ్మం చేరుకోనున్న భౌతికకాయం



ఫైల్

వివరాలు 10లో..

పాంబన్ వంతెన ప్రారంభం



- రూ.535 కోట్లు.. నాలుగేండ్లలో నిర్మాణం
- జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ
- తమిళనాడు ముఖ్యమంత్రి గైర్హాజరు
- డీలిమిటేషన్ భయాలను మోడీ తొలగించాలి : సీఎం స్టాలిన్ డిమాండ్

వివరాలు 11లో..

మైనారిటీలు..అణగారిన వర్గాలే

టార్గెట్



- వారికి వ్యతిరేకంగా పలు ద్వేషపూరిత ప్రసంగాలు
- సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎ.ఎస్ ఓకా ఆందోళన

న్యూఢిల్లీ : భారత్‌లోని మైనారిటీలు, అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా అనేక ద్వేషపూరిత ప్రసంగాలు ఉంటున్నాయని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎ.ఎస్ ఓకా అన్నారు. సర్వోన్నత న్యాయస్థానానికి వచ్చే ద్వేషపూరిత ...11లో

ఉపాధి కూలి పెంపు రూ.7 మాత్రమే..

ఈజీఎస్ వేతనం
పెరిగింది రూ.219 మాత్రమే
నాలుగేండ్లుగా అదనపు భత్యం బంద్
మండుటెండల్లో
మగ్గుతూ పని చేసినా రూ.180 వేతనమే
ఏటేటా బడ్జెట్‌లో కోతలు పెడుతోన్న కేంద్రం
సగటు పని దినాలు 44 రోజులే..
100 రోజుల పని అందని ద్రాక్షే
నీళ్లు, నీడ కరువు.. రూ.5 భత్యమూ లేదు

20 ఏండ్లలో ధరల పెరుగుదల కొండంత



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామీణ పేదలకు పని గ్యారంటీ కల్పించాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజీఎన్ఆర్ఈజీఏ) కేంద్రం నీరుగారుస్తోంది. ఏటా బడ్జెట్‌లో అవసరమైన నిధులివ్వకుండా కోతలు పెడుతోంది. కూలీలకు ఇచ్చే వేతనం 20 ఏండ్లుగా రూ.300కు మించలేదు. కానీ..! ధరల పెరుగుదల మాత్రం కొండంతలా ఉండటంతో కూలీలు సప్పిడి మెతుకులకు సైతం నోచుకోవట్లేదు. మండుటెండల్లో మగ్గుతూ కష్టం చేస్తున్న కూలీలకు నాలుగేండ్లుగా అదనపు భత్యం, నీడ, నీళ్ల భత్యం ఇవ్వట్లేదు. ఎంత కష్టపడినా వేతనం రూ.180 దాటట్లేదు. ఏడాదిలో వంద రోజుల పని దినాలు కల్పించాల్సి ఉన్నా సగటున 44 పనిదినాలు కూడా కల్పించని పరిస్థితి. ఇటీవల కేంద్రం ఉపాధి కూలీల కనీస వేతనం రూ.7 పెంచి పండగ చేసుకోండంటూ ఊదరకొట్టింది. కష్టజీవులు, అందులో గ్రామీణ పేదల పొట్టగొడుతూ కేంద్రం యాక్టీవ్ జాబ్‌కార్డుల పేరిట లక్షలాది మంది పేర్లను తొలగిస్తోంది. వేతన బకాయిల్ని ఇవ్వకుండా తిప్పలు పెడుతోంది.

2005లో ఎన్ఆర్ఈజీఏగా ఏర్పడి 2006లో ఎంజీఎన్ఆర్ఈజీఏగా మార్పు చేయబడిన జాతీయ ఉపాధి హామీ చట్టం అమల్లో పాలకులు అనేక ఆటంకాలను సృష్టిస్తున్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ ఇతర సంక్షేమ పథకాలంటిది కాదు. ఇది అత్యున్నతమైన పార్లమెంట్ చేసిన చట్టం. ఆ చట్టానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తరచూ తూట్లు పొడుస్తోంది. కేంద్రం ఏటేటా బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల్ని తగ్గించడం వల్ల తెలంగాణలోని గ్రామీణ పేదలకు సరిపడా పని దినాల్ని కల్పించలేకపోతున్నారు. అదనంగా పని దినాలు కల్పిస్తున్న తెలంగాణకు కేంద్రం ఆ మేరకు నిధులివ్వకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం చేతులెత్తేస్తోంది. రాష్ట్రంలో 55 లక్షల వరకు జాబ్‌కార్డులున్నాయి. జాబ్‌కార్డుల్లో నమోదైన పేదలంతా ఏడాదిలో పది నుంచి వంద రోజుల వరకు తమ అవసరాలు, వీలును బట్టి పని చేసుకుంటున్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగాక కూలీలకు గ్రామాల్లో పనుల్లేకుండా పోతున్నాయి. ఉపాధి హామీ పనులు చేయడం ద్వారా పొట్టపోసుకునే కుటుంబాలు లక్షల్లోనే ఉన్నాయి. పెరిగిన అవసరాల రీత్యా 100 రోజు పని దినాల్ని 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉపాధి కూలీ వేతనం రూ.7 పెంపు

జాతీయ ఉపాధి హామీలో పని చేసే కూలీలకు రోజువారి వేతనాన్ని ఇటీవల కేంద్రం పెంచింది. వేతనం పెంపుదల అంటే అది వందల్లో ఉంటుందని ఆశపడ్డ కూలీలకు తీవ్ర నిరాశే మిగిలింది. ఇప్పటి వరకు రూ.300గా ఉన్న వేతనాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోని ఏప్రిల్ నుంచి రూ.307 చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. చట్టం అమల్లోకి వచ్చిన 2005లో ఉపాధి కూలి రోజు వేతనం రూ.87.50 ఉండేది. ఈ 20 ఏండ్లలో కేంద్రం మాత్రం కేవలం రూ.219.50 మాత్రమే పెంచింది. ఈ రెండు దశాబ్దాల కాలంలో నిత్యవసరాలు, ఇతర ధరలు మాత్రం కొండంతగా పెరిగిపోయాయి. ధరల భారాలు మోయలేని పేదలు పచ్చడి మెతుకులకు కూడా నోచుకోవట్లేదు. కేంద్రం నిర్ణయించిన రూ.300 వేతనం రాష్ట్రంలోని ఏ ఉపాధి కూలికి కూడా చెల్లించిన దాఖలాల్లేవు. కూలీలు ఎంత పని చేసినా సగటు వేతనం రూ.180 నుంచి 200కు మించడం లేదు. రోజు వేతనం రూ.7 పెంచడం వల్ల కూలీలకు కనీసం సింగిల్ టీ కూడా తాగేందుకు సరిపోని పరిస్థితి. ఇక ఉప్పు, పప్పు, బియ్యం, నూనెలు కొనే పరిస్థితి ఏముంటదని పలువురు కూలీలు వాపోతున్నారు. రోజు వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

4 ఏండ్లుగా అదనపు భత్యం బంద్

ఉపాధి హామీ కింద వేసవి కాలంలో చేసే పనుల్ని బట్టి నిర్ణయించిన వేతనంతో పాటు అదనపు భత్యం కూడా చెల్లించాలి. ఎండల తీవ్రత వల్ల భూమి వేడెక్కిపోతుంది. పొద్దస్తం పని చేయలేని పరిస్థితి ఉంటున్నందున అదనపు భత్యం చెల్లించాల్సి ఉంది. కేంద్రం మాత్రం నాలుగేండ్లుగా ఉపాధి కూలీలకు వేసవిలో ఇవ్వాల్సిన అదనపు భత్యాన్ని బంద్ చేసింది. మార్చి నెలలో 20 శాతం, ఏప్రిల్‌లో 25 శాతం, మేలో 30 శాతం చొప్పున అదనపు భత్యం కూలీలకు చెల్లించాలని చట్టం చెబుతోంది. గతంలో రాగాస్ సాఫ్ట్‌వేర్ ద్వారా నమోదు చేసే సమయంలోనే అదనపు చెల్లింపులు నమోదయ్యేది. ప్రస్తుతం ఎన్ఐసీ(నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్) సాఫ్ట్‌వేర్ వాడుతుండటం, కేంద్రం నేరుగా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి వినియోగి స్తున్నందున అదనపు కూలి చెల్లింపుల నమోదుకు అవకాశంలేకుండా చేశారు. ఎండాకాలంలో చేసే డైవర్షన్ డ్రైన్, రాకల్ల కట్టలు, ఫీడర్ చానల్, ఎంఐ సంపులు, మేలక, గొర్ల షెడ్లు, కోళ్లఫారాల నిర్మాణం, ఫామ్‌పాండ్, ఫార్మేషన్ రోడ్లు పనులన్నీ కష్టతరమైనవే. ఎండా కాలంలో మట్టి తవ్వకం కష్టమవుతున్నందున కూలి గిట్టదని అదనపు భత్యం ఇవ్వాలని చట్టం చెప్పినా కేంద్రం మాత్రం నిరాకరిస్తుంది.

ఏటేటా నిధుల్లో కోత పెడుతున్న కేంద్రం

దేశంలో అర్హులైన కూలీలందరికీ (కేంద్రం చెబుతున్న యాక్టీవ్ హౌస్‌హోల్డ్స్) ఎన్ఆర్ఈజీఏలో రూపొందించిన ప్రకారం ఒక ఏడాదిలో 100 రోజుల ఉపాధి కల్పించాలంటే రూ.3 లక్షల కోట్ల మేరకు బడ్జెట్ అవసరముంటదని అంచనా. కానీ.. 2024-25లో కేంద్రం మాత్రం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. మార్చిలో పెట్టిన ఈ ఏడాది బడ్జెట్‌లోనూ పాత నిధులు రూ.86 వేల కోట్లనే విదిల్చింది. 2023-24లో రూ.60 వేల కోట్లు, 2022-23, 2021-22 రెండు బడ్జెట్లలోనూ రూ.73 వేల కోట్లు కేటాయించింది.

అంతకు ముందు 2020-21లో రూ.61,500 కోట్లు, 2019-20, 2018-19 బడ్జెట్‌లోనూ రూ.60 వేల కోట్ల నిధుల్ని మాత్రమే కేటాయిం చింది. తెలంగాణ రాష్ట్రానికి 2025-26 బడ్జెట్‌లో కేవలం రూ.4416 కోట్లను మాత్రమే కేటాయించింది. కూలీలకు అధిక పని దినాలు కల్పించేందుకు తెలంగాణకు కేంద్రం అవసరమైన నిధులివ్వకపోవడంతో రాష్ట్రంలో సగటు పని దినాలు 44 నుంచి 56 రోజులకే పరిమితం చేస్తున్నారు.

ఉపాధి వేతనం రూ.600 ఇవ్వాలి : ఎం.నర్సింహులు, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు



ఈజీఎస్‌లో పని చేసే కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి. రోజంతా పనిచేసినా ప్రస్తుతం రూ.150-200 లకు మించట్లేదు. ఉపాధి పని దినాల్ని కూడా 200 రోజులకు పెంచాలి. కేంద్రం నిధులివ్వకపోవడం వల్ల పని దినాలు తగ్గిస్తున్నారు. తక్కువ వేతనం ఇస్తున్నారు. రాష్ట్ర అవసరాల మేరకు బడ్జెట్ ఇవ్వాలి. కూలీలు ఆరు రోజుల పని చేస్తే కేవలం నాలుగైదు రోజులకే హాజరు పడుతుంది. వేసవి అదనపు భత్యం ఇవ్వాలి. నీడ, నీళ్ల సదుపాయం ఇవ్వట్లేదు. అందు కోసం ఇవ్వాల్సిన రూ.5 కూడా ఇవ్వట్లేదు. బకాయి వేతనాల్ని వెంటనే చెల్లించాలి.

పస లేని బ్యాటింగ్!

- సూపర్‌కింగ్స్‌కు కొత్త కష్టాలు
- సొంతగడ్డపై తేలిపోతున్న వైనం

ఐదుసార్లు చాంపియన్, ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్టు చెన్నై సూపర్ కింగ్స్. ఫ్రాంచైజీ లీగ్‌లో నిలకడగా ఆడే జట్టుగా సూపర్‌కింగ్స్ పేరు గడించింది. సూపర్‌కింగ్స్ విజయాల్లో చెపాక్ కోట పాత్ర కీలకమైనది. కొన్ని ఫ్రాంచైజీలు చెపాక్‌లో సూపర్‌కింగ్స్‌పై విజయం కోసం ఏకంగా 15-17 ఏండ్లు ఎదురుచూడాల్సి వచ్చిదంటేనే ఆధిపత్యం ఏ స్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఐపీఎల్18లో సూపర్ కింగ్స్ కథ మారుతోంది. కంచుకోట చెపాక్‌లో వరుస పరాజయాలు చవిచూడగా.. బ్యాటింగ్‌లో ఎన్నడూ లేని ఒత్తిడి ఎదుర్కొంటుంది.

నవతెలంగాణ క్రీడావిభాగం



ఐపీఎల్18లో ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ నాలుగు మ్యాచులు ఆడింది. సొంతగడ్డ చెపాక్‌లో మూడు మ్యాచులు ఆడగా.. రెండింట పరాజయం పాలైంది. గువహటిలో ఆడిన మ్యాచ్‌లో భంగపాటుకు గురైంది. సూపర్‌కింగ్స్ ఐపీఎల్‌లో నిలకడగా రాణించడానికి ముఖ్య కారణాల్లో చెపాక్ స్టేడియం ఒకటి. చెపాక్‌లో ఏడు మ్యాచుల్లో వీలైనన్ని ఎక్కువ విజయాలు సాధించటం సూపర్‌కింగ్స్ స్టయిల్. ప్రత్యర్థి గడ్డపై 2-3 విజయాలు సాధించినా.. సొంతగడ్డపై తిరుగులేని రికార్డుతో ప్లే ఆఫ్స్‌లో కచ్చితంగా చోటు సాధించగల పటిష్ట స్థితిలో ఉండటం సూపర్‌కింగ్స్ ప్రత్యేకత. ఈ సీజన్లో సూపర్‌కింగ్స్ కంచుకోట బద్దలవుతోంది. మ్యాజిక్ చేస్తారని ఆశించిన స్పిన్నర్లు, యువ బ్యాటర్లు అంచనాలను అందుకోవటం లేదు. ఫలితంగా హ్యాట్రిక్ పరాజయాలతో సూపర్‌కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసుకు దూరమయ్యే ప్రమాదంలో పడింది.

బ్యాటింగ్‌లో పవర్ ఏదీ?

చెన్నై సూపర్‌కింగ్స్ బ్యాటింగ్ లైనప్‌లో అసలు దూకుడు లేదు. సీజన్ ఆరంభం ముంగిట ఆటగాళ్ల వేలంలోనే సూపర్‌కింగ్స్ బ్యాటింగ్ బలహీనత సుస్పష్టం. చెపాక్‌లో స్పిన్ అనుకూలిత పిచ్‌పై మాయ చేయగల స్పిన్నర్లు నూర్ అహ్మద్, రవిచంద్రన్ అశ్విన్ కోసం సూపర్‌కింగ్స్ యాజమాన్యం కోట్లు ఖర్చు చేసింది. కానీ ఈ క్రమంలో బ్యాటింగ్‌లో అవసరమైన ధనాధన్ మంత్ర లోపించింది. రాహుల్ త్రిపాఠి, దీపక్ హుడా, శామ్ కరణ్‌లు మంచి ఆటగాళ్లే. కానీ టీ20 క్రికెట్‌లో ధనాధన్ బ్రాండ్ క్రికెట్ ఆడిన గణాంకాలు వీళ్లకు లేవు. టాప్-3 బ్యాటర్లు డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, రుతురాజ్ గైక్వాడ్‌లపై ఆ జట్టు ఎక్కువగా ఆధారపడుతోంది. సాధారణంగా భారీ స్కోరు చేయటంలో, లక్ష్యాలను ఛేదించటంలో టాప్-3 బ్యాటర్లలో ఒకరు 15 ఓవర్ల పాటు క్రీజులో కుదురుకోవాలి. కానీ ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో పవర్‌ప్లే ముగియకముందే ఈ ముగ్గురు బ్యాటర్లు డగౌట్‌కు చేరుకున్నారు. లోయర్ ఆర్డర్‌లో ధనాధన్ ముగింపులపై యువ బ్యాటర్ శివం దూబె సూపర్ కింగ్స్ భారీ ఆశలు పెట్టుకుంది. కానీ శివం దూబె ఈ సీజన్లో ఇంకా ఫామ్‌లోకి రాలేదు. రవీంద్ర జడేజా తనదైన మ్యాజిక్ చూపించాలని తపిస్తున్నా.. మరో ఎండ్ నుంచి సరైన సహకారం లభించటం లేదు. అంతిమంగా, ఓ ఓవర్‌లో 20 పరుగులు చేయాల్సిన దశలో బౌలర్‌పై ఒత్తిడి పెంచే బ్యాటర్ సూపర్‌కింగ్స్ శిబిరంలో కరువయ్యాడు.

లక్ష్యం లేని వ్యూహం?

సూపర్‌కింగ్స్ వ్యూహం సైతం నిరాశపరిచేలా ఉంది. ఇతర జట్లు 200-250 స్కోర్లను అలవోకగా బాదగల బ్యాటింగ్ లైనప్‌లను తయారు చేసుకుంటే.. సూపర్‌కింగ్స్ పాత పంథాలోనే నడుస్తోంది. బెంగళూర్‌తో మ్యాచ్‌లో చివరి ఏడు ఓవర్లలో 80 పరుగులు అవసరమైన దశలో ఎం.ఎస్ ధోని కంటే ముందుగా రవిచంద్రన్ అశ్విన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. ఇటువంటి వ్యూహంతో ఏ విధంగా విజయాలపై గురి పెట్టాలని ఆశిస్తున్నారో జట్టు మేనేజ్‌మెంట్‌కే తెలియాలి. ఆ మ్యాచ్‌లో చెన్నై 50 పరుగుల భారీ తేడాతో ఓడిన సంగతి తెలిసిందే. ఇక ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో స్పిన్ త్రయం ఓవర్ల కోటా పూర్తి చేయలేదు. మధ్యాహ్నం మ్యాచ్‌లో బౌలర్లకు అనుకూలత ఎక్కువగా ఉంటుంది. అటువంటిది ప్రపంచ శ్రేణి స్పిన్నర్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని లోప భూయిష్టమైన ప్రణాళికలు సూపర్‌కింగ్స్ శిబిరం రచిస్తోంది. పస లేని బ్యాటింగ్‌తో భారీ లక్ష్యాలను ఛేదించినప్పుడు సూపర్‌కింగ్స్ చేతులెత్తేస్తుంది. ముంబయి ఇండియన్స్‌పై 156 పరుగుల స్వల్ప లక్ష్యాన్నే 19.1 ఓవర్లలో ముగించిన సూపర్‌కింగ్స్.. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై 197 ఛేదనలో 146 పరుగులే చేసింది. 50 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. రాజస్థాన్ రాయల్స్‌పై 183 ఛేదనలో 176 పరుగులే చేసి 6 పరుగుల తేడాతో ఓడింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై 184 పరుగుల ఛేదనలో 158 పరుగులకే పరిమితమైంది. 25 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.

సమయం లేదు!

చెపాక్‌లో చెన్నై మరో నాలుగు మ్యాచులే ఆడాల్సి ఉంది. ఇప్పటికే ఏడుగురు విదేశీ ఆటగాళ్లను తుది జట్టులో ప్రయోగించారు. నాలుగు మ్యాచుల్లో 17 మంది ఆటగాళ్లను బరిలోకి దింపారు. ఏ కాంబినేషన్ సైతం సూపర్‌కింగ్స్‌కు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. సీజన్‌లో సహజంగా 11-12 మందితోనే వేట సాగించటం సూపర్‌కింగ్స్ శైలి. ఇటు బ్యాటింగ్‌లో, అటు బౌలింగ్‌లో ఏ కూర్పు కుదరటం లేదు. లీగ్ దశలో మరో 10 మ్యాచులే ఆడాల్సి ఉండగా.. లోపాలు దిద్దుకునేందుకు సూపర్‌కింగ్స్‌కు ఇదే సరైన తరుణం. లేదంటే, ఈ సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్‌పై ఆశలు వదులుకోవాల్సిందే.

నవచిత్రం

ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు



ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన 'ఎల్ఎఫ్‌వై' చిత్రం ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. విశేష ఆదరణతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ముఖ్యంగా తండ్రీ-కొడుకుల అనుబంధాన్ని భావోద్వేగపూరితంగా చిత్రీకరించిన తీరుకు అందరూ బాగా కనెక్ట్ అవుతున్నారు.

ఎస్పీ చరణ్, శ్రీ హర్ష, కషిక కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని పవన్ కేతరాజు దర్శకత్వంలో మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా, అన్నపరెడ్డి స్టూడియోస్ నిర్మించాయి. ఈ సినిమా ఇంత పెద్ద హిట్ అయినందుకు మూవీ టీమ్ విజయోత్సవ వేడుక నిర్వహించారు.

హీరో హర్ష మాట్లాడుతూ, 'ఈ సినిమా ఇంత పెద్ద హిట్ అవుతుందని అస్సలు అనుకోలేదు. ఇంకా సినిమా చూడని వారుంటే ఖచ్చితంగా వెళ్లి చూడండి. తప్పకుండా మీకు నచ్చుతుంది' అని అన్నారు.

సినిమా చాలా బాగుందని చాలా మంది ఫోన్లు చేస్తున్నారు. ఈ సినిమా చూశాక వాళ్ళ తండ్రి గుర్తొస్తున్నారు అని చెప్పారు. ఇంటర్వెల్, క్లైమాక్స్ అదిరిపోయిందని అంటున్నారు' అని డైరెక్టర్ పవన్ కేతరాజు చెప్పారు.

నిర్మాత కిషోర్ రాఠి మాట్లాడుతూ,'మా బ్యానర్‌లో గత నలభై ఏళ్లుగా ఇలాంటి కుటుంబ కథ చిత్రాలే తీస్తున్నాం. వాటికి చాలా మంచి ఆదరణ లభించింది. ఈ సినిమా కూడా మంచి ఆదరణ పొందింది. అందుకు ప్రేక్షకులకు చాలా థ్యాంక్స్. ఇంతమంచి సినిమా తీసినందుకు డైరెక్టర్ పవన్‌కి కూడా ధన్యవాదాలు. ఓ మంచి సినిమాని తీశామని చాలా గర్వంగా ఉంది. ఇందులోని ప్రతి అంశానికి ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతున్నారు. అదే ఈ సినిమాని సక్సెస్‌బాటలో నిలిపింది' అని తెలిపారు.



రామ్‌చరణ్

ఇంత పెద్ద బతుకెందుకు?

'ఒకే పని సెసేనాకి.. ఒకే నాగ బతికేనాకి..ఇంత పెద్ద బతుకెందుకు?, ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసేయాలా.. పుడతామా ఏటి... మళ్ళీ.. సెప్మీ!' అని అంటున్నారు హీరో రామ్ చరణ్. అదేంటో తెలియాలంటే, ఆయన టైటిల్ పాత్రలో నటిస్తోన్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా మూవీ 'పెద్ది' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్.

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి రీసెంట్‌గా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా రిలీజ్ చేసిన గ్లింప్స్ అందరిలోనూ మరింత ఆసక్తితోపాటు భారీ అంచనాలను సినిమాపై పెంచింది.

మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు. శ్రీ రామ నవమి సందర్భంగా ఈ సినిమా నుంచి ఫస్ట్ షాట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేసి, సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించటం విశేషం. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 27న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు.

మీ చేతులకూ రక్తం అంటింది!

- యుద్ధోన్మాది ఇజ్రాయిల్‌కు మైక్రోసాఫ్ట్ ఏఐ టెక్నాలజీ
- స్వర్ణోత్సవ వేడుకల్లో ఉద్యోగుల నిరసన



వాషింగ్టన్ : 'ఇక చాలు ఆపండి.. ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)ని మంచి కోసం ఉపయోగిస్తా మన్న మాటలు కట్టిపెట్టండి. లాభాల కోసం ఇజ్రాయిల్ సైన్యానికి విక్రయిస్తున్నారు. గాజాలో ఇజ్రాయిల్ నరమేధం సృష్టిస్తోంది. మీ చేతులకు రక్తమంటింది. మొత్తం మైక్రోసాఫ్ట్ రక్తంతో తడుస్తోంది' అంటూ మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు ఒకరి తర్వాత మరొకరు ఆ సంస్థ ఏఐ విభాగం సీఈఓ ముస్తఫా సులేమాన్‌ను నిలదీశారు. మైక్రోసాఫ్ట్ 50వ వార్షికోత్సవం (స్వర్ణోత్సవం) సందర్భంగా వాషింగ్టన్ లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఈ ఘటన చోటుచేసుకుంది.

సులేమాన్ ..మైక్రోసాఫ్ట్ ఏఐ విభాగానికి అధిపతిగా ఉన్నారు. ఆ సంస్థ తీసుకొచ్చిన ఏఐ బ్రాండ్ 'కోపైలట్'కు మరిన్ని మెరుగులద్ది కొత్తగా రూపొందించిన అసిస్టెంట్ 'కోపైలట్' ప్రొడక్ట్ అప్‌డేట్స్ గురించి ఆయన ప్రజెంటేషన్ ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి బిల్‌గేట్స్, సంస్థ మాజీ సీఈఓ స్టీవ్ బామర్, ప్రస్తుత సీఈఓ సత్యనాదెళ్ల కూడా హాజరయ్యారు. 2014 తర్వాత వీరు ముగ్గురూ పాల్గొనడం ఇదే తొలిసారి. సరిగ్గా ఆ సమయంలోనే మైక్రోసాఫ్ట్ ఉద్యోగి ఇబ్తిహాల్ అబౌసాద్ లేచి నిలబడి మైక్రోసాఫ్ట్ తీరును నిలదీశారు. 'లాభాల కోసం ఏఐ టెక్నాలజీని ఆయుధాలుగా ఇజ్రాయిల్ సైన్యానికి విక్రయిస్తున్నారు. మా ప్రాంతంలో మారణహోమం సష్టించడానికి, జాతి నిర్మూలనకు ఏఐని ఉపయోగించడం ఆపండి. మీ చేతుల్లో రక్తం ఉంది. మొత్తం మైక్రోసాఫ్ట్ చేతుల్లో రక్తం ఉంది. గాజాలో అమాయకులను, పసిపిల్లలను చంపుతున్నప్పుడు మీరు వార్షికోత్సవం జరుపుకుంటున్నారు. మీకు సిగ్గు ఉందా?' అని ఆమె ఆక్రోశించారు. 'మారణహోమం కోసం ఏఐని ఉపయోగించడం ఆపండి' అంటూ నినదించారు. ఆమె నిరసన తెలుపుతూ వేదిక వద్దకు వస్తుండగా.. సులేమాన్ తన ప్రసంగాన్ని నిలిపేశారు. 'నేను మీ మాటలు వింటున్నా. థాంక్యూ' అంటూ ఆయన బదులిచ్చారు. భద్రతా సిబ్బంది ఆమెను అక్కడి నుండి బయటకు పంపివేస్తుండగా.. పాలస్తీనా వాసులకు మద్దతుగా ఉపయోగించే స్కార్ఫ్‌ను ఆమె వేదిక పైకి విసిరారు. ఆ తర్వాత కార్యక్రమం కొనసాగింది. కొద్దిసేపటి తర్వాత మరో ఉద్యోగి వానియా అగర్వాల్ లేచి నిరసన తెలియజేశారు. ఇజ్రాయిల్ ఆర్మీతో ఏఐ ఒప్పందాలు రద్దు చేసుకోసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ పరిణామం అనంతరం ఇబ్తిహాల్, అగర్వాల్ మైక్రోసాఫ్ట్ లాగిన్స్‌ను ఆసంస్థ నిలిపివేసింది. దీంతో వారిద్దరిని తొలగించినట్టుగా పరోక్షంగా తెలిపింది. ఇజ్రాయిల్ ఆర్మీకి ఏఐ టెక్నాలజీ విక్రయానికి సంబంధించి ఒప్పందాలపై చర్చించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో సంస్థ సీఈఓ సత్యనాదెళ్ల సమావేశం నిర్వహించగా ఐదుగురు ఉద్యోగులు ఆ సమావేశాన్ని బహిష్కరించిన నిరసన తెలిపారు. అది అంతర్గత సమావేశం కాగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమం బహిరంగ వేడుక కావడం విశేషం. పైగా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తుండటంతో మైక్రోసాఫ్ట్ బాగోతం ప్రపంచమంతా తిలకించింది. గాజాలోనూ, లిబియాలోనూ అమానీయ దాడులు చేస్తూ మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్ సైన్యం లక్షిత బాంబు దాడులు చేయడానికి కో పైలట్, ఓపెన్ ఏఐ వంటి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగిస్తోందని అసోసియేటెడ్ ప్రెస్ నిర్వహించిన పరిశోధనలో వెల్లడయ్యింది.

కార్మికోద్యమానికి బీటీఆర్ రచనలు స్ఫూర్తిదాయకం

- రణదివే వర్థంతిలో సీఐటీయూ సీనియర్ నాయకులు పి.రాజారావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్మికోద్యమానికి, కార్మిక సంఘాల నాయకత్వానికి బి.టి.రణదివే బోధనలు, రచనలు స్ఫూర్తిదాయకమని సీఐటీయూ సీనియర్ నాయకులు పి.రాజారావు చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో బి.టి.రణదివే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రణదివే చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులుగా సుదీర్ఘకాలం కార్మికోద్యమానికి నాయకత్వం వహించారన్నారనీ, కమ్యూనిస్టు ఉద్యమంలోకి 1928లో వచ్చి 1990 వరకు కొనసాగారని గుర్తుచేశారు. కార్మికోద్యమంలో కుల, మత, ప్రాంతీయ ఉద్యమాల ప్రభావం గురించి ఆయన విశ్లేషించారని తెలిపారు. శ్రామిక మహిళలను ఆర్గనైజ్ చేయాల్సిన ప్రాధ్యానతను నొక్కి చెప్పారని గుర్తుచేశారు. ప్రపంచ కార్మికోద్యమంలో రెండో ఇంటర్నేషనల్‌లో కూడా భాగస్వామిగా ఉన్నారని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ బీటీఆర్ స్ఫూర్తితో నేడు కార్మికవర్గ ఐక్యత కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న సామాజిక న్యాయ వారోత్సవాలను జయ ప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్.రావు, ఎస్వీ. రమ, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వై. సోమన్న, పి. సుధాకర్, ఎ. సునీత, తదితరులు పాల్గొన్నారు.

బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమలో బాయిలర్ పేలుడు

- పెను ప్రమాదం నుంచి తప్పించుకున్న కార్మికులు



నవతెలంగాణ-సదాశివపేట

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలోని నందికంది గ్రామ శివారులోని బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమలో ఉదయం ఐదు నుంచి ఆరు గంటల మధ్య సమయంలో బాయిలర్ పేలింది. అయితే ఈ సంఘటన కార్మికులు షిఫ్ట్ చేంజ్ అయ్యే సమయంలో జరగడం వల్ల కార్మికులకు ఎలాంటి హాని జరగలేదని తెలిసింది. అందులో ఒక కార్మికుడు ఒకే సారి భారీ శబ్దాన్ని వినడంతో భయాందోళనకు గురవడంతో అతన్ని అప్పటికప్పుడే పరిశ్రమ యాజమాన్యం ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ బాయిలర్ పేలడం వెనుక యాజమాన్య నిర్లక్ష్యం ఉందని తెలుస్తోంది. ఈ పేలుడు ఘటనపై అధికారులు స్పందించి వెంటనే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సీపీఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభల ప్రత్యేకం

2025, ఏప్రిల్ 2-6 మదురై



రెడ్ సిటీగా మదురై

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి నవతెలంగాణ ప్రతినిధి

మదురై వీధులన్నీ ఎర్రజెండాలతో నిండిపోయాయి. జనప్రవాహం సముద్రపు కెరటాలను తలపిస్తూ తరలివచ్చింది. అఖిల భారత మహాసభ ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం జరిగిన భారీ బహిరంగ సభకు శనివారం సాయంత్రం నుంచే కార్యకర్తలు, ప్రజల రాక ప్రారంభమైంది. ఆదివారం ఉదయానికి నగరంలో ఎక్కడ చూసినా ఎర్రజెండాలు, ఎరుపు వస్త్రాల్లో ఉన్న ప్రజలు, కార్యకర్తలు కనిపించారు. వీరిస్తున్న నినాదాలతో నగరం మారుమోగింది. 'సోషలిజం అజేయం... సోషలిజమే భవిష్యత్తు' వంటి నినాదాలు నగరంలో నలువైపులా ప్రతిధ్వనించాయి. తమిళనాడులోని వివిధ జిల్లాలతో పాటు, పొరుగునే ఉన్న కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఆదివారం ఉదయానికే మదురైకి చేరుకున్నారు. మరోవైపు వేలాది మంది రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు మదురై నగరాన్ని మైమరిపించింది. నినాదాలు చేస్తూ, పాటలు పాడుతూ బహిరంగ సభ జరిగే ఎస్. శంకరయ్య నగరంవైపు జన ప్రవాహం పోటెత్తింది. ర్యాలీలో, సభలో ఐదు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్టు స్థానిక నాయకులు తెలిపారు. ఇటీవల ఒక కార్యక్రమంలో నిద్రలేని నగరంగా రాష్ట్ర ప్రజలు భావించే మదురై.. రెడ్‌సిటీగా మారాలన్న ఆకాంక్షను తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వ్యక్తం చేశారు. ఆ ఆకాంక్షను నిజం చేస్తూ మహాసభ ముగింపు మదురైని అరుణారుణం గావించింది.

బిజీబిజీగా సీసీ తాత్కాలిక కార్యాలయం

సీతారాం యేచూరి నగర్: సీపీఐ(ఎం) అఖిల భారత 24వ మహాసభ ఆదివారం తుది దశకు చేరుకుంది. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ మహాసభ విజయవంతం కావడంలో ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్ర కమిటీ తాత్కాలిక కార్యాలయం పని చేసిన తీరు ఎంతో కీలకం. నివేదికలు, తీర్మానాలు, సవరణలు, ప్రతినిధుల అర్హతల సమాచారం తయారు చేస్తూ ఇక్కడి సిబ్బంది రోజుల తరబడి విరామం లేకుండా పనిచేశారు. ఢిల్లీ ఏకే జీ భవన్‌లో పనిచేస్తున్న ఎం.వి. సుమ, వి.ఎస్. నితిన్‌లతో పాటు ఇతరులు సీసీ ఆఫీస్ కార్యకలాపాలను సమన్వయం చేశారు. అలాగే తమిళనాడు బ్యాంకు, ఇన్సూరెన్స్ యూనియన్లలో పనిచేసే 15 మంది కార్యకర్తలు సహకారం అందించారు. మదురైలో జరిగిన పార్టీ మహాసభ కొన్ని విషయాల్లో భిన్నంగా ఉందని ఈ బృందా నికి నేతృత్వం వహించిన మురళీధరన్ చెప్పారు.

సాధారణంగా ప్రతినిధుల అర్హతలను సమావేశ చివరి దశలో మాత్రమే ఆమోదిస్తారు. కానీ ఈసారి ప్రారంభం కాకముందే ఆ సమాచారం సమర్పించి ఆమోదం పొందిన తర్వాతే ప్రతినిధులను అనుమ తించారు. ఈ సమాచారాన్ని సేకరించేందుకు ప్రత్యేక పోర్టల్‌ను అభివృద్ధి చేశారు. గత పార్టీ మహాసభతో ఈ సమావేశంలోని ప్రతినిధుల అర్హతలను పోల్చి చూసినట్టు ఆయన తెలిపారు.

ఎప్పటికప్పుడు అనువాదం

సీతారాంఏచూరి నగర్ (మదురై) నుంచి నవతెలంగాణ ప్రతినిధి


సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభ అంటేనే దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వందలాది మంది ప్రతినిధులు హాజరవుతారు. ప్రతినిధులు సహజంగానే వారి మాతృభాషలో మాట్లాడటానికి ఆసక్తి చూపుతారు. కార్మికవర్గ పార్టీ కావడంతో ఎక్కువ మంది ప్రతినిధులు ఆ వర్గాల నుంచే వస్తారు. దీంతో ఇంగ్లీషు ఉపన్యాసాలు కూడా అందరికి అర్థం కావడం ఒక్కోసారి సమస్యగా మారుతుంది. దీంతో ప్రతిసారి అనువాదం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మదురైలో జరుగుతున్న సమావేశంలో ఆ సమస్య తప్పింది. ప్రతినిధులు హిందీతో పాటు ఏ భాషలో మాట్లాడినా ఎప్పటికప్పుడు ఇతర భాషల్లోకి అనువాదం చేసే ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రతినిధులు హెడ్‌సెట్ పెట్టుకుంటే చాలు.. వారి భాషలోకి అనువాదమై పోతుంది. సాధారణంగా పార్లమెంటు వంటి అత్యున్నత స్థాయి సమావేశాల్లో ఈ అనువాద సాంకేతికతను వాడుతున్నారు. సీపీఐ(ఎం) మహాసభలో ఆ సాంకేతికతను వినియోగించారు.



హిందీ, ఇంగ్లీష్, మళయాళం, బెంగాలీ, తమిళం, తెలుగుతో పాటు మరికొన్ని భాషల్లోనూ ఈ అనువాదాన్ని అందుబాటులో ఉంచారు. దీనికోసం తమిళనాడు రాష్ట్ర కమిటీలోని సాంకేతిక, మౌలిక వసతుల కమిటీ ప్రత్యేకంగా ఒక యాప్‌ను అభివృద్ధి చేసింది. మహాసభ జరుగుతున్న హాలులో మాత్రమే పనిచేసేలా ఈ యాప్‌ను రూపొందించారు. చర్చల గోప్యతను దృష్టిలో ఉంచుకొని ఈ విధానాన్ని అవలంభించినట్టు తమిళనాడు రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతన్ తెలిపారు.

డీప్ సీ మైనింగ్‌ను నిషేధించండి

సీతారాం ఏచూరి నగర్ (మదురై)నుంచి నవతెలంగాణ ప్రతినిధి



దేశవ్యాప్తంగా కోట్లాది మంది మత్స్యకారుల జీవనాధా రాన్ని నాశనం చేస్తున్న డీప్ సీ మైనింగ్ విధానాన్ని నిషేధించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు అఖిలభారత మహాసభలో తీర్మానం చేసింది. కార్పొరేట్ లాభాలను దృష్టిలో ఉంచుకుని ప్రకృతి వనరులను ప్రయివేట్ రంగానికి అప్పగిస్తూ, సముద్ర జీవవైవిధ్యాన్ని అస్థిరపరుస్తూ, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను ఈ విధానం క్షీణింపజేస్తోందని తీర్మానంలో పేర్కొన్నారు. విధ్వంస కరమైన ఈ చర్య నుంచి మోడీ ప్రభుత్వం తక్షణమే వెనక్కి తగ్గాలని, కేంద్ర కమిటీ సభ్యుడు టి.ఎం. థామస్ ఐజాక్ ప్రవేశపెట్టిన తీర్మానంలో డిమాండ్ చేశారు. ఈ తీర్మానానికి కేంద్ర కమిటీ సభ్యుడు అలీ కిశోర్ పట్నాయక్ మద్దతు ఇచ్చారు. 'సముద్ర మ్యాపింగ్ చట్టం (2002)'కు 2023లో చేసిన సవరణలతో, లోతు సముద్రాల్లోని ఖనిజ వనరులను ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు దోపిడీ చేసుకునేలా అవకాశం కల్పించారు. 2023 వరకు, తీర ప్రాంతాల్లో మైనింగ్ ప్రారంభించేందుకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ లాంటి సంస్థలకే అనుమతి ఉండేది. కానీ చట్టంలో మార్పులు చేసిన తర్వాత, ప్రయివేట్ కంపెనీలకూ ఈ అనుమతి లభించింది. దీని ద్వారా నియంత్రణ లేని వనరుల దోపిడీకి తెరతీశారు. విచ్చలవిడిగా జరిగే ఈ మైనింగ్ వల్ల ప్రకృతి సహజంగా ఏర్పడిన రక్షణ వ్యవస్థలు బలహీనపడతాయి. ఫలితంగా సునామీ, తుఫానులు, భూకంపాలు, సముద్ర జీవుల నాశనం వంటి విపత్తులు సంభవించే అవకాశం ఉంది. భారీ స్థాయిలో కర్బన ఉద్గారాలు విడుదలవుతాయి. దీంతో గ్లోబల్ వార్మింగ్ మరింత తీవ్రతరం అవుతుంది' అని తీర్మానంలో పేర్కొన్నారు.



ఆర్గనైజేషనల్ రిపోర్టుకు ఏకగ్రీవ ఆమోదం

సీతారాంఏచూరి నగర్ (మదురై)నుంచి నవతెలంగాణ ప్రతినిధి

ఆర్గనైజేషనల్ రిపోర్టును సీపీఐ(ఎం) అఖిలభారత 24వ మహాసభ ఆదివారం నాడు ఏకగ్రీవంగా ఆమోదించింది. అంతకుముందు ఈ నివేదికపై ప్రతినిధులు చర్చలు జరిపారు. పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ ప్రతినిధులు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు సమాధానం ఇచ్చారు. అనంతరం మహాసభ ఈ నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం పార్టీ రాజ్యాంగానికి (పార్టీ కానిస్టిట్యూషన్) కొన్ని సవరణలను ప్రకాశ్‌కరత్ ప్రతిపాదించారు. వీటిని కూడా పార్టీ మహాసభ ఆమోదించింది.



వక్ఫ్ సవరణ ప్రమాదకర వ్యూహం

బహిరంగ సభలో కేరళ సీఎం పినరయి విజయన్

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం వివాదాస్పదమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకురావడం వెనుక ప్రమాదకరమైన వ్యూహం ఉందని కేరళ సీఎం పినరయి విజయన్ అన్నారు. అఖిలభారత మహాసభ ముగిసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 'ఈ చట్ట సవరణ ఒంటరిగా జరిగింది కాదు. ఇది ముందుగానే సిద్ధం చేసిన వ్యూహం. దీని వెనుక ముస్లింలను, క్రిస్టియన్లను ఒకరిపై మరొకరిని శత్రువులుగా చూపే వ్యూహం ఉంది' అని అన్నారు. మైనార్టీలను పరస్పరం ఢీ కొనేలా చేయడం ద్వారా లాభపడాలన్న లక్ష్యం దీనిలో ఉందని ఆయన చెప్పారు. ఆర్ఎస్ఎస్ చేస్తున్న ఈ కుట్రను గుర్తించడంలో కొందరు విఫలమయ్యారని, దీనిలో ఇరు మతాలకు చెందిన వారున్నారని చెప్పారు. 'ముస్లింలు, క్రిస్టియన్లు రెండు మతాలు మైనార్టీల కిందకే వస్తాయి, ఆర్ఎస్ఎస్ ఒక వ్యూహం ప్రకారం ఇరువురిని రెచ్చగొడుతోంది. వక్ఫ్ సవరణ చట్టం రాగానే ఆర్ఎస్ఎస్ అనుబంధ పత్రిక ఆర్గనైజర్ కేథలిక్ చర్చి ఆస్తుల గురించి రాసింది. ఇది కాకతీయంగా జరిగింది కాదు. కావాలనే రాశారు'. అని చెప్పారు. 'ఇప్పటికే ఆర్ఎస్ఎస్ గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలో ముస్లింలను లక్ష్యంగా చేసుకుంది. ఒడిశా, మధ్యప్రదేశ్‌లలో క్రిస్టియన్లు బాధితులవుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో హిందువులు కాని ఆదివాసులు దాడులకు గురవుతుంటే, కేరళలో కమ్యూనిస్టులను వేటాడుతున్నారు'. అని చెప్పారు. అంతకుముందే గౌరీలంకేశ్, కల్బూరి తదితర మేధావులను సంఘ్‌పరివార్ శక్తులు పొట్టనబెట్టుకున్నాయని ఆయన అన్నారు. ఈ విషయాలు తెలిసినప్పటికీ కొన్ని రాజకీయ పార్టీలు మోడీ ప్రభుత్వానికి మద్దతివ్వడం బాధాకరమని చెప్పారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ నయా ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని చెప్పారు. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం తమకు అన్ని విధాలా సహకరిస్తోందని, రెండు ప్రభుత్వాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, ఇవి భవిష్యత్‌లోనూ కొనసాగాలని అన్నారు.

సీపీఐ(ఎం) నూతన కేంద్ర కమిటీ

నవతెలంగాణ-మదురై

సీపీఐ(ఎం) 24వ జాతీయ మహాసభ 85 మంది సభ్యులతో కేంద్ర కమిటీని ఎన్నుకుంది. ఈ నూతన కేంద్ర కమిటీ ఎంఎ బేబీ ప్రధాన కార్యదర్శిగా 18 మంది సభ్యుల పొలిట్ బ్యూరోను ఎన్నుకుంది. కేంద్ర కమిటీ సభ్యులలో 20శాతం మంది మహిళలున్నారు. 85 మంది సభ్యుల కేంద్ర కమిటీలో 30 మంది కొత్తవారు ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

నూతన కేంద్ర కమిటీ సభ్యులు వీరే...

1. పినరయి విజయన్
2. బీవీ రాఘవులు
3. ఎంఎ బేబీ
4. తపన్ సేన్
5. నీలోత్పల్ బసు
6. ఎండీ సలీం
7. ఎ విజయరాఘవన్
8. అశోక్ ధావలే
9. రామచంద్ర డోమ్
10. ఎం.వి. గోవిందన్ మాస్టర్
11. వి శ్రీనివాసరావు
12. సుప్రకాష్ తాలూక్దార్
13. ఇష్ఫాకుర్ రెహమాన్
14. లల్లన్ చౌదరి
15. అవదేశ్ కుమార్
16. ప్రకాష్ విప్లవ్
17. మొహమ్మద్‌యూసుఫ్ తరిగామి
18. పికె శ్రీమతి (మహిళ)
19. ఇ.పి. జయరాజన్
20. థామస్ ఐజాక్
21. కె.కె. శైలజ (మహిళ)
22. ఎలమరం కరీం
23. కె రాధాకృష్ణన్
24. కె.ఎం. బాలగోపాల్
25. పి రాజీవ్
26. పి సతీదేవి (మహిళ)
27. సి.ఎస్. సుజాత (మహిళ)
28. జస్వీందర్ సింగ్
29. సుఖ్వీందర్ సింగ్ షెఖో
30. అమ్రా రామ్
31. కె. బాలకృష్ణన్
32. యు వాసుకి (మహిళ)
33. పి. సంపత్
34. పి. షణ్ముగం
35. టి వీరభద్రం
36. జితేంద్ర చౌదరి
37. హీరాలాల్ యాదవ్
38. శ్రీదీప్ భట్టాచార్య
39. సుజన్ చక్రవర్తి
40. అభాస్ రే చౌదరి
41. షమిక్ లాహిరి
42. సమ్మిట్ డే
43. డెబ్లినా హెంబ్రామ్ (మహిళ)
44. కె హేమలత (మహిళ)
45. రాజేంద్ర శర్మ
46. ఎస్ పుణ్యవతి (మహిళ)
47. మురళీధరన్
48. అరుణ్ కుమార్
49. విజూ కృష్ణన్
50. మరియం ధావలే (మహిళ)
51. ఎ ఆర్ సింధు (మహిళ)
52. ఆర్ కరుమలయన్
53. కె ఎన్ ఉమేష్
54. విక్రమ్ సింగ్

నూతన సభ్యులు

55. అనురాగ్ సక్సేనా
56. హెచ్.ఐ. భట్
57. ప్రేమ్ చంద్
58. సంజయ్ చౌహాన్
59. కె ప్రకాష్
60. టి. పి. రామకృష్ణన్
61. పుతలత్ దినేష్
62. సలీఖా (మహిళ)
63. అజిత్ నవలే
64. వినోద్ నికోల్
65. సురేష్ పాణిగ్రహి
66. కిషన్ పరీక్
67. ఎస్. గుణశేఖరన్
68. జాన్‌వెస్లీ
69. ఎస్ వీరయ్య
70. దేబబ్రత ఘోష్
71. సయ్యద్ హుస్సేన్
72. కొన్సోయికా ఘోష్ (మహిళ)
73. మీనాక్షీ ముఖర్జీ (మహిళ)
74. సమన్ పాఠక్
75. మానెక్ డే
76. నరేష్ జమాటియా
77. రతన్ భౌమిక్
78. కృష్ణ రక్షిత్ (మహిళ)
79. లోకనాథం
80. కె బాలభారతి (మహిళ)
81. డి. రమాదేవి (మహిళ)
82. టి జ్యోతి (మహిళ)
83. రాజేంద్ర సింగ్ నేగి
84. సాయిబాబు
85. -



బుల్డోజర్ రాజకీయాలను

అడ్డుకునే శక్తి ఎర్రజెండాకే

సీపీఐ(ఎం) సీనియర్ నేత బృందాకరత్

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వంతో పాటు బీజేపీ, ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అనుసరించే బుల్డోజర్ రాజకీయాలకు అడ్డుకునే శక్తి ఎర్రజెండాకు మాత్రమే ఉందని సీపీఐ(ఎం) సీనియర్ నేత బృందాకరత్ అన్నారు. ఆదివారం ముగిసిన 24వ మహాసభలో పొలిట్‌బ్యూరో నుంచి ఆమె రిలీవ్ అయ్యారు. కేంద్ర కమిటీకి ఆహ్వానితులుగా ఉన్న బృందాకరత్ మహాసభ అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రజల హర్షధ్వానాల మధ్య మాట్లాడుతూ ఇప్పటికే ఎర్రజెండా అనేకచోట్ల బుల్డోజర్ హింసను అడ్డుకుందని అన్నారు. సీతారాం ఏచూరి, కొడియేరి బాలకృష్ణన్, బుద్ధదేవ్ వంటి నేతలతో పాటు ఎందరో అమర వీరులు ఇచ్చిన స్ఫూర్తితో పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. 24వ మహాసభ సంక్షోభ సమయంలోనూ పార్టీ ఐక్యంగా, సమర్థవంతంగా పనిచేయగలిగిందని నిరూపించిందని చెప్పారు. ఏచూరి అనూహ్య మరణం తరువాత కూడా పార్టీ శ్రేణులు మతోన్మాదం మీద, ప్రజాసమస్యల మీద పోరాటాలు చేసి ఆయనకు ఘన నివాళు లర్పించాయని చెప్పారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపారు. ఈ సభలో సీపీఐ(ఎం) సీనియర్ నేత ప్రకాశ్ కరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, బాలకృష్ణన్, వాసుకి ఆహ్వానసంఘ కోశాధికారి రామకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.







వాగ్దానం


ఈ కంటికి చీకట్లో ఎక్కడినుండి ఎక్కడికో
నడిచీ నడిచీ అలసిపోయి
ఎక్కడో విశ్రమించాను
కళ్లు తెరిచి చూస్తే
మెడకు పాములు చుట్టుకొని
బుస కొడుతున్నాయి
భుజాల మీద వాలిన నెమళ్లు
ముక్కుతో గీరుతున్నాయి
ఛాతీ మీద తాబేలొకటి కన్నీళ్లతో రోదిస్తోంది
కడుపు మీద తలపెట్టిన జింకలు
ఆకలిని చప్పరిస్తున్నాయి
వాటి గుండెల్లో ఏదో సొద ఉంది
లేచి చూడలేను గాని
సకల జీవరాశి నా పాదాల మీద పడి ఉంది
నేనేం చేయగలను
నేనో పనికిమాలిన ఓటరును
గుట్టలను తొవ్వినా అడవులను నరికినా..
భూములను అమ్ముకున్నా..
ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్లు దోచుకున్నా..
ఆ కీచకులను చూస్తూ
మౌనం పాటించే దారిన పోయే దానయ్యను
ఇప్పుడు ప్రశ్న నుదుటి మీద
తుపాకీ పెట్టబడి ఉంది
ఇప్పుడు ఉరిమే గొంతు మీద
కత్తి పెట్టబడి ఉంది
ఇప్పుడు అక్షరం చుట్టూ
ఊచల కంచెలు మొలుచుకొస్తున్నాయి
ఏం చేయమంటారు
కదిలితే ప్రాణం పోతుంది
ఇంతకుముందే చెప్పానుగా
మెడ చుట్టూ సర్పాల ఉచ్చు
బిగుసుకొని ఉంది
మూగజీవులారా మీరేం బాధపడకండి
ఎంతకాలమైనా సరే
ఈ అరణ్యాన్ని గాలిస్తాను
శిథిలమైపోతున్న ఒక అమరవీరుడి
స్థూపాన్ని కనుక్కుంటాను
వెలిసిపోయిన జెండాకు నెత్తురు పులిమి
కొత్త పొద్దుగా ఎగరేస్తాను.
(హెచ్.సి.యు విధ్వంసాన్ని చూసి)

- మౌనశ్రీ మల్లిక్, 8919338546

'కనికట్టు' కథలు

ఇవి కథలు మాత్రమే కావు. గ్రామజీవన దృశ్యాలు. ప్రకృతిని తమలో ఇంకించుకున్న ప్రజల అంతరంగ చిత్రణలు. కవి హృదయాన్ని ఇముడ్చుకున్న కథకుడి మనోహర అభివ్యక్తులు. పాఠకుడిని తన వెంట తీసుకువెళ్లే నాదస్వరాలు.

నందిని సిధారెడ్డి వీటి రచయితేకానీ, ఇవి అతను కల్పించిన కథలు కావు. అతను పుట్టిన చోటు, అక్కడి సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు, విశ్వాసాలు, అనుబంధాలే కథలయ్యాయి. ఈ కథలు రాయడానికి కథకుడికి అవసరమైందల్లా పాత జ్ఞాపకాలను తలచుకున్నపుడల్లా మళ్లీ అనుభవించగలగడం. తన అనుభవాలు, అనుభూతులను సార్వజనీనం చేయడానికి ప్రయత్నించడం. ఇది ఇటీవల కథారచనలో నడుస్తున్న ధోరణే. అటువంటి కథల జాబితాకు ఈ సంకలనం మరో చక్కని చేర్పు.



బందారం కథల్లో అక్కడి భౌగోళిక పరిస్థితి, జనజీవనం ఉంటుంది. అక్కడి వృత్తులు, కళాకారులు ఉంటారు. అక్కడి ప్రకృతి, వర్గ, కుల, లింగ స్వభావాలు, వృత్తి కళాకారులే ఇందులోని పాత్రలు. అయితే వీటన్నిటినీ ఏకరువు పెడితే అది డాక్యుమెంటరీ అవుతుంది. వ్యాసమవుతుంది. ప్రాపంచిక దృక్పథం, రచనాశిల్పం, పాత్ర చిత్రణానైపుణ్యం అనే ముడిసరుకు సిధారెడ్డి వద్ద వున్నాయి. ఇవి మూడూ ఉన్నాయి కనకనే ఇవి మంచి కథలు.

ఈ కథల్లో వస్తువేమిటి? అని ప్రశ్నించుకున్నపుడు తరతరాలుగా ఉన్న విశ్వాసాలు (చినికి చినికి వాన మరికొన్ని), బాధ్యతారాహిత్యం, స్వార్థం మూర్తీభవించిన మగవాళ్లు (జంజాటం, కుంజీలు), స్వంత వ్యక్తిత్వం కలిగిన స్త్రీలు (యశోద వెంట, జాయిజాద్, మనసు పాడుగాను), వృత్తి కళాకారుల జీవితాలు మొదలైనవి. ఇందులో వస్తువులన్నీ తెలుగు కథకు కొత్తవి కావు. కానీ రచన మాత్రం ప్రత్యేకమే. అలాగే కొన్ని ప్రత్యేకమైన కథలు ఈ సంకలనాన్ని ప్రత్యేక రచనగా నిలబెడతాయి. అవి ఇక్కడ సంస్కృతికి సంబంధించినవి. పాటలు, నృత్యాలు, ఆచారాలు, వృత్తినైపుణ్యాలు, నమ్మకాలు కలగలిసినవి. బందారం జానపద సంస్కృతిని కళ్లకు కట్టించేవి. అక్కడి జీవన శకలాలను, అక్కడి జన జీవితంలోని అతిచిన్న విషయాలను కూడా రూపుకట్టించేవి.

అలాంటి మంచి కథల్లో ఒకటి ఋణానుబంధాలు. తనకు ఐశ్వర్యం తెచ్చిపెట్టిన ఆవు చనిపోతే ఊరి షావుకారు చాలా బాధపడతాడు. దానికి శాస్త్రోక్తంగా, మనిషికి చేయించినట్లుగా దహనకాండ జరిపిస్తాడు. ఆ క్రమం మొత్తం కళ్లకు కట్టినట్టు చిత్రిస్తాడు రచయిత. దాన్ని ఊరేగింపుగా తీసికెళ్లి దహనం చేసేవరకూ కుంటుకుంటూ అందరి వెంటా నడుచుకుంటూ వచ్చిన ముసలమ్మను చూసి జనం నవ్వుకుంటారు. నిజానికి ఆ ఆవు తల్లి ఈ ముసలమ్మదే. తన నాన్నమ్మను బతికించుకోడానికి డబ్బులేక, ఈ ఆవుతల్లిని ఈ ఆవు గర్భంలో ఉండగా, ముసలమ్మ షావుకారికి అమ్మేసింది. అదే ఆవుకు ఇప్పుడు వైభవంగా దహనకాండ జరిగింది. అప్పుడు తన నాన్నమ్మ దిక్కులేక మరణించింది. ఇప్పుడు ఈ ఆవుకు ఘనంగా దహనకాండ జరుగుతోంది. ఈ వైరుధ్యాన్ని చక్కని ఐరనీతో చెప్తాడు రచయిత.

ధ్వనిగర్భితమైన మరోకథే శాసనం. కొమరయ్యను ఊళ్లో అందరూ తక్కువగానే చూస్తారు. ఇంట్లో కూడ గారాం చేసేవాళ్లు, ఖాతరు చేసేవాళ్లు లేరు. తనను ఏ దుకాణదారుడూ కూర్చోనివ్వడు. ఎక్కడా ఆదరం లేదు. చివరకు చింతమొద్దు మీద కూర్చున్నా తరిమికొడతారు. కానీ.. పీర్ల పండగరోజు నిప్పులు రాజేస్తున్నప్పుడు, కట్టెలు తక్కువయ్యాయని పెద్దలంటారు. కొమరయ్య కట్టెలు వెతికి తెచ్చేందుకు సిద్ధపడతాడు. పరిగెత్తుకు వెళ్లి, తనను కూర్చోనివ్వని చింతమొద్దును తెచ్చి కాష్టంలో వేస్తాడు. అది చక్కగా రాజుకుని కాలి బూడిదవుతుంది. తనను కూర్చోనివ్వని చింతమొద్దును తగలబెట్టిన ఆనందం. ఎక్కడా వాచ్యం చెయ్యకుండా చివరి వాక్యంతో కొమరయ్య పగతీర్చుకున్నాడని పాఠకుడికి ధ్వనింపజేస్తాడు రచయిత.

వాచ్యత లేకపోవడమన్నది సిధారెడ్డి కథల్లో సామాన్య లక్షణం. రచయితగా ఎప్పుడూ తెరవెనక ఉండిపోవడమే అతనికిష్టం. ఒక ఘట్టాన్ని లేదా పాత్రను మనముందుంచి, తను తెర వెనక్కి తప్పుకోవడం ఈ రచయిత అలవాటు. ఆ పాత్రను గురించి రచయిత ఏం చెప్పదలుచుకున్నాడు? కథ ద్వారా అందించాల్సిన సందేశం లేదా అవగాహన ఏమిటి? ఇవేవీ మనకు స్పష్టం కాని కథలున్నాయి. అలాంటి విలక్షణమైన కథే బంగారు గురిగి.

> **వాచ్యత లేకపోవడమన్నది సిధారెడ్డి కథల్లో సామాన్య లక్షణం. రచయితగా ఎప్పుడూ తెరవెనక ఉండిపోవడమే అతనికిష్టం. ఒక ఘట్టాన్ని లేదా పాత్రను మనముందుంచి, తను తెర వెనక్కి తప్పుకోవడం ఈ రచయిత అలవాటు. ఊరే. ఈ కథల్లో ప్రధాన పాత్ర. ఊరు మానవీకరణ చెందిందనుకుంటే అది ఎలాంటి మనిషి? ఎల్లప్పుడూ ఉదాత్తంగా ఉంటుందా? హీరోయిజం ప్రదర్శిస్తుందా? న్యాయం పక్షం వహిస్తుందా? లేదు. ఆ గ్యారంటీ లేదు. బీభత్సం ప్రధానమైన 'చెద్ద గడియ' కథలో ఊరు ప్రేక్షకపాత్రే వహిస్తుందంటాడు రచయిత.**

కానీ అన్ని కథల్లోనూ ఈరకమైన వ్యూహం లేదు. సమగ్రచిత్రణకు నోచుకున్న పాత్రలూ ఉన్నాయి. ఉదాహరణకు 'కుంజీలు' లో కమల, 'యశోద వెంట' లో యశోద, గడీలవాడులో హనుమంతరావు, 'జాయిజాద్'లో జానమ్మ. అన్నిటికంటె చక్కని చిత్రణకు నోచుకున్నది ఏ వ్యక్తీ కాదు. బందారమనే ఆ ఊరే. ఈ కథల్లో ప్రధాన పాత్ర. ఊరు మానవీకరణ చెందిందనుకుంటే అది ఎలాంటి మనిషి? ఎల్లప్పుడూ ఉదాత్తంగా ఉంటుందా? హీరోయిజం ప్రదర్శిస్తుందా? న్యాయం పక్షం వహిస్తుందా? లేదు. ఆ గ్యారంటీ లేదు. బీభత్సం ప్రధానమైన 'చెద్ద గడియ' కథలో ఊరు ప్రేక్షకపాత్రే వహిస్తుందంటాడు రచయిత. క్రియాశీలకంగా ఉండాలన్న నియమం ఊరికి లేదు. ఘోరాలు జరుగుతున్నా చూస్తూ ఊరుకుంటుంది. బాకీ' కథలో ఊరంతటికీ ప్రమాదం వచ్చినపుడు ఎక్కడలేని ఐకమత్యం వచ్చేసి, ఆ ప్రమాదఘడియ దాటగానే 'షరా మామూలే'. ప్రవృత్తి తలెత్తడం సర్వసాధారణమని చూపిస్తాడు రచయిత (ఈ కథ చదివితే అమరావతి కథల్లో 'వరద' కథ గుర్తుకొస్తుంది). ఇది 1979 లో స్కైలాబ్ కిందపడి అందరూ చనిపోతారని భారతదేశంలో విస్తరించిన వదంతి ఆధారంగా రాసింది. ఊళ్లో అందరూ అప్పులూ, సొప్పులూ లేకుండా కలిసిపోయి, చివరి దినం తాగుతూ, తింటూ ఆనందంగా గడపడం, వైషమ్యాలు మరిచిపోవడం చక్కగా చిత్రిస్తాడు రచయిత. రాత్రికి స్కైలాబ్ తునకలు సముద్రంలో పడిపోయాయి కనక ఊరికి భయం లేదని రేడియోలో చెప్పాక, మళ్లీ మామూలే. అందరి గొడవలూ యథాతథం.

అపుడపుడూ ఊరు సాక్షిగానే ఉన్నా, చాలాసార్లు ఊరు మంచికి కూడా పూనుకుంటుంది. 'నన్నెజీవులు'లో అల్లుడిని వేధించుకు తింటున్న కుటుంబానికి బుద్ధిచెప్పి, అతన్ని బతికించింది ఊరు. 'తడిసి మోపెడు'లో యువతలోని పౌరుషాన్ని రోషాన్ని అభినందించింది ఊరు. 'ఉన్నదీ లేనిదీ'లో ఊరు వదిలి వెళ్లిపోవడంలో ఇమిడిన విషాదాన్ని వ్యాఖ్యానించింది ఊరు.

కళ కన్నీళ్ల కథ జానపద వృత్తిగాయకులైన శారదకండ్ర కథ. తమ కళ ద్వారా పదిమందినీ ఏడ్పించే వీరికి జీవితంలో మిగిలేవి కన్నీళ్లే. వారి కట్టమైసమ్మ కథాగానం నేపథ్యంలో చాలా అందంగా అల్లిన కథ ఇది. ఇంతకూ వాళ్లకు కళే బ్రతుకా? బ్రతకడం ఒక కళా? రెండూనూ.

కథలలో పాటను ఇంత విరివిగా, సందర్భోచితంగా వాడుకున్న రచయితలు చాలా అరుదు, బహుశా లేరేమో. వాన రావాలని వర్షదేవుణ్ణి కోరుతూ పిల్లలు పాడే పాట దగ్గర్నుంచీ, కట్టమైసమ్మ వీరగాథను చెప్పిన శారదకాండ్రవరకూ ఈ కథలన్నిటా పాటలు అలరిస్తాయి. మౌలికంగా కవి అయిన సిధారెడ్డి ఏ వస్తువునైనా, వాతావరణాన్నయినా, వ్యక్తినైనా చక్కగా వర్ణించగలడు. బందారం కథల్లో భాషలోని సొగసు ఈ వర్ణనలను మించి కథనానికి కథలకూ వన్నె తెచ్చింది.

ఈ కథల మర్మం మొదటి కథలోనే సూచిస్తాడు రచయిత. 'మావూరు తీరు' అంటూ. బందారం కనికట్టుకు ప్రసిద్ధమైన పూరట. కనకే ఈ రచనలో కథ, కథనం, పాత్రలు– అన్నిటిలోనూ మార్మికత ఉంటుంది, గుట్టుచప్పుడు ఉంటుంది. పొరలుంటాయి. ఆ పొరలను విప్పుకుంటూ వెళ్లాలనే ఉత్సాహం, ఉద్వేగం కల్పించే శైలివుంటుంది. అందుకే ఇవి మంచి కథలు, చదవదగ్గ కథలు, చదివి తీరాల్సిన కథలు.


- మృణాళిని

నగరం పునాది కింద

ఈ నగరం పునాది
ఎన్ని పచ్చని చెట్లను పెకిలించిందో కదా
నా తల గడ కింద
వన్నెల నెమళ్ల నాట్యం ఆడేవి కావచ్చు
కిర్రు మంటున్న ఆరాం కుర్చీ కింద
ఆకులు స రాగాలు కురిపించేవి
అందమ్మైన దృశ్యాలన్నింటినీ ఆర్ సి సి
అస్తమయం చేసి అభివృద్ధి నంగనాచి మాటలు
సెలయేరు సవ్వడి చేసే చోట
మెషిన్ లు మోతాదు మించిన మోతలు
అందమ్మైన ఆకృతుల రాళ్లను
క్రష్ ర్లు కంకర రాళ్లను చేశాయి
గుట్టలు గల్లంతు అయి పోయాయి
పశు పక్షాదులకు పరమాత్ముని వరంగా
దాహం తీర్చిన తాడి చెట్టు లోతు చెరువులు
లే అవుట్ కుట్ర లకు తాంబూలాలు గా
నీడను ఫలాల ను
ప్రసాదించిన వృక్ష రాజులు గతించి
పక్షి కూడా వాలని మొక్కలు
పలు వరుసలుగా వెక్కిరిస్తున్నాయి
హోర్డింగ్ బోర్డులు గాలిని బంధించాయి
చౌరస్తా దిక్కు తోచని కూడలి
రోడ్డు మీద నీడ కరువు అయి
ఎలెక్ట్రికల్ పోల్ కింద ఎతకాలిసిన రోజులు
పొలాల్లో రియల్ ఎస్టేట్ జెండాలు వెలిసి
కాసులు కూడ బెట్టు కోవడం కొత్త విద్య
NALA చట్టం నల్ల రేగడి నేలలను సైతం
నాగల్ల కు దూరం చేసి ఎండ పెట్టారు
తొవ్వ కు తోరణములు గా ద్రాక్ష తోటలు
పాత జ్ఞాపకాలు గా మిగిలి పాయె
పాడి పంటలు వదులుకుని రైతులు
ATM ముందు సెక్యూరిటీ గార్డులుగా
నాగరికత అంతా ఇప్పుడు
అనుమతి లేని దిగుమతి సరుకు
మనిషి కోరికలను సమూలంగా కూల్చితేనె
చెట్టు చేమ కు తిరిగి న్యాయం చేకూర్చు
చల్లని గాలి కోసం తనువు తపస్సు
ఎయిర్ కండీషన్స్ ఎక్కువయి ఓజోన్ తుస్సు
నగరం పునాది కింద
లిఖించలేని విచ్చిత్తి పూడ్చ లేనంతగా ....

- దాసరి మోహన్, 9985309080

నన్ను మరింత దృఢంగా మలిచిన నవల



వార్తా పత్రికల్లో ప్రచురితం అయ్యే చిన్న చిన్న కథలు, కవితలు, సామాజిక, రాజకీయ వ్యాసాలు చదవడం ద్వారా నాకు సాహిత్యం పట్ల అభిరుచి ఏర్పడింది. డిగ్రీ వరకు తెలుగు సాహిత్యాన్ని ఆసక్తిగా చదవుకున్న నాపై హిందీ సాహిత్య ప్రభావం పడింది. సామాజిక స్పృహను, సామాజిక దోపిడీ, భూస్వామ్య పెత్తందారి రుగ్మతలను ప్రేమ్ చంద్ తన నవలల ద్వారా ప్రతిబింప జేసిన విధానం ఆకట్టుకొని, నన్ను మొత్తం హిందీ సాహిత్యం వైపు ఆకర్షించేలా చేసింది. ఆ తర్వాత హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పిజీ చేస్తున్నప్పుడు హిందీలో ఉత్తమ రచనల వెతుకులాటలో దొరికిన అరుదైన పుస్తకం 'ఓం ప్రకాష్ వాల్మీకి' రాసిన 'జూఠన్' ఒక అంటరాని వాని ఆత్మకథ. ఇది ఓంప్రకాష్ జీవితచరిత్ర, దళిత సమాజం తాలుకు సమస్యలకు సంబంధించినది. సమాజంలో మనుషుల్లా ఉంటూ జంతుజీవితాలను జీవిస్తున్న అభాగ్యుల జీవుల చిత్రణ ఈ నవల. జూఠన్ అంటే 'ఎంగిలి' అని అర్థం.

ఇది నన్ను నేను పోల్చి చూసుకునేలా, ఓదార్చుకునేలా, నన్ను నేను మరింత దృఢంగా మలచుకోవడానికి ఎంతగానో ప్రభావితం చేసిన ఆత్మకథ. దుఃఖం, బాధ, వేదనాభరితమైన పీడనతో నిండిన ప్రపంచం ఈ ఆత్మకథలో విస్తరించి ఉంది. వీటన్నింటినీ దాటుకుని ఓం ప్రకాశ్ వాల్మీకి ఎలా పెరిగాడు, ఎలా జీవించాడు, తనను తాను ఓ దృఢమైన తిరుగుబాటు శక్తిగా ఎలా వృద్ధి చేసుకున్నాడనేది ఈ ఆత్మకథ. ఇది కేవలం ఒక వ్యక్తి ఆత్మకథ మాత్రమే కాదు. మొత్తం దళిత సమాజం తాలూకు దుఃఖం, బాధ, పోరాటం, సామాజిక సమస్యలను వ్యక్తపరచే ఓ గొప్ప రచన. డా. జీవి. రత్నాకర్ తెలుగు అనువాదానికి జి. కళ్యాణ్ రావు తన ముందుమాటలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు.

తన కొడుకు బాగా చదువుకుని పెద్దవాడై ఈ నరక జీవితం నుంచి విముక్తి పొందాలని, కులాన్ని సంస్కరించాలని, మొత్తం దళిత సమాజాన్ని బాగు చేయాలనే తండ్రి కోరిక. అందుకోసం తండ్రి, కొడుకులు చేసిన తిరుగుబాటు చరిత్రే ఈ జూఠన్. అయితే ఈ ప్రయాణంలో తానూ అనుభవించిన నరకయాతను చిత్రీకరించిన తీరు మనల్ని కలచివేస్తుంది. జూఠన్ తన పాఠశాల రోజుల్లో ఎదురుకున్న అనేక సంఘటనల గురించి ప్రస్తావిస్తూ "మిగతా వారి నుండి నేను చాలా దూరంగా నేలపైన కూర్చుండేవాడిని. నేను కూర్చున్న చోటు వరకు చాప ఉండేది కాదు. కొన్ని సమయాల్లో అందరికంటే వెనక కూర్చోవలసి వచ్చేది. చాలాసార్లు నన్ను అకారణంగా కొట్టేవారు. ఒకసారి ఓంప్రకాశ్ 4వ తరగతిలో ఉన్నప్పుడు ప్రధానోపాధ్యాయుడు అతడిని పాఠశాల, ఆటస్థలం శుభ్రపరచమని హుకుం జారీ చేసేవాడు. నిండా పదేండ్లు లేని ఆ పిల్లవాడ్ని ఆ పని తీవ్రమైన వెన్ను నొప్పితో బాధించేది. నీళ్లు తాగడానికి కూడా అనుమతించేవాడు కాదు. అలా ఓం ప్రకాశ్‌తో పాఠశాలను, మైదానాన్ని అనేక సార్లు ఊడ్పిస్తారు. ఇదంతా గమనించిన ఓంప్రకాశ్ తండ్రి తన కొడుకు చేయి పట్టుకొని వెళ్ళిపోతూ ఉపాధ్యాయులందరితో "మీరు ఉపాధ్యాయులు... కాబట్టి వదిలి వేస్తున్నాను... కాని మీరు ఒక విషయం గుర్తుంచుకోండి... ఇతడు ఇక్కడే... ఈ పాఠశాలలోనే చదువుతాడు. వీడు ఒక్కడే కాదు, వీడి తర్వాత కూడా చాలామంది చదువుకుంటారు. ఒరేయ్ మా పిల్లవాడు రెండు అక్షరాలు నేర్చుకుంటే నీదేం పోయింది. నిన్ను ఎందుకు బ్రతిమిలాడాలి" అని హెచ్చరిస్తాడు. ఈ ఘటన ద్వారా దళితులకు విద్యను దూరం చేయడానికి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేశారో అవగతమవుతుంది. జూఠన్ ఆత్మకథ అమితంగా నన్ను ఆకట్టుకోవడానికి నా స్వీయానుభూతులే కారణం. అవన్నీ ఈ ఆత్మకథను చదువుతున్నంతసేపూ నేమరేసుకున్నాను. కండ్ల నీళ్ళను అదుపు చేసుకున్నాను. ఈ వేధింపుల వల్ల చదువుకు దూరమైన నా మిత్రుల ఘోషను మళ్లీ ఒక సారి స్మరించుకున్నాను. అకారణంగా ఎస్సీ హాస్టల్ విద్యార్థులను కొట్టినప్పుడు, ఒళ్ళంతా వాతలతో వాచిపోయిన తీరు గుర్తొస్తే ఇప్పటికీ వెన్నులో వణుకు పుడుతోంది.

అప్పుడు ఓంప్రకాష్ వాల్మీకి పాఠశాలలో హింసకు, చీత్కారానికి గురి కాబడ్డా, పాయకానాలు కడిగించడం లాంటివి చేపిస్తూ మీకు చదువు ఎందుకు అన్న మాటలు టీచర్లచేత అనేక సార్లు విని, బెత్తంతో తీవ్రంగా దెబ్బలు తిని విద్యకు దూరం చేయబడినా, నాలాంటి వాళ్ళు అకారణంగా దెబ్బలు తిన్నా, గాయాలపాలైనా కారణం ఒక్కటే కులం. అదే విషయాన్ని 'జూఠన్' నవల స్పష్టం చేస్తోంది.

- సిలపాక వెంకటాద్రి, 9133495362

సాహితీ వార్తలు

నందిని సిధారెడ్డికి చెన్నకేశవరెడ్డి పురస్కారం

డా॥ చెన్నకేశవరెడ్డి పురస్కారాన్ని ఈ ఏడాది సుప్రసిద్ధ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డికి బహూకరిస్తారు. ఈ పురస్కార సమర్పణ ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాదులోని రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఈ సభకు డా. అమ్మంగి వేణుగోపాల్, ఆచార్య అనుమాండ్ల భూమయ్య, డా. ఏనుగు నరసింహారెడ్డి, డా. నాళేశ్వరం శంకరం, ఎం.కె. రాము, ఆచార్య ఎం. శంకర్ రెడ్డి, డా. పి.లక్ష్మీనారాయణ, డా.తూర్పు మల్లారెడ్డి, చీకోలు సుందరయ్య డా. గంటా జలంధర్ రెడ్డి, డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు పాల్గొంటారు.

- డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు, సంధానకర్త

'మేలిమి చింత' ఆవిష్కరణ

ప్రమోద్ ఆవంచ కవితా సంపుటి - 'మేలిమి చింత' ఆవిష్కరణ సభ ఏప్రిల్ 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాల్‌లో జరుగుతుంది. సభకు కవి యాకూబ్ అధ్యక్షత వహిస్తారు. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఎన్. వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. రావూరి చంద్రశేఖర్ రెడ్డి (మాజీ ఎం.పి.) విశిష్ట అతిథిగా పాల్గొంటారు. డా. రూప్ కుమార్ డబ్బీకార్, కాసుల ప్రతాప్ రెడ్డి, కందుకూరి అంజయ్య, చల్లా రామఫణి, గాజోజు నాగభూషణం. వేదాంత సూరి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారు.

- పాలపిట్ట బుక్స్, 9848787284

మూఢనమ్మకాలను ఛేదించే మంత్రదండం

నేటి బాలలే రేపటి పౌరులు... ఆధునిక భవిష్యత్ పౌర సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలి. తల్లిదండ్రులు, గురువులు, బాల సాహితీవేత్తలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు తమ వంతు కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలి. కథలు కవిత్వం సాహిత్యంలోని వివిధ ప్రక్రియల ద్వారా పిల్లల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించాలి. చిన్న వయసులోనే పిల్లల్లో దిద్దుబాటు జరిగితే అది భావి జీవితానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఆ భారం బాధ్యత ఎక్కువగా మోయాల్సింది బాల సాహితీవేత్తలే. ఇలా ఎందుకు అంటున్నానంటే ఇంకా తల్లిదండ్రులలో నిరక్షరాస్యులు ఎక్కువే! అక్షరాస్యులైన తల్లిదండ్రులలో తీరిక ఉన్నవారు బహు తక్కువ. వీరంతా తమ పిల్లల్ని దగ్గర కూర్చోబెట్టుకొని మంచి చెడులు నేర్పడం అంటే అంత తేలిక కాదు.

ఇకపోతే మనకు మిగిలిన మార్గదర్శకులు గురువులే! అయితే వీరు సిలబస్‌ను అనుసరించి బోధించవలసి ఉంటుంది. పూర్తి స్వేచ్ఛ వీరికి ఉండదు. పరీక్షలు మార్కులు, ర్యాంకుల కోసం, చదవడం అలవాటైన విద్యార్థులు సైతం సిలబస్‌లోని విషయపరిజ్ఞానాన్ని తేలికగా వదిలేస్తున్నారు. అలా కాకుండా నేటి బాలబాలికలు భావి జీవితంలో మంచి పౌరులుగా ఎదగడానికి ఎలాంటి భావజాలం అవసరమనేది ఉపాధ్యాయులుగా స్థిరపడిన సాహితీవేత్తలు. గుర్తించగలిగే అవకాశాలు వారికి మెండుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయురాలిగా ఉత్తమ సేవలు అందిస్తూ, విద్యార్థులను సృజనాత్మకంగా అభివృద్ధిలోకి తీసుకురావాలనే సదుద్దేశంతో డాక్టర్ ఉప్పల పద్మ తన విద్యార్థుల చేత కథలు రాయించారు. తానే, సంపాదకులుగా 'మంత్రదండం' అనే కథల పుస్తకం తీసుకువచ్చారు. గుండ్రాంపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, విద్యార్థినీ విద్యార్థులు రాసిన కథలివి. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారు కావడంతో, పల్లె ప్రజల్లో పాతుకుపోయిన మూఢనమ్మకాలను, పిల్లల్లో నాటుకుపోయిన అపనమ్మకాలను, తొలగించడానికి వివిధ ఇతివృత్తాలను విద్యార్థులకు ఇచ్చి కథలు రాయించారు. ఇందులో మొత్తం 19 కథలు ఉన్నాయి. పదునెనిమిది కథలు విద్యార్థులు రాయగా చివరి కథను సంపాదకులు రాశారు.



సాధారణంగా బాలల కథా సాహిత్యాన్ని రెండు రకాలుగా చెప్పొచ్చు. పెద్దలు పిల్లల కోసం రాసే కథలు ఒక రకం కాగా, పిల్లలు రాసే కథలు మరోరకం మంత్రదండం కథా సంపుటిలోని కథలు రెండో రకం కథలు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని తీసుకురావాలనే సత్సంకల్పంతో సంపాదకులు చేసిన ప్రయత్నం సీరియస్ గానే కనిపించింది. 'సైన్స్‌లోని మ్యాజిక్కును ఆలంబనగా చేసుకుని (సున్నపు నీళ్లలో పసుపు కలవడం ద్వారా ఎరుపు ఎక్కటం) ఒక మంత్రగాడు రామాపురం గ్రామ ప్రజలను మోసం చేయబోగా అదే ఊరిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అడ్డుకుంటాడు. ఇది బయటపడ్డం నిజం కథలోని సారాంశం. 9వ తరగతి చదువుతున్న రిత్విక్ గౌడ్ రాసిన ఈ కథ మంత్రదండం కథా సంపుటిలో మొదటిది. చదువుకుంటే శాస్త్రీయమైన దృక్పథాన్ని ఎలా పెంపొందించుకోవచ్చునో తెలియజేస్తుంది. నాలుగు తోవలు కలిసిన దారిలో తిప్పేసిన నిమ్మకాయలను తొక్కడం ద్వారా ఇద్దరు స్నేహితులు కలవరపడతారు. అందులో ఒకరికి జ్వరం రావడంతో అతడు జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్తాడు. వారు స్వామీజీ దగ్గరికి వెళ్లాలని నిశ్చయించుకున్న తరుణంలో డాక్టర్ ఇంటికి వచ్చి మందులు ఇస్తాడు. దాంతో జ్వరం తగ్గిపోతుంది. 'నిమ్మకాయలకు జ్వరం రాదు' ఈ కథలోని సారాంశం. ఈ కథ ఆరవ తరగతి విద్యార్థిని జి అక్షిత రాశారు. మూడవిశ్వాసాలను విపరీతంగా నమ్మే మల్లమ్మ సంఘయ్య దంపతులు స్వామీజీ నుండి తమ కూతురిని ఎలా కాపాడుకున్నారో తెలియజేసే కథ ఉపాయం. (రచన– కే. శ్రీవల్లి పదవతరగతి)

అమావాస్య రోజు బయటకు వెళ్ళొద్దని మంత్రాలు చేసి తిప్పేసుకుంటారని పెద్దలు పిల్లలకి భయాన్ని నూరి పోస్తుంటారు. కానీ బి అక్షిత 'భయం లేదు గియం లేదు' కథలో ఒక ముసలమ్మ పాత్ర ద్వారా ఇవన్నీ వట్టి పిచ్చి నమ్మకాలని చెప్పిస్తుంది. చిన్ననాటి నుండే నాయనమ్మ చెప్పిన మాటలు విని మూఢనమ్మకాలని తలకెక్కించుకున్న మోక్షిత ఎలా ఉద్యోగం పోగొట్టుకుందో తెలియజేస్తుంది 'తుమ్మా ఉద్యోగమా?' కథ.

ఈ కథా సంపుటిలో సీమా అక్షిత రాసిన 'బూతం లేదు గీతం లేదు', జి రిషిక రాసిన 'అత్త కోడళ్ళు', బి. అలకనంద రాసిన 'మంచి టీచర్', మె హైక్ రాసిన 'సాహసం', ఖాజా రాసిన 'తెలివైన బాలుడు మూఢనమ్మకాల నాయనమ్మ', ఎస్ అక్షిత రాసిన 'చిల్లుల సంచి', బి. శివరాం రాసిన 'మంత్రగాడి మోసం', సీమ హన్సిక రాసిన 'మంత్రగత్తె మోసం', కె. భావన రాసిన 'మోక్షాన్ని ఇచ్చే బండరాళ్లు', ఎస్ క్షితిజ రాసిన 'స్వామీజీ మంత్రాలు'. ఈ కథలన్నీ చదవదగినవే. ఇక ఈ కథా సంపుటిలో చివరిది సంపాదకులు డాక్టర్ ఉప్పల పద్మ రాసిన మంత్రదండం కథ.

ఒకవైపు దేశం, ప్రపంచం శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో ముందడుగు వేస్తున్నప్పటికీ, మరోవైపు సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబాలు మూఢనమ్మకాలు అంధవిశ్వాసాలలో చిక్కుకొని అల్లాడిపోతున్నాయి.

ఈ మంత్రదండం కథా సంపుటిలోని కథలన్నీ ప్రజలలో విద్యార్థుల్లో, శాస్త్రీయ ఆలోచనని కలిగించడానికి చేసిన ప్రయత్నంగా చెప్పవచ్చు. పౌర్ణమి అమావాస్య, మంత్రగాళ్లు, చేతబడులు, దయ్యాలు, నిమ్మకాయలు, కోడిగుడ్లు, పసుపు కుంకుమలు, తిప్పి వేయడాలు, నాలుగు తోవలు, మూడు తోవలు ఈ అంశాల పట్ల సమాజంలో నెలకొని ఉన్న భయాలు, ఇంకా గుడ్డి నమ్మకాలు, అమాయకమైన ప్రజలను మోసం చేసే మంత్రగాళ్ల వేషాలు, స్వామీజీలు వంటి విషయాలు మనకు కనిపిస్తాయి.

ఎవరైతే తమ పిల్లల్ని ఉత్తమ గుణాలు కలవారుగా మంచి సంస్కారం అబ్బేలా తీర్చి దిద్దుతారో అలాంటి వారే సరైన తల్లిదండ్రులు. ఏ సమాజంలోనైనా సరే పిల్లలు ధర్మంగా నడిచేలా తీర్చిదిద్దే తల్లిదండ్రులు ఆ సమాజపు అసలైన ఆస్తి. కుటుంబాలు ఫెయిలైతే సమాజం కూడా ఫెయిలవుతుంది. మంచి ప్రవర్తన అనే భవంతికి మంచి ఆలోచనలు పునాది రాళ్లు. పునాది బలంగా ఉంటే భవంతి కూడా స్థిరంగా ఉంటుంది.

- డాక్టర్ గన్నవరం వెంకటేశ్వర్లు, 9550384498

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ.బేబీకి విప్లవఅభినందనలు

జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్




నవతెలంగాణ - తిమ్మాపూర్ : సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కామ్రేడ్ ఎంఏ.బేబీకి పార్టీ కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ విప్లవ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభలు ఈ నెల 2తేదీ నుండి6 తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని మదురై నగరంలో అట్టహాసంగా జరిగాయన్నారు. మహాసభల చివరి రోజు పార్టీ అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా ఎంఏ.బేబీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. రానున్న మూడు సంవత్సరాలు మహాసభలు తీసుకున్న కర్తవ్యాల అమలు కోసం, దేశంలో పెట్టుబడిదారీ విధానానికి, మతోన్మాదనికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

అడ్మిషన్ల కోసం అడ్డదారులు..

జిల్లాలో మొదలైన కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలు

- కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో అడ్మిషన్ల పేరుతో వేధింపులు
- జాతీయ, రాష్ట్రస్థాయి ర్యాంకులు వచ్చాయంటూ జిల్లాలో ప్రచారం
- మోసపోతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- మండుటెండలో టీచర్లు, అధ్యాపకులు అవస్థలు
- విద్యార్థులను చేర్పించకపోతే ఉద్యోగానికీ ఎసరు





నవతెలంగాణ - కరీంనగర్

విద్యను సేవగా కాక, వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల కోసం జిల్లాలో అడ్డదారులకు తెగబడ్డాయి. 'మీ అమ్మాయి, అబ్బాయిని మా స్కూల్లో చేర్పించండి.. మీ పిల్లల్ని చేర్పించకుంటే మీ ద్వారా ఎవరైనా ఉంటే చెప్పండి సార్.. ప్లీజ్ పదిమందిని చేర్చాలని యాజమాన్యం టార్గెట్ విధించింది. లేకుంటే మాజీతం కట్ అవుతుంది, కనీస టార్గెట్‌కు చేరుకోకపోతే వచ్చే సంవత్సరం ఉద్యోగం నుంచి తొలగిస్తారు' ఇది పట్టణాల్లో, గ్రామాల్లో ప్రయివేటు టీచర్లు ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులు ముందు ప్రాథేయపడుతున్న దయనీయ దుస్థితిది. కరీంనగర్‌లోని కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో కొన్ని మినహా మిగిలిన విద్యాసంస్థల యాజమాన్యలు టీచర్లు, అధ్యాపకులకు 10 నుంచి 20 అడ్మిషన్లు టార్గెట్ పెట్టాయి. ఏండ్లుగా పనిచేస్తున్నప్పటికీ వేతనాలు పెంచడంలేదు. కానీ ఏటా అడ్మిషన్లు టార్గెట్‌ను మాత్రమే పెంచేస్తున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక పలువురు ఉద్యోగాన్ని వదిలేసుకుంటున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు నకిలీ ర్యాంకులు, తప్పుడు ప్రచారాలతో వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుతున్న పరిస్థితి కలవరానికి గురిచేస్తోంది. ఇప్పటి వరకూ హైదరాబాద్, ప్రధాన నగరాల్లో పరిమితమైన ఈ సంస్థలు ఇప్పుడు జిల్లా కేంద్రాలు, మండల స్థాయిలోనూ తమ పంజా విస్తరించాయి. రాష్ట్రస్థాయి ర్యాంకులు, జాతీయ విజేతలు మాకే అంటూ ఊహించలేని ప్రచారాల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తూ అడ్మిషన్లు కొల్లగొడుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల పేరిట బోధనా సిబ్బందిని వేధిస్తున్నాయి. టార్గెట్లు పెట్టి మరీ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చెప్పినన్ని అడ్మిషన్లు ఇవ్వని పక్షంలో ఉద్యోగానికి బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో పలువురు మండుటెండను సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ తిరుగుతూ అడ్మిషన్లు చేయించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 900పైగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, 150 జూనియర్ కళాశాలుల ఉన్నాయి. వీటిలో సుమారు 40వేలకుపైగా టీచర్లు, లెక్చరర్లు పనిచేస్తున్నారు. ఒక్కో యాజమాన్యం ఒక్కో రకమైన టార్గెట్లు విధిస్తోంది. ప్రధానంగా కార్పొరేట్, పేరొందిన ప్రయివేటు స్కూళ్లు అడ్మిషన్లు చేయిస్తేనే ఉద్యోగం ఉంటుందని బెదిరిస్తున్నాయి. మరికొన్ని విద్యాసంస్థల్లో ప్రతి రోజు ఒక అడ్మిషన్ చొప్పున ఇవ్వాలని, లేనిపక్షంలో ఆ రోజు జీతం కట్ అని కరాఖండీగా చెబుతున్నారు. ఇంకొన్ని చోట్ల ఒక్కొక్కరికి 10 ఉనంచి 20 అడ్మిషన్లు టార్గెట్ పెడుతున్నారు. ప్రభుత్వం నిబంధనలను పాటించాలని ఎవరైనా అడిగితే ఆ మరుసటి రోజు నుంచే ఉద్యోగం తొలగిస్తున్నారు.

జీవో నెం.01 అమలు ఏది?

ప్రయివేటు విద్యాసంస్థలు టీచర్లు, లెక్చరర్లు అష్టకష్టాలు పడి అడ్మిషనష్ల చేయిస్తున్నా, వారిక కనీస వేతనాలు సైతం అందడం లేదు. చాలీచాలని వేతనాలు ఇస్తూ అదికూడా సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సెలవు పెడితే ఆ రోజు జీతం కట్ చేస్తున్నారు. జీవో ఎంఎస్ నెంబర్ 01 ప్రకారం ప్రయివేట్ విద్యాసంస్థలో వసూలు చేసే ఫీజుల్లో కనీసం 50శాతం సిబ్బంది వేతనాల కోసమే ఖర్చు చేయాలి. కానీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడా ఈ జీవో అమలు చేయడంలేదు. కొన్ని చోట్ల పీఎఫ్ సౌకర్యం కల్పిస్తున్నా, యాజమాన్య కోటా మాత్రం చెల్లించడం లేదు. మొత్తం ఉద్యోగి జీతం నుంచే కోత పెట్టి పీఎఫ్‌లో జమ చేస్తున్నారు.

వాస్తవ వసతులకంటే విపరీత వాగ్దానాలు

పేరుకు కార్పొరేట్ విద్యాసంస్థలు అన్నా, వాస్తవ వసతులు మాత్రం కనిపించవు. డిజిటల్ క్లాస్‌రూములు, ల్యాబ్‌లు, ప్రాక్టికల్ సదుపాయాలు ఉన్నాయని చెబుతారు. కానీ పాత భవనాలను లీజుకు తీసుకుని విద్యా ప్రయోగాలు చేస్తున్నారు. టీచర్ల ఎంపికలోనూ అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, తక్కువ జీతాలపై అనుభవంలేని వారిని నియమిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

చిన్న విద్యాసంస్థలపై తీవ్ర ప్రభావం

గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు నగరాలకు పిల్లలను పంపలేని పరిస్థితుల్లో ఉండటంతో, కార్పొరేట్ సంస్థలు జిల్లాకేంద్రాలు, మండల కేంద్రాల్లో పట్టు సాధించాయి. ఫలితంగా స్థానికంగా ఉపాధిని కల్పించే చిన్న పాఠశాలలు మూతబడే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది విద్యారంగంలో స్వచ్ఛందంగా పనిచేస్తున్న వారిని వేదిస్తోంది.

పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

తల్లిదండ్రులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఈ వాస్తవ స్థితిగతుల పట్ల విద్యాశాఖ మాత్రం కన్నెత్తి చూడడం లేదు. అనుమతుల్లేకుండానే అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసేందుకు అధికారులు ముందుకు రావడంలేదు. ఈ నిర్లక్ష్యంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

కాంగ్రెస్ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడిగా బండారి రమేష్

నవతెలంగాణ - తిమ్మాపూర్


రమేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీలో మార్పులకు పార్టీ జిల్లా అధిష్టానం శ్రీకారం చుట్టింది. పార్టీని మరింత బలోపేతం చేయడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం కోసం జిల్లా అధిష్టానం ఈ చర్యలకు ఉపక్రమించింది. పార్టీలో యువతకు అవకాశాలు ఇస్తూనే పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకుల సేవలను గుర్తిస్తూ వారికి జిల్లా పార్టీ కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించాలన్నదే ఇందుకు కారణమని పార్టీ అధిష్టానం పేర్కొన్నది. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడిగా పోలంపల్లి మాజీ ఎంపీటీసీ బండారి రమేష్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియమించారు. ఈ మేరకు ఆదివారం పోలంపల్లి గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలకు హాజరైన సందర్భంగా రమేష్‌కు ఆయన నియామకపత్రం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడుగా నూతనంగా నియామకమైన బండారు రమేష్‌ను అభినందిస్తూ మండలంలో పార్టీ పటిష్టతకు, పార్టీ శ్రేణుల్లో ఐక్యతకు పాటుపడాలని, స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటి నుంచే కష్టపడి పని చేయాలని ఆయన ఆదేశించారు. ఇప్పటి వరకు తిమ్మాపూర్ మండల పార్టీ అధ్యక్షునిగా కొనసాగిన మోరపల్లి రమణారెడ్డి సేవలను గుర్తిస్తూ జిల్లా పార్టీలో బాధ్యతలు అప్పగిస్తామని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బొడిగె కొండయ్య, మామిడి అనిల్ కుమార్, కొత్త తిరుపతిరెడ్డి, వంగల కిషన్‌రెడ్డి, బుదారపు శ్రీనివాస్, సిరిగిరి రంగారావు, గుంటి మల్లేశం, రెడ్డిగాని రాజు, కొత్తపల్లి వినోద్, దన్నమనేని సురేందర్‌రావు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకోవాలి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి


చీమలకుంటపల్లి కళాకారుల బృందం

నవతెలంగాణ - గన్నేరువరం

ప్రాచీన కళలను కాపాడుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. గన్నేరువరం మండలంలోని చీమలకుంటపల్లి గ్రామంలో యువకులు ఆధ్వర్యంలో చిరుతల రామాయణం మూడురోజులుగా ప్రదర్శిస్తున్నారు. ఆదివారం శ్రీరామునికి పట్టాభిషేకం నిర్వహించగా ఈ కార్యక్రమానికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి హాజరయ్యారు. చిరుతల రామాయణ ప్రదర్శనానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వకాలంలో సినిమాలు, టీవీలు లేకముందు రామాయణం, మహాభారతం, నాటకాలు వేసి కళ్లకు కట్టినట్లుగా చూపించేవారన్నారు. సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్స్ రావడంతో ప్రజలంతా భారతీయ ప్రాచీన కళలను మరిచిపోతున్నారన్నారు. చీమలకుంటపల్లె గ్రామస్తులు అందరూ కలిసి ప్రాచీన నాగరికతల్లో భాగంగా రామాయణాన్ని ప్రదర్శించడంతో అభినందించారు. అనంతరం రామాయణం కమిటీ సభ్యులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రామాయణ గురువు దీటి రాజు, కుసుంబ తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు బామండ్ల ఆంజనేయులు, జంగిటి ప్రకాష్, బామండ్ల రమేష్, దానబోయిన లక్ష్మయ్య, బామండ్ల అజేందర్, పకిడే వీరేశం, కర్ర కొమురయ్య, కుసుంబ శ్రీకాంత్, గాజే రాజశేఖర్, లాసాని హరీష్, బామండ్ల నర్సయ్య సంబు రాజయ్య, లాసాని చిరంజీవి, లాసాని సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

కమనీయం.. రమణీయం శ్రీ సీతారాముల కల్యాణం

నవతెలంగాణ-కరీంనగర్



కరీంనగర్ ఆదర్శనగర్ లోని శ్రీరాజరాజేశ్వర్ స్వామి దేవాలయం (శివాలయం), అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో దేవాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి అంజన్ కుమార్ ఇంటి నుంచి శ్రీరాముని ఎదురుకోలు కార్యక్రమం నిర్వహించి కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమంలో గుడి అధ్యక్షుడు, కార్యదర్శులు మెతుకు కనకయ్య, భూంరెడ్డి, జి.లక్ష్మీనారాయణ, తోట సత్యం, శ్రీనివాస్, వంశీ, గోపి, రామూర్తి, శేఖర్, మనోహర్, శ్రీధర్, రమేష్, మాల రెడ్డి, జయలక్ష్మి, సుజాత, ఆనంద, శ్రీవేణి, సరిత, రాధిక, స్వప్న సుజాత పాల్గొన్నారు.


కరీంనగర్ : పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దంపతులు

కరీంనగర్ మంకమ్మతోటలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు బైరి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా చేశారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. కన్యాదాత తరపున కల్వకుంట్ల సహజ ప్రమోదరావు దంపతులు పాల్గొన్నారు. కన్యాదాత స్వీకర్తగా పాత మాలతి శేఖర్ దంపతులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను తీసుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చల్ల హరికృష్ణ, ఆలయ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున రాజేందర్, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గంగాధర



గంగాధర మండలంలోని రామాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్రస్వామి ఆల యాల్లో భక్తుల రామ నామ స్మరణల మధ్య రాములోడి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగాయి. గంగాధర, గర్షకుర్తి, కురిక్యాల, గట్టుబూత్కూర్, లక్ష్మీదేవిపల్లి, మధురానగర్, ఉప్పర మల్యాల, మల్లాపూర్, ఆచంపల్లి, కోట్ల నరసింహులపల్లి, ఒద్యారంతోపాటు ఆయా గ్రామాల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాలు జరిగాయి. బూరుగుపల్లి గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, దీవెన దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆయా గ్రామాల ప్రజలు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఆలయ పరిసరాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


గంగాధర : పట్ట వస్త్రలు, తలంబ్రాలు తీసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, దీవెన దంపతులు


హుజురాబాద్ : పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ గందే రాధిక- శ్రీనివాస్

నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ పట్టణంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నిర్వహించుకున్నారు. పట్టణంలోని శ్రీ సీతారామకృష్ణాలయ ఆవరణలో, పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద పాటిమీద అంజనేయ స్వామి సరస్వతి ఆలయ ప్రాంగణంలో, విద్యానగర్‌లో వేద పండితులు ఆచార్యుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండుగ నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ క్యాస చక్రధర్ దంపతులు, పాటి మీద ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఎస్పిఆర్ పాఠశాల అధినేత జగన్ దంపతులు, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ గంధే - రాధిక శ్రీనివాస్ దంపతులు, బుడిగ జంగాల కాలనీలో పాల్గొన్నారు. హుజురాబాద్‌తో పాటు తుమ్మనపల్లి సింగాపూర్, రంగాపూర్, కందుగుల, చెల్పూర్ తో పాటు పలు గ్రామాల్లో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుర్ర ఆగయ్య, బుర్ర నటరాజ్, ఆకుల సదానందం, భూసారపు శ్రీనివాస్, అపరాధ ముత్యంరాజు, శ్రీనివాస్, చైతన్య, దాసి కుమారస్వామి, క్యాస ఉపేందర్, మూగల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మానకొండూర్ : హాజరైన భక్తులు

నవతెలంగాణ - మానకొండూర్

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మానకొండూర్‌లో సీతారాముల కల్యాణ మహెూత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల శ్రీరామ జయరామ జయజయ రామ అనే మంత్ర పఠనం మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కటుకొజ్వల శ్రీనివాసచారి, సభ్యులు బొల్లం నరేందర్, జులపల్లి రఘునందన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడీ తిరుమల్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సంపత్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్ళపల్లి నరేష్‌గౌడ్, కొండ్ర సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గన్నేరువరం


గన్నేరువరం : ఉత్సవ మూర్తులను తీసుకువస్తున్న భక్తులు

శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం మండలంలోని అన్ని గ్రామాలలో కన్నుల పండువగా సాగింది. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయం, మార్కండేయ ఆలయం, కాసింపేట మానసా దేవి ఆలయం, మాదాపూర్, మైలారం, గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాలలోని శ్రీ అంజనేయ స్వామి ఆలయాలలో కల్యాణోత్సవాన్ని గ్రామస్తులంతా కలిసి కన్నుల పండువగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.


చొప్పదండి : చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ దంపతులు

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి నియోజకవర్గంలోని ప్రజలు శ్రీరాముని ఆశీస్సులతో సంతోషం శాంతి సౌభాగ్యాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం సుంకే రవిశంకర్ సతీ సమేతంగా పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టు వస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు.


రామడుగు : వెలిచాల గ్రామంలో

నవతెలంగాణ - రామడుగు

మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలోని శ్రీ రామాలయం, వెలిచాల శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవాలయం, వెదిర వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు పలు గ్రామాల్లోని ప్రధానాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, ఊరేగింపు చేసారు.


జమ్మికుంట : పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ దంపతులు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట రైల్వేస్టేషన్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జూనూతుల ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాధిక-రాజేశ్వర్‌రావు, జడల రామలింగం దంపతులు సమర్పించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఆవోప ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముదిగంటి ప్రకాశ్‌రెడ్డి, ముస్కే వీరరాజు, సిరిమల్లె జయేందర్, తదితరులు పాల్గొన్నారు.


మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు

జమ్మికుంట మారుతి నగర్‌లోని పంచముఖ శ్రీ అంజనేయ స్వామి ఆలయంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) చైర్మన్ పొనగంటి సంపత్-శ్రీలత ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలను పొనగంటి సంపత్‌శ్రీలత దంపతులు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులందరికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ, కిషోర్‌శర్మ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ పోనగంటి రాము, డాక్టర్ ఉడుగుల సురేష్, డాక్టర్ కంశెట్టి కిషోర్, మరి అవినాష్, ఊడుగుల సంపత్, వట్టేపల్లి ప్రకాష్ పాల్గొన్నారు.


వీణవంక మండలంలో..

నవతెలంగాణ - వీణవంక

వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో డాక్టర్ పరిపాటి శరత్ కుమార్‌రెడ్డి, రూప ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్‌లో గ్రామస్తుల ఆధ్వర్యంలో, కొండపాక గ్రామంలో ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో, చల్లూరులో అభయాంజనేయ స్వామి దేవాలయంలో, హిమ్మత్ నగర్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ నల్ల మమతా తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. కొండపాక గ్రామంలో దాట్ల సమ్మయ్య వీరస్వామి, కోర్కల్లో అంబాల కిరణ్, రామకృష్ణాపూర్ గ్రామంలో గ్రామ ప్రజలందరికీ సహకారంతో మహా అన్నదానం నిర్వహించారు. పరిపాటి లక్ష్మారెడ్డి, శోభ, పవన్ కుమార్, రజిత, జడల శ్రీకాంత్, రాజయ్య, అప్పని కొమురయ్య, ఏలే కుమారస్వామి, ఊకంటి రమణారెడ్డి, ఏలే మధుసూదన్, ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గజ్జల శ్రీకాంత్, ఉల్లాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - చొప్పదండి


చొప్పదండి : దర్శించుకుంటున్న మార్కెట్ చైర్మన్ మహేష్

చొప్పదండి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చొప్పదండి పట్టణంలోని రామాలయంతో పాటు చిట్యాలపెల్లిలో, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నిజానాపురం చందు ప్రత్యేక పూజలు చేశారు.


తిమ్మాపూర్ : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ - తిమ్మాపూర్

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహెూత్సవాలకు మానకొండూరు శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అల్గునూర్ 8వ డివిజన్లో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పోలంపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. శ్రీరాముని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంట్లో స్వాంతన, సంపద, శాంతి నిండాలని మనసారా కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ వేడుకల్లో ఆయా మండలాలకు చెందిన పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ జగిత్యాల జిల్లా గవర్నర్‌గా బండ్ల గజానందం

నవతెలంగాణ-మేడిపల్లి



అలయన్స్ క్లబ్ జగిత్యాల జిల్లా గవర్నర్‌గా బండ్ల గజానందం ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా-271 జగిత్యాలలో సామాజిక సేవా రంగంలో విశిష్టమైన సేవలను అందించేందుకు మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బండ్ల గజానందంను జగిత్యాల జిల్లా గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అల్లె బాలా గంగాధర శాస్త్రి ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు క్లబ్ ప్రతినిధులు, మిత్రులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కటకం రాజేంద్రప్రసాద్, కటకం సురేందర్, నాగేశ్వరరావు, రాజశేఖర్, తొగరి లక్ష్మీపతి, శంకర్, రాజేశ్వర్ రెడ్డి, ఎల్లారెడ్డి, ధరందీప్ పాల్గొని గజానందంను ఘనంగా సన్మానించారు. అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా బండ్ల గజానందం ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బి.టి. రణదీవే ఆశయాలు కొనసాగిద్దాం

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్

నవతెలంగాణ- జగిత్యాల టౌన్

బీ.టీ రణదీవే ఆశయాలను కొనసాగించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. కార్మిక ఉద్యమ నాయకులు సీటీయూ అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బిటి రణదీవే 35వ వర్ధంతి జగిత్యాల జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ కామ్రేడ్ బి. టి. రణదివే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం సిఐటియు జిల్లా కో-కన్వీనర్ కోమటి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ కార్మిక ఉద్యమ నాయకులు, సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు రణదీవే 1970లో మొట్టమొదటి అధ్యక్షులుగా పని చేశారని తెలిపారు. భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. కామ్రేడ్ బిటి రణదీవే పూర్తి పేరు బాలచంద్ర త్రయంబక రణదీవే అని, ఆయన చిన్న నాటి నుండి చదువులో ముందుండే వారు అని చెప్పారు. చదువుతో పాటు రాజకీయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారి స్నేహితులకు రాజకీయాలు వివరించేవారని అన్నారు. మొదట టెక్స్టైల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, తర్వాత రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం



బి.టీ రణదీవే చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సీఐటీయూ నాయకులు

నిరంతరం ఉద్యమించారన్నారు. 1928 లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు అయ్యారని నాటి నుండి ఏఐటీయూసీ నాయకులుగా 1969 వరకు క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. 1947లో భారతదేశానికి స్వాతంత్రం వచ్చాక ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో సంస్కరణ ధోరణి రావడం వల్ల కార్మిక వర్గానికి నష్టం చేసే ధోరణులు వచ్చాయని స్వాతంత్రం వచ్చాక కమ్యూనిస్టు ఉద్యమంలో పార్టీలో రెండు పెడదారులు ఉండడం వల్ల 1964 ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి సీపీఐ(ఎం)గా విడిపోవడం జరిగిందని, అయినా సీపీఐ(ఎం) వైపు నిలబడ్డ బి టి .రణధీవే పార్టీ లోనే ఉంటూ ఏఐటియుసి లో చురుకుగా పని చేశారని తెలిపారు. కార్మికులకు వ్యతిరేకంగా యజమానులకు అనుకూలంగా ఉమ్మడి కార్మిక సంఘంలో పనిచేయడం సాధ్యం కానీ స్థితిలో 1970లో ఐక్యతా పోరాటమనే నినాదంతోనే సిఐటియు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఏర్పడిందన్నారు. కులం - మతం వ్యక్తిగతంగా ఉండాలి కానీ కులం తో పాటు కులతత్వం ఉండరాదు. కుల ఉన్మాదం ఉండరాదని, మతం ఉండొచ్చు వ్యక్తిగతం మత ఉన్మాదం ఉండరాదని, కులం - మతం- లింగం స్త్రీ, పురుష తేడాలతో విడిపోతే కార్మికులు నష్టపోతారని యజమానులకు, పెట్టుబడిదారులకు, పాలకులకు లాభాలు కార్మిక వర్గానికి నష్టాలు కష్ట కాలం వస్తుందని ఐక్యత చీలకుండా ఉద్యమం నిర్మించాలని పిలుపునిచ్చారు. కులం- వర్గం- ఆస్తి సంబంధాలు అని పుస్తకాన్ని కామ్రేడ్ బి టి రణదివే రచించారని తెలిపారు. వీటిని వారు జీవించినంత కాలం సోషలిజం స్థాపన కోసం కృషి చేశారని, అనేక దఫాలు పోలీసులు అరెస్టులు జైలుకు వెళ్లడం జరిగిందని సంవత్సరాల తరబడి జైల్లో గడిపారని జైల్లో కూడా ఖైదీల సమస్య పరిష్కారం కోసం ఉద్యమించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బచ్చల వినోద్, మహ్మద్, సాగర్, భుపెల్లి రాజేష్, శివ, హరి, లక్ష్మణ్, నరేష్, గంగా స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కళ్యాణం



ఎండపల్లి మండలంలో...

నవతెలంగాణ- ఎండపల్లి

మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణం నిర్వహించారు. గ్రామంలోని పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని కట్నకానుకలు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి భోజనాలు చేశారు. సీతారాముల ప్రతిమలను డీజే భక్తి పాటలతో నృత్యాలతో శోభాయమానంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొండగట్టులో...

మల్యాల: శ్రీరామనవమి సందర్భంగా కొండగట్టులోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేసి ఈ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ

రాయికల్: పట్టణంలోని నాగారం హనుమాన్ ఆలయంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాల్లో మాజీ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొని హనుమాన్, సీతారాముల ఆలయాలను దర్శించుకున్నారు. పట్టణంలోని నాగారం హనుమాన్ దేవాలయంలో సీతారాముల పల్లకి సేవలో పాల్గొన్నారు.ఆయనతోపాటు ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, నాయకులు గోపి రాజారెడ్డి, కొయ్యడి మహిపాల్, గుజ్జేటి కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టులో...



ఘనంగా సీతారాముల కళ్యాణం పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే.

మెట్ పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంప్ కార్యాలయంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణంను ఘనంగా నిర్వహించారు.అనవాయితీ ప్రకారం ఖాదీ హనుమాన్ ఆలయం నుండి శ్రీరాముల వారిని ఎదుర్కోలు నిర్వహించిన అర్చకులు సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే ఖాదీ బోర్డు చైర్మన్ దంపతులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సరోజినమ్మ, ఎస్సారెస్పీ అధికారి శ్రీనివాస్ చారి దంపతులు, ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ దంపతులు, ఆలయ కమిటీ నిర్వాహకులు మహాజన్ నర్సింలు దంపతులు సీతారాముల కళ్యాణంలో పాల్గొన్నారు.



కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న క్యాషనూరి మఠం అర్చకులు

మైతాపూర్‌లో కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం

రాయికల్: మండలంలోని అయోధ్య, తాట్లవాయి, రామాజీపేట, మైతాపూర్ తదితర గ్రామాల్లో శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా ఆయా గ్రామాల ఆలయ అర్చకులతో ఘనంగా నిర్వహించారు. మైతాపూర్‌లో అర్చకులు క్యాషనూరి మఠం జగదీశ్వర్ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఉదయం నుండి గణపతి, ఆంజనేయ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. భక్తుల రామ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.భక్తులు పారవశ్యంతో పులకించిపోయారు. సాక్షాత్తు విష్ణు స్వరూపుడైన త్రేతా యుగ పురుషుడు రాముడి కల్యాణం సీతా మాతతో అంగరంగ వైభవంగా జరిపించారు. తాళిబొట్టుతో కూడిన మంగళ సూత్రాన్ని రాముని తరపున అర్చకులు సీతమ్మకు అలంకరించారు. మంగళసూత్రధారణ తర్వాత సీతమ్మ, రామయ్యల తలంబ్రాల వేడుక కన్నుల పండుగగా జరిగింది. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆలయాల పరిసరాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయాల అర్చకులు, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం, జగిత్యాలలోని ధరూర్ క్యాంపులోని కోదండరామ స్వామి ఆలయం, విద్యానగర్ సీతారామచంద్ర స్వామి ఆలయం, చిన్నగట్టు ఆంజనేయ స్వామి ఆలయం, మార్కండేయ స్వామి, అభయ ఆంజనేయ స్వామి, బుగ్గారం మండలం చందయ్యాపల్లె ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వారల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి బాజా భజన్త్రీలతో మండపాలకు ఎదుర్కోలు ద్వారా తీసుకెళ్లి వేదమాంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా, భక్తుల కొలహలం మధ్య సీతారాముల కల్యాణన్ని వేద బ్రాహ్మణులూ, వేద పండితులు వైభవోపేతంగా, కన్నులపండువగా జరిపారు.

ఉపాధి కూలీలకు వేతనం పెంపు..

- రోజుకు రూ.307
- 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు

నవతెలంగాణ- జగిత్యాల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రోజువారీ వేతనాన్ని రూ.300 నుంచి రూ.307కు పెంచుతూ ప్రకటన విడుదల చేసింది. ఈ కొత్త వేతనం 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో జగిత్యాల జిల్లా వ్యాప్తం 380 గ్రామ పంచాయతీల్లో 1, 65,700 కుటుంబాల్లో 297,962 మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. ప్రతి కుటుంబానికి పని దినాలు 100 రోజులు, గతంలో రోజువారీ కూలీ: రూ.300 ఉండగా ప్రస్తుతం పెరిగిన కూలీ రూ.307 పెరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భూ అభివృద్ధి, జల సంరక్షణ పనులు ఊపందుకోనున్నాయి. జంగిల్ కటింగ్, భూమి చదును, ఇంకుడు గుంతలు, సేద్యం కుంటలు, గుట్టల చుట్టూ కందకాలు, పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణం వంటి పనులు ప్రారంభం కానున్నాయి. 'కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజువారీ కూలీని రూ.307కు పెంచింది. మరికొన్ని రోజుల్లో ఉపాధి పనులు ముమ్మరం కానున్నాయి. ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించేందుకు జిల్లా, మండల, గ్రామ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి. కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



వృద్ధుల సంరక్షణ, మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు



హరి అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ల జగిత్యాల జిల్లా శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా వయోవద్దుల రక్షణ, పోషణ సంక్షేమ చట్టం, మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కె. కృష్టారెడ్డిలు వయోవృద్ధుల రక్షణ, సఖి, భరోసా, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 20 మంది నిరుపేద వయోధికులకు పాదరక్షలు, గొడుగులు అందజేశారు. వయోధికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తున్న సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కౌన్సెలింగ్ అధికారులు పి.సి. హన్మంత్ రెడ్డి, పబ్బా శివానందం, రాజ్ మోహన్, రాజయ్య, ఉపాధ్యక్షుడు ఎం.డి. యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పూసాల అశోక్ రావు, కే. సత్యనారాయణ, జిల్లా టి.బి.సి. జెఎసి జిల్లా మహిళా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ, పట్టణ అధ్యక్షురాలు సింగం పద్మ సీనియర్ సిటిజెన్స్ జగిత్యాల మండల మహిళా అధ్యక్షురాలు బైరి రాధ, సీనియర్ న్యాయవాది పి. సతీశ్ రాజ్, జర్నలిస్టు అల్లే రాము, సింగం గంగాధర్, సింగం భాస్కర్, కాలగిరి గంగారెడ్డి, ఎం.డి. ఎక్బాల్, సయ్యద్ యూసుఫ్, యాకూబ్ హుస్సేన్, సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్, టి.ఎన్.జి.ఓ, టి. రెవెన్యూ, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భీమారంలో పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాములు

నవతెలంగాణ- మేడిపల్లి

భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దాతల సహకారంతో 6 నుండి 10వ తరగతి విద్యార్థులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా విద్యా అధికారి రాము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల నృత్యాలు, ఉపాధ్యాయుల ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. పలువురిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జవ్వాజి అశోక్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లావణ్య, మాజీ సర్పంచ్ చెక్కపల్లి అరుణ, యువ నాయకులు చెక్కపల్లి రఘు, మాజీ ఉపసర్పంచ్ బస్వరాజుల రాజు, మాజీ సర్పంచ్‌లు పిట్టల లక్ష్మి-రాజారెడ్డి, నాంచారి స్వప్న-రాజేందర్, నాంపల్లి నర్సయ్య, రాకేష్, రవి, ఉపాధ్యాయులు శ్రీధర్, నరేందర్, రమేష్, ప్రసాద్, తిరుమలేశ్, నీలిమ, జయశ్రీ, నజీమ, సాహెబ్, సంధ్య రాణి, ఎస్థర్ రాణి, రాజు కుమార్ పాల్గొన్నారు.

మల్యాల సర్పంచ్ స్థానం ఎస్సీలకు కేటాయించాలి

-ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఎస్సీ జర్నలిస్టులు

నవతెలంగాణ- మల్యాల

రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మల్యాల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ అసోసియేషన్ నాయకులు, ఎస్సీ జర్నలిస్టులు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బి. వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. మల్యాల పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎస్సీలకు సర్పంచ్ పదవి దక్కలేదని, చుట్టుపక్కల గ్రామాల్లో ఎస్సీలకు అవకాశం వచ్చినప్పటికీ, మల్యాలలో మాత్రం రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, అధికారుల నిర్లక్ష్యం, కుట్రల వల్లే గతంలో అవకాశం కోల్పోయామని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం రాబోయే ఎన్నికల్లో సర్పంచ్ స్థానం ఎస్సీలకు కేటాయించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని వారు హెచ్చరించారు.

కట్లకుంటలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామపంచాయతీ ఆవరణలో శ్రీ వెంకటేశ్వర ఆర్థో, జనరల్ హాస్పిటల్ (బొంబాయి) ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ టి. విజయ్‌రెడ్డి, ఆర్థోపెటిక్ గొల్లపెల్లి రోడ్ జగిత్యాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు జగదీశ్వర్ రెడ్డి, భీమరాజు, రమేష్, తాజా మాజీ ఉప సర్పంచ్ నూతిపెల్లి శంకర్, తాజా మాజీ ఎంపీటీసీ పన్నాల రాజేశ్వర్‌రెడ్డి, కుంట నారాయణ, గడ్డం జలంధర్, ఎడమల రాజేందర్ రెడ్డి, సురకంటి అంజిరెడ్డి, గడ్డం విజయ్, వంశీ, బిరుదు రాజు అశోక్ రాజు, ఏలేటి వంశీ పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ జెండా ఆవిష్కరించారు.అనంతరం కోరుట్ల నియోజకవర్గ నాయకులు డాక్టర్ రఘు బూత్ అధ్యక్షులకు, శక్తీ కేంద్రం ఇన్‌చార్జిలకు నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చెట్ల పెల్లి సుఖేందర్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వడ్డేపల్లి శ్రీనివాస్, చింతల శ్రీకర్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ధోనికెళ్ళ నవీన్, ఇల్లెందుల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ చెట్ల పెల్లి మీన, మద్దెల లావణ్య, పుల్ల సౌజన్య, సోమిరెడ్డి సునీత, సీనియర్ నాయకులు కొల్లెపు శ్రీనివాస్, తోకల సత్యనారాయణ, మోర్తాడ్ దేవ రాజం, అంబల జగన్ , సత్య నారాయణగౌడ్, సుంకేట విజయ్ , పాల్గొన్నారు

ఆలయాలను దర్శించుకున్న మాజీ జెడ్పి చైర్ పర్సన్

నవతెలంగాణ-రాయికల్:



శ్రీరామనవమిని పురస్కరించుకొని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత మండలంలోని అయోధ్య గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ శోభ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం రామాజీపేట, అల్లీపూర్,సింగర్ రావు పెట్, రాయికల్ పట్టణంలోని హనుమాన్ ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఆమెతో పాటు అయోధ్య మాజీ సర్పంచ్ ఎడమల జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ కో-ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఆకుల జయంత్



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్
సిరిసిల్ల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆకుల జయంత్ కుమార్ మరోసారి ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఆకుల జయంత్, ప్రధాన కార్యదర్శిగా ఆడెపు మహేందర్, ఉపాధ్యక్షుడు బొడ్డు పరశురాములు, సహాయ కార్యదర్శిగా కంకణాల శ్రీనివాస్, కోశాధికారిగా వంకాయల శ్రీకాంత్ కార్యవర్గ సభ్యులుగా చౌట పెల్లి వెంకటేశం, ప్రయాకర్రావు వేణు, దుమాల రాము, ముండ్రాయి శ్రీనివాస్, జంగిలి రాజు, బుస్సా రామనాథం ను అధ్యక్ష మెజారిటీతో సభ్యులు ఎన్నుకున్నారు. కాగా గెలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు తడుక విశ్వనాథం, కరుణాల భద్రాచలం, టివి నారాయణ నియామక పత్రాలను అందజేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా జయంత్ కుమార్ ని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

- రాజన్న సన్నిధిలో కనుల పండువగా వేడుకలు
- అర్ధనారీశ్వరుడిని మనువాడిన జోగినిలు
- ప్రభుత్వ విప్, మున్సిపల్ కమిషనర్, బీజేపీ నాయకుల పట్టు వస్త్రాల సమర్పణ

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవంవైభవంగా జరిగింది. ఈ వేడుకకు వేలాది మంది భక్తులు హాజరయ్యారు. ఆలయంలోని అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. ఈ సందర్భంగా జోగినులు, హిజ్రాలు అర్ధనారీశ్వరుడైన రాజన్నను వివాహమాడటం సాంప్రదాయ ఆచారంగా కొనసాగింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముస్తాబాద్, చందుర్తి, గంభీరావుపేట, వీర్నపల్లి, కొనరావుపేట మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఆలయాలు భక్తుల సందడితో కళకళలాడాయి. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ వేడుకలు కన్నుల పండుగగా నిలిచాయి. ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.





నవతెలంగాన - వేములవాడ :
ఆదివారం ఉదయం 11:55 గంటలకు అభిజిత్ లగ్న సుముహూర్తంలో సీతారాముల కల్యాణ క్రతువును అర్చకులు నిర్వహించారు. రాచకొండ భాను-అనురాధ దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు. కల్యాణం అనంతరం పూర్ణాహుతి, రథోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తాగునీరు, మజ్జిగ, అరటి పండ్లు వంటి ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు దాదాపు 50 వేల మంది భక్తులు హాజరైనట్లు ఆలయ ఈవో వినోద్ తెలిపారు.

జోగినుల ప్రత్యేక వేడుక:
వేములవాడ రాజన్న ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా జోగినులు, హిజ్రాలు అర్ధనారీశ్వరుడైన రాజన్నను వివాహమాడటం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆదివారం జరిగిన సీతారాముల కల్యాణంలో జోగినులు, హిజ్రాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళసూత్రాలు ధరించి, తలంబ్రాలు చల్లుకుంటూ సాంప్రదాయ పద్ధతిలో వేడుకను నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వం పట్టు వస్త్రాల సమర్పణ:
రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో కలిసి, కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు కూడా పట్టు వస్త్రాలు సమర్పించారు.

ముస్తాబాద్‌లో కళ్యాణోత్సవ వైభవం
నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంతోపాటు



రామలక్ష్మణపల్లె, గూడెం, ఆవునూరు, మద్దికుంట, చిప్పలపల్లి, నామాపూర్ గ్రామాల్లోని సీతారాముల, హనుమాన్ దేవాలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. ముస్తాబాద్‌లోని మంగళగడ్డ వీరాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన ఉత్సవ ఎదుర్కోళ్లలో హనుమాన్ మాల ధారణ స్వాములు పాల్గొన్నారు. సుమారు 1500 నుంచి 2000 మంది భక్తులు హాజరైన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జనగామ శరత్ రావు భాగ్య దంపతులు వివిధ గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్తయ్య, సభ్యులు భక్తులకు భోజనం, తీర్థప్రసాదాలు వితరణ చేశారు. పురోహితులు మధు రాజేశ్వరి శర్మ, మెట్టు రామ శర్మ, శ్రీపాద శర్మతో పాటు వివిధ పార్టీల నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

చందుర్తిలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్..
నవతెలంగాణ -చందుర్తి : మండలంలోని జోగాపూర్, లింగంపేట, కట్ట లింగంపేట, మర్రిగడ్డ, చందుర్తి గ్రామాల్లో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. జోగాపూర్‌లో జరిగిన కళ్యాణోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న ఆయన, భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

700ఏళ్ల చరిత్రగల గంభీరావుపేట ఆలయంలో..
నవతెలంగాణ - గంభీరావుపేట : మండల కేంద్రంలోని 700 సంవత్సరాల చరిత్ర కలిగిన సీతారాముల ఆలయంలో కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ స్పోక్స్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, భక్తులు మంగళ హారతులు సమర్పించి కానుకలు అందజేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదే మండలంలోని మల్లారెడ్డిపేట వీరాంజనేయ స్వామి ఆలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధికి రూ. 51 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుధాకర్ శర్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ పాతూరి అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీర్నపల్లిలో పల్లకి ఊరేగింపు..
నవతెలంగాణ - వీర్నపల్లి : మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణ సీతారామాంజనేయ ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా జరిగింది. కళ్యాణ మూర్తులను పల్లకిలో ఊరేగిస్తుండగా భక్తులు నీరాజనాలు పలికారు. మహిళలు కోలాటాలు ఆడగా, యువత డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఉత్సవ శోభను రెట్టింపు చేశారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గరిపల్లి దేవరాజు, ఉపాధ్యక్షుడు భూత శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సామల హన్మయ్య, కోశాధికారి నేరెళ్ల కృష్ణాహరి, గ్రామ పెద్దలు, హనుమాన్ దీక్ష స్వాములు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కొనరావుపేటలో ఆది శ్రీనివాస్ దర్శనం
నవతెలంగాణ - కొనరావుపేట : మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శ్రీ సీతారామ స్వామి కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామివారిని దర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చెందిన మాదూరి రిషి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు బాదవేని అంజాగౌడ్, నిరోష, ఏపీ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి సుమలత, మాజీ విద్య కమిటీ చైర్మెన్ కే చంద్రశేఖర్ అభినందించారు.

'శ్రీగాధ' అభివృద్ధికి కృషి చేస్తా



నవతెలంగాణ - గంభీరావుపేట :
శ్రీగాధ గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు అన్నారు. ఆదివారం గంభీరావుపేట మండల పరిధిలోని శ్రీగాధ గ్రామంలో బస్టాండ్ వద్ద హైమాస్ట్ లైట్ల ప్రారంభంతోపాటు బోరు బావులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, ప్రస్తుతం కేకే మహేందర్ రెడ్డి సారథ్యంలో ప్రాంత అభివృద్ధికి మరో అవకాశం వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల పేద ప్రజల కోసం పలు సంక్షేమ పథకాల్లో భాగంగా శ్రీగాధ గ్రామానికి అధిక సంఖ్యలో లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కత్తుల బాబు, మాజీ ఉప సర్పంచ్ ఆకారం కాశి, ఏఎంసీ డైరెక్టర్ కల్వకుంట్ల లక్ష్మణరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బందెల రాజు, నాయకులు వేముల శ్రీనివాస్ గౌడ్, ఆకారం కార్తీక్, కాశ గౌడ్, తొండ్లస్వామి, తొండ్ల నర్సింలు, పర్ష శ్రీనివాస్, గౌరనేని భగవంత రావు, పేరాల రాజు, బందెల స్టీఫెన్, కల్వకుంట్ల మోహన్ రావు, ఒజయ్య యాదవ్, శ్రావణ్ రావు, శంకర్, మల్లేష్, గణేష్, సతీష్, చింటూ శ్రీకాంత్, బాలరాజు, సంజీవ్, వెంకట్రావ్, వెంకట్ గౌడ్, దేవరాజు, అజయ్ రాజు, నికేష్ పాల్గొన్నారు.

7న ఛలో గిరిజన సంక్షేమ భవన్

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీమా సాహెబ్



మాట్లాడుతున్న బీమా సాహెబ్

నవతెలంగాణ-కరీంనగర్
ట్రైకార్ సంస్థ ద్వారా 2019-21 సంవత్సరాల్లో రుణాలు మంజూరై, చెక్కులు సిద్ధమైనప్పటికీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాని లబ్ధిదారుల సమస్యపై తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) గళమెత్తింది. ఈ మేరకు ఏప్రిల్ 7న హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ భవన్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు టీజీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శి జి. బీమా సాహెబ్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని స్థానిక గిరిజన సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని హడావిడిగా ప్రారంభించడం వల్ల ట్రైకార్ సంస్థ పూర్తిగా నిర్వీర్యమవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. గత రాష్ట్ర ప్రభుత్వం 2019-2021 సంవత్సరాల్లో గిరిజన యువతీ యువకుల నుంచి వేలాది దరఖాస్తులు స్వీకరించి, 30 వేల మందిని లబ్ధిదారులుగా గుర్తించి రుణాలు మంజూరు చేసిందని తెలిపారు. ఈ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి రూ.219కోట్ల చెక్కులను సిద్ధం చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపినప్పటికీ, ఇప్పటివరకు ఆ డబ్బులు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రుణాలను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఆ హామీ నీరుగారిపోయిందని, లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. అయితే, ఈ 30వేల మంది గిరిజన యువతీ యువకులకు మంజూరైన రుణాలను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కోసం కొత్తగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు వెళితే, ఇప్పటికే రుణాలు తీసుకున్నట్లు చూపడంతో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని విమర్శించారు. దీంతో వేలాది మంది గిరిజన యువత ఈ పథకంలో రుణాలు పొందకుండా అనర్హులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల మంది యువతకు రుణాలు ఇవ్వాలనే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, 50 ఏళ్లుగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ట్రైకార్ సంస్థను నిర్వీర్యం చేయ డానికే దీనిలో విలీనం చేసిందని ఆరోపణలు గుప్పించారు. ట్రైకార్‌లో యూనిట్ కాస్ట్ 50 వేల నుంచి 10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా, రాజీవ్ యువ వికాసంలో కేవలం 4 లక్షల వరకే రుణ సౌకర్యం కల్పించడం అన్యాయమని విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే దరఖాస్తుల గడువును తక్కువ సమయం ఇచ్చిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ట్రైకార్‌లో పెండింగ్‌లో ఉన్న 219 కోట్ల రుణాలను విడుదల చేసి, లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఏప్రిల్ 7న గిరిజన సంక్షేమ భవన్ ఎదుట శాంతియుత నిరసన చేపడతామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ట్రైకార్ లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తరలిరావాలని బోడ మోహన్ నాయక్, జి. బీమా సాహెబ్ విజ్ఞప్తి చేశారు.

బీజేపీ నాయకులకు ఘన సన్మానం



బీజేపీ నాయకులకు సన్మానించిన అనుష్ యాదవ్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :
భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా, ఎల్లారెడ్డిపేట మండలంలో పార్టీ పునాదుల్లా నిలిచి, పార్టీని పరిరక్షిస్తూ, అనేక మంది కార్యకర్తలను తీర్చిదిద్దిన సీనియర్ నాయకులను ఆదివారం ఘనంగా సత్కరించారు. బీజేపీ సీనియర్ నాయకులు పట్టూరి రాజేశం గుప్తా, మద్దుల బుగ్గరెడ్డి, కంచర్ల పర్శరాములు, రావుల గాల్ రెడ్డి, పారిపెల్లి సంజీవ్ రెడ్డిలను బీజేవైఎం జాతీయ కో-ఆర్డినేటర్ అనుశ్రు యాదవ్ ప్రత్యేకంగా సన్మానించారు. పార్టీ అభివృద్ధికి వారు చేసిన అవిరళ కృషిని స్మరిస్తూ, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనుశ్రు యాదవ్‌తో పాటు, మండల కార్యదర్శి ఆంజనేయులు, ఇతర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరణ



ఎల్లారెడ్డిపేట మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు పట్టూరి రాజేశం గుప్తా ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పట్టూరి రాజేశం గుప్తా, అరిగెల సత్తయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ప్రకాష్, కన్వీనర్ నవీన్, కొండ ప్రశాంత్ పాల్గొన్నారు.

గవర్నర్ ఆమోదం పొందని బీసీ బిల్లు పార్లమెంట్ ఎలా ఆమోదిస్తుంది?

బీసీ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి



నవతెలంగాణ - ముస్తాబాద్ : బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వం రాజకీయాలు చేయడం తగదని రాష్ట్ర బీసీ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి శీలం స్వామి అన్నారు. ఆయన మండల కేంద్రంలో పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన తర్వాత వెంటనే గవర్నర్ ఆమోదం కోసం పంపాలని, అలా పంపకుండా దీనిపై రాష్ట్ర ప్రభుత్వం జీవో కూడా విడుదల చేయకుండా ఏకంగా దీని సమగ్ర నివేదిక కేంద్రానికి ఎలా పంపారని ప్రశ్నించారు. గవర్నర్ ఆమోదం లేకుండా పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందుతుందా అని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపితే ఏమి లాభం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రానికి పంపి చేతులు దులుపుకున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా సహకరించాలని అన్నారు. బీసీ నాయకులు కంచం నర్సింలు, విశ్వనాథం అనీల్, మల్లెపూల సాయికృష్ణ, మేర నర్సింలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేష్
- నేడు 24 గంటల నిరహార దీక్షకు పిలుపు



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్
పవర్ లూమ్, వార్పిన్, వైపని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూశం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న చీరలకు కూలి రేట్లు పెంచాలని చేపడుతున్న నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరింది. ఆదివారం సమ్మె శిబిరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆరు రోజుల నుంచి కార్మికులు సమ్మె చేస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ నేడు అంబేద్కర్ చౌరస్తా వద్ద 24 గంటలు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. వస్త్ర వ్యాపార అనుబంధ రంగాల కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కొడం రమణ, సిరిమల సత్యం, కుమ్మరి కుంట కిషన్ చంద్రకాంత్, వెలిగేటి శ్రీనివాస్, మచ్చ వేణు, ఎక్కల్ దేవి జగదీష్, బోట్ల వెంకటేశం, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. మానకొండూర్, హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి, రామడుగు, వీణవంకల్లో బిజెపి నాయకులు, కార్యకర్తలు జెండా ఆవిష్కరణ, స్వీట్ల పంపిణీ, చిత్రపటాలకు పూలమాలలతో నివాళులు అర్పించడం వంటి కార్యక్రమాలతో పార్టీ స్థాపన దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సాధించిన విజయాలను గుర్తుచేసుకుంటూ, రాబోయే కాలం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ - కరీంనగర్
బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. మానకొండూర్, హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి, రామడుగు, వీణవంక వంటి ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణలు, స్వీట్ల పంపిణీ, పార్టీ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం వంటి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి నాయకులు పార్టీ గత 45 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను, దేశాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. రాబోయే కాలంలో బిజెపి మరింత బలోపేతమై, దేశంలోని ప్రతి పౌరుడి సంక్షేమం కోసం పనిచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మానకొండూర్‌లో
నవతెలంగాణ - మానకొండూర్
మానకొండూర్‌లోని లక్ష్మీపూర్ గ్రామాల్లో బిజెపి మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యం లో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఉదయం పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసిన అనంతరం, స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసి స్వీట్లు, అల్పాహారం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కర చారి, మాజీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

హుజురాబాద్‌లో జెండా ఆవిష్కరణ..
నవతెలంగాణ - హుజురాబాద్
హుజురాబాద్ పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు నేతృత్వంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణతో పాటు, బిజెపి వ్యవస్థాపకులు శ్యామప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, ఫైళ్ల వెంకటరెడ్డి, నల్ల సుమన్, గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, అంకటి వాసు, నరాల రాజశేఖర్, తిప్పబత్తిని రాజు, యల్లా సంజీవరెడ్డి, పోతుల సంజీవ్, కొల్లిపాక వెంకటేష్, ఎంసాని శశిధర్, కొలిపాక శ్రీనివాస్, కొడిమ్యాల పవన్, బోరగాల సారయ్య, గంట సంపత్, నరేంద్ల ప్రవీణ్, మునిగంటి నాగరాజు, ములుగురి నాగరాజు, ఆవుల సదయ్య, గుర్రం సంతోష్, తాళ్లపల్లి హరీష్, పల్లె వీరయ్య, శ్రీనివాస్, కెక్కెర రేణుక, గూడూరి రాంరెడ్డి, యాట రాజేష్, కన్నా గరిగే శివకృష్ణ, అభి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో
నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు నేతృత్వంలో పట్టణ కార్యాలయం ముందు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జెండా ఎగురవేసిన అనంతరం కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపిన కొలకాని రాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి సంపత్ రావు, ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, రాజేష్, రాజు కుమార్, పల్లెపు రవి, మధు, స్వరూప, బచ్చు శివన్న, కొమ్ము అశోక్, రామస్వామి, కొండపర్తి ప్రవీణ్, ఉడుగుల మహేందర్, పొనగంటి రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి కార్యకర్తలు స్థానిక సమస్యలపై చర్చించి, వాటిని పరిష్కరించేందుకు ప్రజలతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

చొప్పదండి, రామడుగు, వీణవంకలో..
నవతెలంగాణ - చొప్పదండి
చొప్పదండి పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, స్వీట్ల పంపిణీ జరిగింది. బత్తిని ప్రశాంత్, మంచి కట్ల మల్లేష్, గుండేటి శివశంకర్, అనుకారి సాయి కృష్ణ, వడ్లూరి సుధాకర్ తదితరులు హాజరయ్యారు. రామడుగు మండలంలోని దేశరాజుపల్లిలో జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్ జెండా ఎగురవేసి, పేదల సంక్షేమం, వికసిత్ భారత్ నిర్మాణమే బిజెపి లక్ష్యమని పేర్కొన్నారు. జాతరగొండ ఐలయ్య, వెలుముల రమేష్, ఉప్పు రవి, మీసాల సునీల్ పాల్గొన్నారు. వీణవంకలో మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్ జెండా ఆవిష్కరించగా, సిహెచ్ నరసింహ రాజు, రామిడి ఆదిరెడ్డి, పెద్ది మల్లారెడ్డి హాజరయ్యారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం



నవతెలంగాణ-రామగిరి

లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటనరీ కాలనీ, రేకుర్తి కంటి ఆసుపత్రి కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వనం రాంచందర్ రావు సహకారంతో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు లద్నాపూర్ గ్రామంలోనీ గ్రామ పంచాయతీ భవనంలో ఉచితకంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, వైద్య శిబిరంలో కంటి చూపులో లోపాలున్న వారికి డాక్టర్లచే పరీక్ష చేయించి వారిలో మోతే బింధు (కంటిలో శుక్లాలు) ఉన్నవారిని గుర్తించి ఆపరేషన్ అవసరమైన వారిని వెంటనే రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ, కరీంనగర్ తీసుకువెళ్లి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించబడునని రామచంద్రరావు తెలిపారు. మరిన్ని వివరాలకు గంట వెంకటరమణ రెడ్డి 9849655990, డాక్టర్ శరణ్య మారుతి యాదవ్ 9014255745 లను సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



ముత్తారంలో...

నవతెలంగాణ-ముత్తారం:

శ్రీ రామనవమి సందర్భంగా ముత్తారం మండలంలో శ్రీ రాములవారి కల్యాణం కమనీయం... రమణీయం జరిగింది. ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో జరిగిన రాములోరి కల్యాణాన్ని వీక్షించేందుకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, ఆయా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, మాజీ వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ రావు, మాజీ సింగిల్ విండో చైర్మెన్ గుజ్జుల రాజిరెడ్డి, సల్ల సమ్మయ్య, బియ్యని రాజు తదితరులున్నారు.

నవతెలంగాణ -ఎలిగేడు

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్ పల్లి లోని శ్రీ నాగ లింగేశ్వర స్వామి ఆలయం, ఎలిగేడు కోదండ



ధర్మపురిలో....

రామాలయం, సుల్తాన్‌పూర్ రామాలయం, లాలపల్లి శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయం, ముప్పిరితోట వెంకటేశ్వర స్వామి ఆలయం, ధూళికట్ట, లోకపేట, నర్సాపూర్ గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహెూత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు దుగ్యాల సంతోషరావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర రావు, ఉన్నారు.

నవతెలంగాణ-ఓదెల

మండలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో, పొత్కపల్లి శివాలయంలో,గుంపుల శ్రీరామ భద్ర ఆలయంలో ఆదివారం శ్రీ రామ నవమి పండుగను పురస్కరించుకుని సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో ఈవో సదయ్య ఆధ్వర్యంలో పట్టు వస్త్రాల సమర్పించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున స్వామి ఆలయ ఈవో సదయ్య, పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్, గుంపుల రామభద్ర ఆలయ చైర్మన్ వేల్పుల రమేష్, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఓదెల

మండలంలోని గుంపుల గ్రామంలోని రామభద్ర ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారామ చంద్రస్వామి కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి,రామభద్ర ఆలయ చైర్మన్ వేల్పుల రమేష్, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి,తిప్పారపు సంపత్,పాల్గొన్నారు.

నవతెలంగాణ-జూలపల్లి /ధర్మారం

శ్రీ రామ నవమి సందర్భంగా ధర్మారం మండల కేంద్రంలోని రామాలయాన్ని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సందర్శించి రామ చంద్ర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పూసుకురి పద్మజ, జితేందర్ రావు, కొత్త నరసింహులు పాల్గొన్నారు.



మంథనిలో...

నవతెలంగాణ-జూలపల్లి

మండల కేంద్రంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలికుంట, కోనరావుపేట, వడ్కాపూర్, కుమ్మరికుంట, గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవానికి గ్రామ నాయకులు పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధారబోయిన నరసింహం యాదవ్, బొద్దుల లక్ష్మణ్, సొల్లు శ్యామ్, తొంటి బుచ్చయ్య, ఐలోని యాదవ్, తొంటి మధుకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-మంథని

మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం తన స్వస్థలం ధన్వాడ గ్రామంలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబుతో హాజరై కల్యాణాన్ని తిలకించారు. ముందుగా మంత్రి శ్రీధర్ బాబు స్వామివారికి పట్టు వస్త్రాలు,తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ధన్వాడ గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణంలో పుట్టమధు

నవతెలంగాణ-మంథని

శ్రీరామనవమి సందర్భంగా మంథని నియోజక వర్గంలోని పలు ఆలయాల్లో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహెూత్సవాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. మంథని మున్సిపల్ పరిధిలోని హనుమాన్‌నగర్,శ్రీరామ్ నగర్, మంథని మండలం మైదుపల్లి,ముత్తారం మండలం లక్కారం,రామగిరి మండలం రామయ్య పల్లె గ్రామాల్లోని హనుమాన్, కోదండ రామాలయాల్లో సీతారాముల కల్యాణం వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

శ్రీ విశ్వావసునామ సంవత్సరం శుక్లపక్షం నవమి తిథి అయిన ఆదివారం రోజున లోకకళ్యాణార్థం శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు కనుల పండుగగా నిర్వహించారు.శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ వేడుకలకు తిలకిడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కళ్యాణ వేడుకలను చూసి పునీతులయ్యారు.మంథని మండల పరిధిలోని శ్రీరామ్ నగర్,మైదుపల్లి, రచ్చపల్లి,ఎగ్లాస్ పూర్,మంథని పట్టణము లోని గోదావరి నది ఒడ్డున వెలిసిన సీతారాముల దేవాల యం,అయ్యప్ప స్వామి,శ్రీపాద కాలనీ,పలు గ్రామాలలోని దేవాలయాల్లోశ్రీ సీతారాముల కళ్యాణ మహెూత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతరామల కళ్యాణం చైత్రశుద్ధ నవమి సందర్భంగా నిర్వహించే కల్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు పానకం, వడపప్పు, మహాప్రసాదంగా అందజేశారు.

మహనీయుల స్ఫూర్తితో పోరాడాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి



నవతెలంగాణ-గోదావరిఖని:

మహనీయుల స్ఫూర్తితో సామాజిక అణిచివేతపై పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. భారత కార్మిక ఉద్యమ నిర్మాత, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదీవే 35వ వర్ధంతి సందర్భంగా గోదావరిఖని సీఐటీయూ శ్రామిక భవన్‌లో బీటీ రణదీవే చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక న్యాయం-సీఐటీయూ అవగాహన అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ బీటీ రణదీవే విద్యార్థి దశ నుండే జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారని, స్వాతంత్రోద్యమంలో ముఖ్యపాత్ర పోషించారని, ఆ సమయంలోనే కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి కార్మిక సంఘాలను నిర్మించారని, ఈసందర్భంలో అనేక సార్లు జైలుకు వెళ్లారని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భారత ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి, ఐక్య పోరాటాలు నిర్మించడంలో క్రియాశీలక పాత్ర పోషించారని, ఐక్యత- పోరాటం అనే నినాదంతో ఏర్పడిన సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎన్నికై దేశంలో కార్మిక వర్గ రాజ్య స్థాపన లక్ష్యంగా సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించారని, దేశంలో సామాజిక అణిచివేత, కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, కార్మిక వర్గం పోరాడాలని నిర్దేశించిన నాయకుడు బీటీ రణదీవే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు మెండె శ్రీనివాస్, ఆర్జీ 1 అధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, తోట నరహరి రావు, ఆసరి మహేష్, దాసరి సురేష్, బూరుగుల రాములు, ఈదుల సాగర్, ఈద వెంకటేశ్వర్లు, పి శ్రీనివాసరావు, వంగల శివరాం రెడ్డి, జి దుర్గాప్రసాద్, పెద్దపల్లి శశికిరణ్, మల్క కార్తీక్, ఫక్రుద్దీన్, సాగర్, సిహెచ్ ఉపేందర్, బంద్ర మహేశ్వరి, టి.సుజాత, బి.రజిత, వాణి, వాసవి, నర్సమ్మ, శంకరమ్మ రాజయ్య, శివ, తిరుపతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రేషన్ షాపులో ప్రధాని ఫొటో పెట్టాలి

బీజేపీ రామగుండం ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి

నవతెలంగాణ-గోదావరిఖని:



కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న 5కిలోల ఉచిత బియ్యానికి కేవలం ఒక కిలో బియ్యాన్ని అందజేస్తూ మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తుందని అబద్ధపు ప్రచారం చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార తీరును చూస్తుంటే సొమ్మొకరిది సోకొకరిది అన్నట్టు ఉందని బీజేపీ రామగుండం ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి ఎద్దేవా చేశారు. గోదావరిఖనిలోని పలు రేషన్ షాపులను ఆదివారం ఆమె సందర్శించి, ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాన్ని రేషన్ షాపు ఏర్పాటు చేయాలని డీలర్లని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతీ పేదవాడికి 5 కిలోల సన్న బియ్యం ఉచితంగా అందజేస్తుందని, లబ్ధిదారులకు ప్రధాని మోడీ అందజేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించి, రేషన్ షాపు ఎదుట మోడీ చిత్రపటాన్ని పెట్టే వరకు రేషన్ షాపు నుండి వెనుదిరిగి వెళ్ళేది లేదని డీలర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోమల మహేష్, కొండపర్తి సంజీవ్, మచ్చ విశ్వాస్, ఆకాశ్, రంజిత్, కుర్ర రాజేందర్ తదితరులున్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని రమేష్ నగర్ చౌరస్తాలోని ఆటో స్టాండ్ వద్ద నారద సురేంద్ర రావు ప్రతిభ రాణి స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. రామగుండం ట్రాఫిక్ సిఐ రాజేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి మాట్లాడారు. వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నారదాసు సురేందర్ రావు కుమారులు, రమేష్ నగర్ ఆటో యూనియన్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అమ్మపరివార్ చిన్నారులకు బట్టల పంపిణీ

నవతెలంగాణ-గోదావరిఖని:



మాజీ ఎంపీపీ, శ్రీ ఆది వరహాస్వామి ఆలయ మాజీ చైర్మన్ ఇనగంటి ప్రేమలత జగన్నాథ రావుల కుమారుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇనగంటి రామారావు పుట్టినరోజు సందర్భంగా గోదావరిఖనిలోని అమ్మ పరివార్ అనాథ ఆశ్రమంలో వ్యాపారవేత్త పీట్ల గోపాల్, హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనగంటి రామారావుచే కేక్ కట్ చేయించి వేడుకలను నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించి, చిన్నారులకు బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇనగంటి రోహిత్ రావు, కమ్మ గోని అనిల్, విజయ్, సయ్యద్ జాకీర్, చెన్నూరు అభిలాష్, డొంకెన విజయ్, కీర్తి సాయి, పాల్గొన్నారు.

కార్మిక,కష్టజీవుల కోసం పోరాటం చేసిన వ్యక్తి బీటీ రణదీవే

నవతెలంగాణ-మంథని



భారత కార్మిక ఉద్యమ నిర్మాత కామ్రేడ్ బీటీ రణదీవే స్వాతంత్ర పోరాటంలో పాల్గొంటూ కార్మిక కష్టజీవుల హక్కుల కోసం రాజులేని పోరాటం నిర్వహించిన మహా గొప్ప వ్యక్తి రణదీవే అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. ఆదివారం మంథనిలోని మంథని విద్యార్థి యువత కార్యాలయంలో బీటీ రణదీవే వర్ధంతి కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముత్యంరావు మాట్లాడుతూ దేశంలో కార్మిక సంఘాలకు కేంద్రబిందువుగా ఉన్న విప్లవకర ట్రేడ్ యూనియన్ సీఐటీయూని స్థాపించడంలో కామ్రేడ్ రణదీవే ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆర్థిక పోరాటలతోపాటు సామాజిక సాధన కోసం కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ దేశంలో కార్మిక రాజ్య స్థాపన కోసం పోరాటాలను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. బిక్షపతి, సీపెల్లి రవీందర్, సహాయ కార్యదర్శి జి. జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్, నాయకులు ఆర్ల సందీప్, జి.సురేష్, పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

నవతెలంగాణ-మంథని

మండలంలోని గాడుదుల గండి సమీపంలో కారు ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో మంథని పోచమ్మ వాడకు చెందిన గడి రవి(45)అనే వ్యక్తి మృతి చెందాడు. పని కోసం వెంకటాపూర్ వెళ్లి మంథనికి తిరిగి వస్తుండగా రవి ద్విచక్ర వాహనానికి ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రగాయాలు కాగా మంథని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మంథని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య,ఇద్దరు కొడుకులు ఉన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-గోదావరిఖని:

శ్రీ రామనవమి సందర్భంగా గోదావరిఖని రాంమందిర్ వద్ద జరిగిన వేడుకల్లో స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు వేసవి దృష్ట్యా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు.

విద్యార్థుల భవిష్యత్ కోసమే పాఠశాలను స్థాపించా

వార్షికోత్సవ వేడుకల్లో రాష్ట్ర పాఠశాల నిర్వాహకులు గూళ్ళ లక్ష్మన్ కుమార్ వెల్లడి

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ



ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం విద్యార్థుల భవిష్యత్ కోసమే 8వ కాలనీలో పాఠశాలను స్థాపించానని శ్రీవాణి పాఠశాల వ్యవస్థాపకులు గూళ్ళ లక్ష్మన్ కుమార్ అన్నారు.8వ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం శ్రీవాణి పాఠశాల వార్షికోత్సవ వేడుకలు, గ్రాడ్యుయేట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యూకేజీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూళ్ళ లక్ష్మన్ కుమార్ మాట్లాడుతూ 1986లో పాఠశాలను స్థాపించి 40 సంవత్సరాలు అయినందున ఈ కార్యక్రమం నిర్వహించామని విద్యార్థులను ప్రోత్సహించడం, వారి విద్యా పనితీరును మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కొమురయ్య, ఎస్‌టీయూ జీఎం ఎం రాముడు, యూనియన్ నాయకులు దశరథం గౌడ్,ప్రిన్సిపాల్ జి మానస అధికారులు పాల్గొన్నారు.

పేదల కోసం ఆలోచించే ప్రభుత్వం కాంగ్రెస్..

పెంచికల్ పేట్ గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షులు ఇరుగురాళ్ల శేఖర్

నవతెలంగాణ - కమాన్‌పూర్



పేద ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి క్షణం అలోచిస్తుందని పెంచికల్‌పేట్ గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇరుగురాళ్ల శేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని పెంచికల్ పేట్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు సన్నం బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రరమంలో న్యాయవాది ఇరుగురాల సంతోష్, పిడుగు వెంకటేష్, రామగిరి రమేష్, అనవేన భూమయ్య, లింగాల వెంకన్న, ఇరుగురాల లక్ష్మణ్, ఇరుగురాల నాగేష్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుములకు మంత్రి అభినందన

నవతెలంగాణ-మంథని



గత రెండు ఏండ్ల కింద న్యాయవాద పరీక్షల్లో పాస్‌అయి కోర్టుల్లో న్యాయవాద ప్రాక్టీస్ కొరకు అవసరమైనా సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ)కొరకు అల్ ఇండియా బార్ కౌన్సిల్ నిర్వహించిన పరీక్షలో ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో పాస్ అయిన హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఓ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, రాష్ట్ర మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా గతంలో తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ సర్టిఫికెట్ తీసుకోగా, ఆదివారం అల్ ఇండియా బార్ కౌన్సిల్ పరీక్ష పాస్ ధ్రువీకరణ పత్రంను అందుకున్నారు.

మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మంథని

గాజులపల్లి, ఎక్లాస్‌పూర్,పుట్టపాక గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఐటి,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాలాభిషేకం నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం సన్న బియ్యం పంపిణీ పథకం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్,బొడ్డు శ్రీనివాస్,లింగయ్యయాదవ్, చైతన్యప్రభాకర్ రెడ్డి,అజీమ్ ఖాన్, మంథని సత్యం,ఐలి.శ్రీనివాస్ కలవల రాజేశం, పాల్గొన్నారు.

బీసీ సంఘం జాతీయ అధ్యక్షునికి ఆహ్వానం

నవతెలంగాణ-గోదావరిఖని:



గోదావరిఖని ఓసీపీ 5 వద్ద ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహా ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీసీ ఉద్యమ నేత, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యనును బీసీ లైసన్ ఆఫీసర్ పెరుమాల్ల శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి బీసీ అసోసియేషన్ నాయకులు కైలాసకోటి శ్రీనివాస్, జెల్ల గజేందర్ తదితరులున్నారు.

మహనీయుల స్ఫూర్తితో సామాజిక అణిచివేతపై పోరాడాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

నవతెలంగాణ-పెద్దపల్లి



మహనీయుల స్ఫూర్తితో సామాజిక అణిచివేతపై పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. భారత కార్మిక ఉద్యమ నిర్మాత, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదీవే 35వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక శాంతినగర్ లోని సీఐటీయూ ఆఫీసులో బీటీ రణదీవే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ బీటీ రణదీవే విద్యార్థి దశ నుండే జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారని అన్నారు. స్వాతంత్రోద్యమంలో ముఖ్యపాత్ర పోషించారని,ఆ సమయంలోనే కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి కార్మిక సంఘాలను నిర్మించారని అన్నారు.ఆ సందర్భంలో అనేకసార్లు జైలుకు వెళ్లారని గుర్తు చేశారు.స్వాతంత్ర్య అనంతరం భారత ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి ఐక్య పోరాటాలు నిర్మించడంలో క్రియాశీలక పాత్ర పోషించారని, "ఐక్యత- పోరాటం "అనే నినాదంతో ఏర్పడిన సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులుగా దేశంలో కార్మిక వర్గ రాజ్య స్థాపన లక్ష్యంగా సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించారని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి, జ్యోతి,సిపెల్లి రవీందర్, ఎండి, కాజా, నాగయ్య రాజయ్య పాల్గొన్నారు.

దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ప్రధాని మోడీ

బీజేపీ రాష్ట్ర నాయకులు సునీల్ రెడ్డి

నవతెలంగాణ-మంథని



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతదేశాన్ని శరవేగంగా అభివృద్ధి బాటలో నడిపిస్తూ ఆర్థిక రంగంలో ప్రపంచ స్థాయిలో మూడో స్థానానికి తీసుకుపోతున్న గొప్ప వ్యక్తని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంథనిలోని గాంధీ చౌక్‌లో బీజేపీ జెండా ఆవిష్కరించి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని పట్టిపీడిస్తున్న అనేక ప్రధాన సమస్యలను ఆర్టికల్ 370 గానీ, సీఏఏ, వక్ఫ్ బిల్లు, త్రిపుల్ తలాక్, అయోధ్య రామ మందిరం నిర్మాణం లాంటి వాటిని సాహసోపేత నిర్ణయాలతో నరేంద్ర మోడీ పరిష్కరించారన్నారు. గరీబ్ కళ్యాణ్ యోజనలో భాగంగా తెలంగాణ ప్రజానీకానికి సన్నబియ్యం రేషన్ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం75 శాతం బడ్జెట్ కేటాయిస్తే,రాష్ట్ర ప్రభుత్వం కేవలం 25 శాతం బడ్జెట్ కేటాయించి తెలంగాణ ప్రజానీకానికి సన్న బియ్యం మేమే ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొండపాక సత్య ప్రకాష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బోగోజు శ్రీనివాస్, జిల్లా మాజీ అధికార ప్రతినిధి పోతరవేణి క్రాంతి కుమార్, నాంపల్లి రమేష్‌లు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఎస్పివి అభినందన్ వేడుకలు



నవతెలంగాణ-రామగిరి

రామగిరి మండలం బేగంపేట గ్రామంలోని సాయి ప్రగతి విద్యానికేతన్ కిడ్స్ కాన్వెంట్ లో శనివారం రాత్రి అభినందన్-2K25 వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంను ఉద్దేశించి అతిథులు మాట్లాడుతూ ఇంత మారుమూల గ్రామంలో కార్పొరేట్ తరహా విద్యను అన్ని హంగులతో అతి తక్కువ ఫీజులకు అందిస్తున్నందుకు ఈ పాఠశాల మేనేజ్‌మెంట్‌ను అభినందించారు. సాయి ప్రగతి విద్యానికేతన్ ఫౌండర్ అయిన ముత్తె చంద్రమౌళిని 'విద్యా విశిష్ట రత్న' పేరుతో కార్యక్రమ అతిథులతో పాటు వారి పూర్వ విద్యార్థిని, విద్యార్థులు కలసి ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ తన 36 ఏండ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను చక్కగా తీర్చిదిద్ది, ఇప్పుడు వారిని ఉన్నత స్థానాలలో చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉన్నదని, తన జీవన ప్రయాణం లో సంపాదించుకున్న ఆస్తులు వీరేనని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కరస్పాండెంట్ శ్రీ చందుపట్ల తిరుపతి రెడ్డి, ట్రస్మా రాష్ట్ర సెక్రటరీ అరకాల రామ చంద్రారెడ్డి, రామగిరి మండల విద్యాధికారి ఎనగందుల కొంరయ్య, సాయి ప్రగతి విద్యానికేతన్ ఫౌండర్ ముత్తె చంద్రమౌళి, ట్రస్మా పెద్దపల్లి జిల్లా నాయకులు అంజారెడ్డి,ట్రస్మా రామగుండం నాయకులు సమ్మారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేతగా నిలిచిన రిలే సీ 1 ఇంక్లైన్ ఉద్యోగులు

నవతెలంగాణ-గోదావరిఖని:

క్రికెట్ పోటీ విజేతగా రిలేసీ 1 ఇంక్లైన్ ఉద్యోగుల జట్టు నిలిచింది. ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే 1వ ఇంక్లైన్ ఉద్యోగులను 7 జట్లుగా విభజించి 14 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఫైనల్ మ్యాచ్ గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో చేపట్టారు. టోర్నమెంట్ నిర్వాహకులు సిర్ర మల్లికార్జున్, వినయ్ కుమార్, రమేశ్ కుమార్ వ్యవహరించారు. ఫైనల్ మ్యాచ్‌లో జీడీకే-1వ ఇంక్లైన్‌కు చెందిన రిలేఎ, రిలేసీ ఉద్యోగుల జట్లు పాల్గొన్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌లో రిలేసీ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా మొదటి బహుమతి 15వేలు, రెండవ బహుమతి 10వేల రూపాయలను అందజేశారు. విజయం సాధించిన జట్టుకు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్స్ సంకె అశోక్, మాదన మహేష్, ఫిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, నాయకులు గుర్రం ప్రభుదాస్, స్పాన్సర్స్ మేకల నాంపల్లి, టోర్నమెంట్ నిర్వాహకులు మల్లికార్జున్ భరత్, సతీష్, సంతోష్, చంద్ర శేఖర్, రమేశ్, చంద్ పాల్గొన్నారు.

మూడు ముక్కలాడుతూ పట్టు పడిన యువకులు

నవతెలంగాణ-మంచిర్యాల



మూడు ముక్కలట ఆడుతున్న 7 గురిని ఆదివారం అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నమ్మ దగిన సమాచారం మేరకు జిల్లా కేంద్రంలోని తిలక్ నగర్ పరిసర ప్రాంతంలో సిబ్బందితో కలిసి గస్తి నిర్వహించగా మూడు ముక్కలట ఆడుతున్న 7 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టు బడిన వారిలో గోదార్ల రమేష్, దేవసాని కుమార్, ఆటకారి శ్రీను, వనం లక్ష్మణ్, మాచర్ల వెంకటేష్, తోకల శ్రీనివాస్, గౌరీ ప్రసాద్‌లు ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రు 2100, 4 సెల్ ఫోన్‌లు, 2 మోటార్ సైకిల్స్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతులు

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని నేషనల్ హైవే నుంచి ప్రగతి స్టేడియం వరకు రహదారిపై గుంతలు పడి అధ్వాన్నంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు గుంతల మయమై గోదావరిఖని వైపు, బెల్లంపల్లి, వర్క్‌షాప్ వెళ్ళే కార్మికులు కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాలలో వాహనదారులకు యాక్సిడెంట్ అయి చాలా ప్రమాదాలకు గురయ్యారు. విషయం స్తానిక మాజీ ప్రజా ప్రతినిధి మాజీ ఎంపీటీసీ ఏల్పుల మమత-రవీందర్ దృష్టికి రాగ రూ.45 వేలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా 6వ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జి చిలుక మల్లేష్, కాంగ్రెస్ సినియర్ నాయకులు పోట్ల చర్ల రాములు, కాంగ్రెస్ నాయకులు శనిగారం భూమయ్య, కాదాసి రాజయ్య, గండు మల్లయ్య, కళ్లపల్లి స్వామి, మొండి, బక్కదట్ల ఓదెలు, రామగిరి మల్లన్న అభినందించారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మేడే పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్ డివిజన్‌లోని అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే పర్వదినాన్ని పురస్కరించుకొని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పి.నర్సయ్య స్మారకార్థం క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని అన్ని గనులు డిపార్ట్మెంట్లలో దాదాపు 40 శాతం మంది యువ కార్మికులు ఉన్నారని, ఈ పోటీల ద్వారా వారి ప్రతిభను కనబరిచి భవిష్యత్తులో సింగరేణి యాజమాన్యం నిర్వహించే పోటీలకు ఎంపిక అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ పోటీల ద్వారా అన్ని గనుల కార్మికులతో సన్నిహిత్యం పెరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని శ్రీరాంపూర్ డివిజన్‌లోని యువ కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పోటీలలో భాగంగా ఆదివారం ఆర్కె-5 గని కార్మికులతో మ్యాచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సకినల నర్సయ్య, ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగ్ రావు, ట్రేడ్స్ మేన్స్ ఉపాధ్యక్షుడు సురేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజ్ కుమార్, నాయకుల అగ్గు శ్రీకాంత్, శ్రీనివాస్, జీపీ రావు, సందీప్ పాల్గొన్నారు.

ఆకతాయిల ఆట కట్టించిన షీ టీమ్ సిబ్బంది



నవతెలంగాణ-మంచిర్యాల

ఇష్టానుసారంగా రోడ్లపై తిరుగుతూ మహిళలు, అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేసే వారి పై కఠిన చర్యలు తీసుకో బడుతాయని మంచిర్యాల షీ టీమ్ ఎస్ఐ హేమ అన్నారు. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా దేవాలయాలు, కల్యాణనికి వెళ్లే మహిళలుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలో షీ టీమ్ సిబ్బందితో ప్రత్యేక గస్తి ఏర్పాటు చేశారు. పట్టణంలోని గోదావరి రోడ్, రాంనగర్, గౌతమి నగర్‌లలో నిర్వహించే సీత రాముల కల్యాణ వేడుకలకు హాజరయ్యే మహిళలు, అమ్మాయిల చుట్టు తిరుగుతూ ఇబ్బందులకు గురి చేసిన పలువురు యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ నిర్వహించి నట్లు తెలిపారు. ఎవరైనా మహిళలు వేధింపులకు గురి అవుతున్న, ఏదైనా ఇబ్బందులు కలిగిన డయల్ 100, షీ టీమ్ నెంబర్ 6303923700కు సమాచారం అందించాలని కోరారు.

ప్రజా ఉద్యమంతోనే బుద్ధి చెప్పాలి

నవతెలంగాణ-జైపూర్

పెత్తందార్ల అరాచకాలకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులకు బుద్ధి చెప్పాలంటే ప్రజా ఉద్యమాలతోనే సాధ్యమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. వేమనపల్లి మండలం మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య కుటుంబాన్ని ఆదివారం సీపీఐ(ఎం) బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా సంకెరవి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మృతి చెందిన ఆదివాసి బిడ్డ పెత్తందార్ల దుర్మార్గానికి పురుగుల మందు తాగి బలవన్మరణం పొందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు పెత్తందార్ల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. గుడుంబా అమ్మేది బెల్టు షాపులు నిర్వహించేది పెత్తందారులే. వారి దుర్మార్గాలకు ఆదివాసి, దళితులు బలైపోతున్నారని, గొడ్డు చాకిరి చేయించుకోవడమే కాకుండా మానసిక హింసలు, వేధింపులు ఆదివాసి, దళితులు ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకున్న ఆదివాసీ బిడ్డ నాయిని కన్నయ్య కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వడమే కాకుండా కన్నయ్య మృతికి కారకులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంగెనపల్లికి చెందిన ఎనగంటి చిన్నన్నకు పాలేరుగా పని చేస్తున్న నాయిని కన్నయ్యపై అగ్రవర్ణపు అహంకారం కన్నయ్య ఆత్మహత్యకు కారణం అయిందని అన్నారు. మృతునికి భార్య స్వరూప, 9 సంవత్సరాల కుమారుడు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చొరవ చూపించాలని ఇక్కడ ఆదివాసి దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని క్షేత్ర స్థాయిలో గుర్తించి బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోడంకి చందు, సామల ఉమారాణి, జిల్లా కమిటి సభ్యులు మడిమాడుగల బ్రహ్మయ్య, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షుడు ఎర్మా పున్నం పాల్గొన్నారు.

• నాయిని కన్నయ్య కుటుంబాన్ని పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం



మంగెనపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నాయకుల బృందం

ఘనంగా బీటీ రణదీవే 35వ వర్ధంతి



జన్నారంలో..

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ వ్యవస్థాపకులు బీటీ రణదివే 35వ వర్ధంతిని సీఐటీయూ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు కూకటికారి బుచ్చయ్య, మండల నాయకులు అంబటి లక్ష్మణ్ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15 తర్వాత దేశానికి స్వాతంత్రం లభించిన తర్వాత దేశంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయన్నారు. అంతవరకు ఒకటిగా ఉన్నా భారత కమ్యూనిస్టు పార్టీలో సంస్కరణ వాద పోకడల వల్ల సిద్ధాంత విభేదాలు తీవ్రమవడంతో 1964లో కొంతమంది నాయకులతొ బీటీ రణదివే బయటకు వచ్చి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ను ఏర్పాటు చేశారన్నారు. పార్టీ చీలినప్పటికీ ట్రేడ్ యూనియన్ ఐక్యతగా ఉండాలని రణదీవే ఏఐటీయూసీతో పని చేయాలని భావించారు. ఏఐటీయూసీ అసమ్మతి వాదులతో కలిసి పనిచేయటం ఎక్కువ కాలం కుదరలేదు. దీనితో ఏఐటీయూసీలో చీలిక అనివార్యమయ్యింది. 1970 మే 28 నుండి 31 తేదీలలో కలకత్తాలో జాతీయ మహాసభలో కార్మిక వర్గ విశాల ప్రయోజనాల కోసం ఒక సీఐటీయూను ఏర్పాటు చేశారన్నారు.. మొదటి మహాసభలో 5000 మంది ప్రతినిధులు హాజరైనారన్నారు. దీనికి సీఐటీయూ మొట్టమొదటి అధ్యక్షుడిగా రణదీవేని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరపు అశోక్, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, మండల కన్వీనర్, దాసండ్ల రాజన్న, అంబటి సువర్ణ, శ్రీనిధి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : మండల కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం కార్మిక ఉద్యమ నాయకులు సీఐటీయూ అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవే 35వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పాల్గొని రణదివే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాగర్, రవి రాజన్న విలాస్ రాయలింగు తదితరులు కార్మికులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో..

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట గ్రామానికి చెందిన దుర్గం రమ్య(27) ఆత్మహత్య చేసుకుందని కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రమ్యకు 2016లో కాసిపేటకు చెందిన దుర్గం రాయమల్లుతో వివాహం జరిగింది. కొద్ది రోజుల క్రితం దుర్గం రాజమల్లుకు పక్షవాతం రాగా మృతురాలు దుర్గం రమ్య కూలీ పని చేయగా వచ్చిన డబ్బుతో పాటు కొంత అప్పుచేసి అతనికి చికిత్స చేయించింది. ఇదే విషయమై చాలా సార్లు మృతురాలు తన తండ్రి కుమ్మరి రాజన్నకు చెప్పుకొని బాధపడుతుండేది అతను చాలా సార్లు కూతరుకు ధైర్యం చెప్పేవాడు. తర్వాత తన భర్త అనారోగ్యంతో పాటు అప్పుల బాధను భరించలేక జీవితం మీద విరక్తి చెంది దుర్గం రమ్య ఆదివారం ఉదయం కాసిపేటలోని తన ఇంట్లో పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటుండగా, కుటుంబ సభ్యులు చూసి వెంటనే అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతురాలి తండ్రి కుమ్మరి రాజన్న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఉపరితల గని కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ అన్నారు. ఆదివారం ఇందారం ఉపరితల గనిలో పనిచేస్తున్న ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని కాంట్రాక్టు కార్మికులను కలిసి మద్దతు తెలిపారు. కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఇందారం ఉపరితల గనిలో పనిచేస్తున్న వాల్వో డ్రైవర్లకు వరాహ కంపెనీ యాజమాన్యం కనీస వేతనాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. 18 నెలలుగా జీతాలు పెంచకుండా వెట్టి చాకిరి చేయించుకున్నారని ఆరోపించారు. వెంటనే సింగరేణి యాజమాన్యం స్పందించి తప్పని పరిస్థితులలో సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-మంచిర్యాల

ఇందరంలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో చదువుకున్న 2005 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. దాదాపు 20 సంవత్సరాల అనంతరం ఒకే వేదికపై ఆనాటి విద్యార్థులు అంత కలవడంతో వారి ఆనందనికి అవధులు లేకుండా పోయింది. అప్పటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. వారికి విద్య బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సందర్భంగా ఫోటోలు దిగుతూ సందడి చేశారు.

హైకోర్టు మాజీ న్యాయమూర్తిని కలిసిన అత్రం సుగుణ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గుండా చంద్రయ్యను కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంటు ఇన్‌చార్జి అత్రం సుగుణ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ రాజకీయ నాయకులు పేద ప్రజలకు సేవ చేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలవాలన్నారు. రాజకీయ నాయకులకు రాజకీయానికి నీటికి చేపక్కున్న సంబంధం ఉంటుందన్నారు. చేప నీటిలో ఉండి జీవిస్తుంది రాజకీయ నాయకులు ప్రజల్లో ఉండి జీవిస్తారన్నారు. కానీ అన్నిటికంటే ముఖ్యమైనది చదువు అన్నారు. ప్రతి ఒక్కరు చదివితేనే ఆ చదువు మనల్ని ఒక దారిలో పెడుతుంది అన్నారు. తమ తమ పిల్లలను ఉన్నత స్థాయిలలో చదివించి, సమాజంలో మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది మల్లేష్, తిమ్మాపూర్ మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ చంద్రయ్య, జాడి వెంకటయ్య, మార్నేని రెడ్డి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం



జైపూర్ ఎస్టీపీపీలో సీతారాములను దర్శించుకున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భీమారం గ్రామంలోని కోదండ రామాలయంలో ఆదివారం 12:15 గంటలకు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు భక్తుల సమక్షంలో ఆలయ కమిటి ఆధ్వర్యంలో వేదపండితులైన విశ్వేశర శర్మ, తిరునగరి ప్రవీణ్‌లు కల్యాణం చేశారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కల్యానోత్సవానికి హాజరై దేవతామూర్తులను దర్శించుకున్నారు. అదేవిదంగా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో గల రామాలయంలో హాజరైన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ప్లాంట్ ఈడీ చెన్నకేశవుల చిరంజీవి, జనరల్ మేనేజర్ శ్రీనివాసులు ఇతర అధికారుల ఆధ్వర్యంలో పూర్ణకుంబంతో స్వాగతం పలికారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిదంగా జైపూర్ మండల కేంద్రంతో పాటు చెన్నూర్ మండలం సుద్దాల, కోటపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మంచిర్యాలలో..

జన్నారం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పవిత్ర గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారులు వేద పండితులు రాములోరి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని, రామాలయంలో, మందపల్లి గ్రామంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో, జన్నారం పట్టణంలోని, హనుమాన్ ఆలయంలో ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో ఉచిత అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్, అదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, తిమ్మాపూర్ జన్నారం రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జన్నారం రామాలయ కమిటీ చైర్మన్ మిక్కిలినేని రాజశేఖర్, తిమ్మాపూర్ గ్రామ రామాలయ కమిటీ సభ్యులు కమల భూమయ్య, గంగయ్య, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, శ్రీరామ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మంచిర్యాల : జిల్లా కేంద్రంలోని ఆలయాలు రామ నామ స్మరణతో మారు మొగాయి. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పలు గ్రామాలల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. గౌతమి నగర్‌లోని శ్రీకోదండ రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. పాత మంచిర్యాలలోని రామాలయం శివాలయంలో నిర్వహించిన సీతరాముల కల్యణనికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కుటుంబ సభ్యులతో హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ సిబ్బంది. అనంతరం అన్నదానం నిర్వహించారు. హనుమాన్ భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దండేపల్లి : శ్రీరామనవమి వేడుకలు ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సీతారాముల కల్యానాన్ని తిలకించారు. ఆయా గ్రామాలలోని ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వెలగనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు ప్రారంభించారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో పాల్గొని ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు కమిటీ సభ్యులు అందజేశారు.



నస్పూర్‌లో..

లక్షెట్టిపేట : పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయా ప్రాంగణంలో కల్యాణమండపంలో ఉదయం 10.30 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అభిజిత్ లగ్నం కల్యాణం అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నల్మస్ కాంతయ్య, మైలారపు సుధాకర్, సుదర్శన్, తాటికొండ శ్రీనివాస్, చింత అశోక్ కుమార్, యేనగందుల సుధాకర్, పలేర్ల శ్రీనివాస్, పాలకుర్తి లచ్చన్న, రామన్న, మల్లూరి శ్యామ్ సుందర్, అనిల్ గుండా సంతోష్ పాల్గొన్నారు.

నస్పూర్ : శ్రీరాంపూర్, నస్పూర్ ఏరియాలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. నస్పూర్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయంలో డైరెక్టర్(ఆపరేషన్) దంపతులు సూర్యనారాయణ-మాలతి, శ్రీరాంపూర్ ఏరియా జీఎం దంపతులు ఎం శ్రీనివాస్-ఉమారాణి కళ్యాణ మహోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలను అందజేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయ పూజారులు కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. ఈ కళ్యాణానికి కార్మికులు వారి కుటుంబ సభ్యులు పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కేవీ రెడ్డి దంపతులు, ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు టి శ్రీనివాస్ దంపతులు, ఏవీ రెడ్డి దంపతులు, ఏజీఎం ఫైనాన్స్ బీభత్సా దంపతులు, ఎస్టీపీపీ ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్ దంపతులు, డీజీఎం ఐఈడీ కె చిరంజీవులు దంపతులు, ఏరియా స్టోర్స్ మల్లయ్య దంపతులు పాల్గొన్నారు.

మౌనమేల విశ్వగురూ?



'పేకాట పేకాటే, తమ్ముడు తమ్ముడే' అన్నట్టుంది ట్రంప్ వ్యవహారం. అమెరికాను అమాయకుడిని చేసి అందరూ వాడుకున్నారని వాపోతున్నాడు ట్రంప్. అమెరికా అమాయకత్వం వలననే తమ దేశం అన్ని దేశాలకు విదేశీ వాణిజ్యంలో బకాయి పడిందని, దానిని ఇప్పుడు అలెగ్జాండర్ లాగానో, కళింగ యుద్ధానికి ముందు ఉన్న అశోక చక్రవర్తి లాగానో టారిఫ్‌ల యుద్ధం చేసి వసూళ్లు చేసుకుంటానంటున్నాడు.


సునామీలు, భూకంపాలు, వరదలు కొన్ని ప్రాంతాలకు లేక కొన్ని దేశాలకు పరిమితం అవుతాయి. నష్టం అంచనాను వేయవచ్చు. కానీ ఇదొక టారిఫ్ సునామి. ఇక్కడ మిత్ర దేశమా, శత్రు దేశమా అని చూడటంలేదు, ప్రపంచంలోని ఆరువేల జనాభా ఉన్న ధృవ ప్రాంత అనామక దేశం మొదలుకొని అమెరికా అధ్యక్షుడు ఏ దేశాన్ని వదిలిపెట్టలేదు.

ఈ టారిఫ్ పోరులో ఏ దేశానికి ఎంత నష్టం జరుగుతుంది? ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వచ్చే నష్టం ఏమిటి? దీని పర్యవసనాలు ఎలా ఉండబోతున్నాయి? అనేది గందరగోళంగా ఉంది.

ఈ టారిఫ్ వార్‌ని, ట్రంప్ వైఖరిని ఖండించని దేశం లేదు. ఈ ఏకపక్ష టారిఫ్ విధింపు 'ప్రాథమికంగానే చాలా పెద్ద తప్పు' అని జర్మనీ అంటే, 'దుర్మార్గమైనది నిష్ప్రయోజనం అయినది' అని ఫ్రాన్స్ అన్నది." ఆవైపు, ఈ వైపున ఉన్న అట్లాంటిక్ దేశాలలోని కోట్లాదిమంది ప్రయోజనాలకు తీరని నష్ట'మని స్పెయిన్ అన్నది. విశ్వ గురువుగా చెప్పుకునే భారతదేశం ఏమన్నది? ఏమి అనను అన్నది. నోటికి తాళం వేసుకొని కూర్చున్నది. ఇదొక వ్యూహాత్మక మౌనం అని గోడి మీడియా బుకాయిస్తున్నది.

మన దేశంపైన ట్రంప్ విధించిన టారిఫ్ 27శాతం అని పత్రికలన్నీ వ్రాస్తున్నాయి. కాదు, 37శాతం అని (బేస్ లైన్ 10శాతం ఇప్పుడు వేసింది 27శాతం) జేఎన్‌యూలో పనిచేసి రిటైర్ అయిన ప్రొఫెసర్ బిశ్వజిత్ ధర్ ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ టారిఫ్ వల్ల లక్షల ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉన్నదని, దేశ జీడీపీపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆయన చెప్తున్నారు. ఇప్పుడు పార్లమెంటు సమావేశాలు కూడా జరుగుతున్నాయి. మన మీద విధించిన టారిఫ్ పర్యవసానాలు ఏమిటో ప్రకటన చేయమని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రభుత్వ దృష్టి వక్ఫ్ బిల్లు పాస్ చేయించుకోవటం మీదే ఉన్నది.

ఏది ఏమైనా, ప్రపంచమంతా అల్లకల్లోలంగా ఉండటం చూసి , దీని ప్రభావం ఎలా ఉంటుందని భారత దేశ ప్రజలు భయపడుతుంటే, ప్రభుత్వం కనీసం నిజాలు చెప్పడానికి భయపడుతున్నది. బహుశా మిత్రధర్మం పాటిస్తున్నదేమో? కానీ మనకంటే చిరకాల మిత్రులు, సన్నిహిత దేశాలు కూడా ట్రంప్‌ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి. మనకి మాత్రం నోరు పెగలడం లేదు.



చివరకు అమెరికాకు ఇరువైపులా ఉన్న కెనడా, మెక్సికోలు మోగించిన రణభేరితో అల్లకల్లోలంగా ఉంది అమెరికా. ఈవీల్లో వాడే బ్యాటరీలు, వాటిలో ఉపయోగించే నికెల్ వంటివి కెనడా నుంచే సప్లై కావాలి. వాటిని ఆ దేశం ఆపేస్తోంది. ఎలన్‌మస్క్‌తో సహా ఈవీలు తయారు చేసే ఫోర్డ్, జనరల్ మోటార్స్ వంటివి అలమటిస్తున్నాయి. పోర్క్, బీఫ్ వంటివి లేకుండా అమెరికా వారికి ముద్ద దిగదు. వాటిని మెక్సికో బంద్ చేసింది. ఆ రకంగా అమెరికాలో అంతరంగిక సంక్షోభానికి ప్లాన్ చేసింది. ఇవి రెండూ గతంలో 'నాఫ్టా' దేశాలు. చివరికి అమెరికాలో సైతం ఎలన్‌మస్క్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి.

అమెరికా ప్రజలు కూడా ట్రంప్ చేస్తున్న ఈ వాణిజ్య యుద్ధాన్ని తప్పుపడుతున్నారు. అనేకమంది అమెరికా ఈ ఏడాది చివరికి స్టాగ్‌ఫ్లేషన్ (స్టాగ్నేషన్ + ఇన్‌ఫ్లేషన్) లోకి దిగజారుతుందని అమెరికాలోని ప్రసిద్ధ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

2020లో టెక్సాస్‌లో 'హౌడీ మోడీ', అహ్మదాబాద్‌లో 'నమస్తే ట్రంప్' అంటూ పెద్ద ఎత్తున సభలు జరపడానికి ఆనాడు మోడీ నానాహైరానా పడ్డాడు. ట్రంప్ దొర మాత్రం ఎక్కడైనా బావే కాని వంగతోట కాడ కాదంటున్నాడు. అయ్యో! ఇదీ సంగతి..

- కర్లపాలెం

గుండెపోటుతో యర్రా శ్రీకాంత్ ఆకస్మిక మృతి

పార్టీ అఖిల భారత మహాసభల్లో ఉండగా హార్ట్‌ఎటాక్

- మదురైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స
- ఆదివారం మధ్యాహ్నం మరోసారి స్ట్రోక్‌తో మరణం
- విద్యార్థి దశ నుంచీ వామపక్ష ఉద్యమాల్లోనే.. ఈయన ప్రస్తుతం సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు
- పార్టీ తెలంగాణ, ఏపీ రాష్ట్ర కమిటీల సంతాపం
- నేటి ఉదయానికి ఖమ్మం చేరుకోనున్న భౌతికకాయం



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్(62) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. ఆ పార్టీ అఖిల భారత 24వ మహాసభల్లో పాల్గొనేందుకు ప్రతినిధిగా మదురై వెళ్ళిన శ్రీకాంత్ శనివారం మధ్యాహ్నం అస్వస్థతకు గురయ్యారు. పార్టీ నాయకులు మదురైలోని అపోలో ఆస్పత్రిలో వెంటనే చేర్పించారు. అప్పటి నుంచి అక్కడే వైద్య సేవలు పొందుతుండగా ఆదివారం మధ్యాహ్నం మరోసారి తీవ్ర గుండెపోటు వచ్చింది. వెంటనే వైద్యులు సీపీఆర్ ద్వారా ప్రాణాపాయం నుంచి బయట పడేయాలని ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. శ్రీకాంత్ భౌతికకాయాన్ని సోమవారం ఉదయం కల్లా ఖమ్మం తీసుకురానున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో సందర్శన కోసం ఉంచుతారు. శ్రీకాంత్‌కు భార్య నాగసులోచన, ముగ్గురు కుమారులు ఉన్నారు. శ్రీకాంత్ భౌతికకాయాన్ని అపోలో ఆస్పత్రిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఎస్ వీరయ్య, ఎం.సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, చుక్క రాములు, మల్లు లక్ష్మి, పాలడుగు భాస్కర్, నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, మచ్చా వెంకటేశ్వర్లు తదితరులు సందర్శించారు.

ఎస్‌ఎఫ్‌ఐతో మొదలైన ప్రస్థానం..

ఖమ్మంలోని ఓ సాధారణ కార్మిక కుటుంబంలో జన్మించిన శ్రీకాంత్.. విద్యార్థి దశలో ఎస్‌ఎఫ్‌ఐ వైపు ఆకర్షితులయ్యారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 37 సంవత్సరాలుగా కార్మికోద్యమంలో పనిచేస్తున్నారు. అనేక ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఇంటర్మీడియెట్ వరకు చదివిన శ్రీకాంత్ 1980లో సీపీఐ(ఎం)లో చేరారు. 1991 నుంచి పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తున్నారు. శ్రీకాంత్ సతీమణి యర్రా సుకన్య కూడా ఖమ్మం పట్టణ ఐద్వా నాయకురాలిగా ఉన్నారు. రెండు సార్లు కౌన్సిలర్‌గా ఎన్నికై భర్త బాటలో ప్రజా సేవలో భాగమయ్యారు.

బాధ్యతలేవైనా బాధ్యతాయుతంగా..

ఉద్యమ బాధ్యతలు ఏవైనా ఎంతో బాధ్యతాయుతంగా వాటిని నిర్వర్తించడంలో శ్రీకాంత్ ముందుండేవారు. 1982-84 వరకు ఎస్‌ఎఫ్‌ఐలో, 1991 నుంచి సీపీఐ(ఎం) పూర్తికాలం కార్యకర్తగా పని చేస్తున్నారు. 1995లో సీఐటీయూ ఖమ్మం పట్టణ కార్య దర్శిగా, 2002లో పార్టీ ఖమ్మం టౌన్ కార్యదర్శిగా, 2009లో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2011లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికై నేటికీ కొనసాగుతున్నారు. 2019లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా మొదటిసారిగా ఎన్నికవ్వగా.. తిరిగి 2021, 2025ల్లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో కూడా రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.


(ఫైల్)

సీపీఐ(ఎం) తెలంగాణ, ఏపీ రాష్ట్ర కమిటీల సంతాపం

పార్టీలో, ప్రజాసంఘాల్లో చురుకైన పాత్ర పోషించి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు చెరుపల్లి సీతారాములు సంతాపం తెలిపారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉద్యమాల్లోనూ చురుకుగా..

14 ఏండ్ల వయసులోనే ఉద్యమాల్లోకి వచ్చిన శ్రీకాంత్ ఎంతో చురుకుగా ఉండేవారు. చంద్రబాబు ప్రభుత్వ కాలంలో అసంఘటితరంగ కార్మికులు 1300 మందిని సమీకరించి దీర్ఘకాలిక పోరాటం చేశారు. పీఎఫ్, ఇతర సౌకర్యాలు సాధించటం కోసం కృషి చేశారు. 2000లో జరిగిన విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 21 రోజులు జైలు జీవితం గడిపారు. ఖమ్మం గ్రెయిన్ తరలింపును వ్యతిరేకిస్తూ మార్కెట్ కార్మికులను ఏకం చేయడంతో పాటు వేతనాలు, ఇతర సమస్యలపై పోరాటాలు నిర్వహించి ఫలితాలు సాధించారు. పట్టణ ఇండ్ల స్థలాల సమస్యపై పదేండ్లపాటు జరిగిన సుదీర్ఘ పోరాటానికి నాయకత్వం వహించారు. పట్టణ పేదలకు వెంకటగిరి, కోటనారాయణపురం, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు, ఇండ్లు సీపీఐ(ఎం) పోరాట ఫలితంగా వచ్చాయి. నగరంలో సీపీఐ(ఎం) విస్తరణ, నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన శ్రీకాంత్ మరణం పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. శ్రీకాంత్ మృతికి పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.

రాములోరికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు



(మొదటిపేజీ తరువాయి)

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరుకానున్నారు.

మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నాన..

కళ్యాణ వైభవాన్ని చాటేలా చూర్ణికను పఠించిన అనంతరం సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్న సుముహూర్తాన వేదమంత్రోచ్చరణాల నడుమ జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతమ్మ శిరస్సుపై అర్చకస్వాములు ఉంచారు. సీతమ్మవారి మెడలో శ్రీరామచంద్రుడు మాంగళ్యధారణ చేయడంతో కళ్యాణంలో కీలకఘట్టం ముగిసింది.

ఉదయం 10.30 గంటలకు మిథిలాస్టేడియంలో మొదలైన కళ్యాణ తంతు మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. సీఎం, మంత్రులతో పాటు ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, మాళోత్ రాందాస్‌నాయక్, కోరం కనకయ్య, కూనంనేని సాంబశివరావు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, తెలంగాణ, ఏపీ హైకోర్టు జడ్జీలు సూరేపల్లి నంద, కృష్ణమోహన్ తదితరులు కళ్యాణానికి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్ పర్యవేక్షణలో కళ్యాణ వేడుక ప్రశాంతంగా ముగిసింది.

భద్రాద్రికి పోటెత్తిన భక్తులు

భద్రాచలంలో జరిగిన శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ వేడుకకు దేశ నలుమూల నుంచి లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రాష్ట్రం నుంచే కాకుండా సమీప ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున భద్రాచలం తరలివచ్చారు. భక్తుల రాకకనుగుణంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు అర్చక స్వాములు వేద పండితుల సహకారంతో వైదిక క్రతువును విజయవంతంగా జరిపారు. బారులు తీరి మరి భద్రాద్రి రాముడిని దర్శించుకున్నారు. స్థానికులు భక్తులకు అన్నదానం, పానకం, ఇతర ఆహార పదార్థాలు అందజేస్తూ తమ భక్తి భావాన్ని చాటుకున్నారు.

శ్రీరామ పట్టాభిషేకానికి ఏర్పాట్లు

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మిథిలా ప్రాంగణంలో శ్రీరామ పట్టాభిషేకం జరగనుంది. ఈ వేడుకకు రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ క్రమంలో అధికారులు హై అలర్ట్ అయ్యారు. శ్రీరామ పట్టాభిషేకం వేడుకకు కూడా భక్తులు వేలాది సంఖ్యలో హాజరుకానున్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈ వేడుకకు సంబంధించి వైదిక పరమైన ఏర్పాట్లను చేసింది.

సీఎం సన్నబియ్యపన్నం రుచి..

కళ్యాణం అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు బూర్గంపాడు మండలం సారపాకకు వెళ్లారు. అక్కడ నాయకపోడు గిరిజనుడు బోరం శ్రీనివాస్ ఇంట్లో సన్నబియ్యం అన్నం ఆరగించారు. స్థానిక తాళగుమ్మూరులోని రేషన్‌షాప్ ద్వారా పంపిణీ చేసిన సన్నబియ్యంతో చేసిన వంటకాలను రుచిచూశారు. లబ్దిదారు కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. లబ్దిదారు కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యురాలు తులశమ్మను ఆరా తీశారు. దొడ్డుబియ్యం పంపిణీ చేసినప్పుడు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదని తులసమ్మ చెప్పారు. ఇప్పుడు సన్నబియ్యం ఇస్తుండటంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని ఆమె సీఎంతో చెప్పారు. ఇతర పథకాల గురించి కూడా సీఎం లబ్దిదారు కుటుంబాన్ని ఆరా తీశారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్ సబ్సిడీలు అందుతున్నాయా అని ప్రశ్నించారు. వీటితో పాటు ఉచిత బస్సు ప్రయాణం తమకు ఎంతగానో ఉపయోగపడుతోందని తులశమ్మ హర్షం వ్యక్తం చేశారు. సీఎం వెంట మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ కూడా లబ్దిదారు ఇంటికి వెళ్లారు.

యర్రా శ్రీకాంత్ మృతికి సీఐటీయూ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు యర్రా శ్రీకాంత్ మృతికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు రాష్ట్రం మదురైలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో శ్రీకాంత్ భౌతికకాయాన్ని చుక్క రాములు, పాలడుగు భాస్కర్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారని తెలిపారు. యర్రా శ్రీకాంత్ ఖమ్మం పట్టణ కార్మిక ఉద్యమంతో సుదీర్ఘకాలం నుంచి పని చేస్తున్నారనీ, కార్మిక సమస్యలతో పాటు కార్మికుల నివాస ప్రాంత సమస్యలపై కూడా నిరంతరం పనిచేసేవారనీ గుర్తుచేశారు. కార్మిక హక్కుల కోసం యాజమాన్యాలపై నికరంగా పోరాడటమే కాకుండా కార్మికులతో సన్నిహిత సంబంధాలు కూడా కలిగి ఉండేవారని పేర్కొన్నారు. యర్రా శ్రీకాంత్ అకాల మృతి ఖమ్మం జిల్లా సీఐటీయూ ఉద్యమానికి తీరని లోటు అని తెలిపారు. ఆయన మృతికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ తరపున విప్లవ జోహార్లు అర్పించారు.

'కాళేశ్వరం'పై కాంగ్రెస్‌కు చిన్నచూపు

- ఏడాదిన్నర పాలనలో ఈ ప్రాజెక్ట్ కింద ఒక్క ఎకరా భూసేకరణ చేయలే
- రైతులే సొంత డబ్బులతో కాలువలు తవ్వుకుంటున్నారు
- కక్షపూరితంగానే నిధులివ్వట్లేదు : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు



నవతెలంగాణ-సిద్దిపేట

కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్నచూపని, అందుకే ప్రాజెక్ట్‌లో నీళ్లు ఉన్నప్పటికీ.. భూసేకరణ చేయకుండా కాలువలు తవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో ఈ ప్రాజెక్ట్ కింద ఒక్క ఎకరా కూడా భూసేకరణ చేయలేదని అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారం గ్రామం వద్ద బిక్కబండకు వెళ్లే కాలువకు ఆదివారం ఆయన నీటిని విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వం భూసేకరణ చేయకపోవడం వల్ల చాలా చోట్ల రైతులు సొంత డబ్బులు పెట్టుకొని స్వచ్ఛందంగా కాలువలు తవ్వుకుని నీటిని తీసుకుంటున్నారన్నారు. నేడు కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు రంగనాయకసాగర్‌లో, కొండపోచమ్మ, మిడ్‌మానేరులో నీళ్లు ఉన్నాయన్నారు. అయినప్పటికీ కక్షపూరితంగానే ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, కొత్తగా ఒక్క ఎకరం భూ సేకరణ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రాజెక్టులు కట్టి, సిస్టమ్ అంతా రెడీ చేశారని.. పంపు హౌజ్‌లు, రిజర్వాయర్లు, సబ్ స్టేషన్లు, మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ అన్ని రెడీగా ఉన్నాయన్నారు. కొండెంగులకుంట, బిక్కబండ రైతులందరూ వస్తే.. స్వంత డబ్బులతోనే మిషన్లు పెట్టి కాలువలు తవ్వుకున్నారని తెలిపారు. శనివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడానని, పిల్ల కాలు వలు తవ్వితే రైతులకు ఆయకట్టు పెరుగుతుందనీ, కనీసం రూ.15 నుంచి 20 కోట్లు భూసేకరణకు విడుదల చేయాలని కోరినట్టు చెప్పారు. కోకాకోలా ఫ్యాక్టరీ కాళేశ్వరం నీళ్లు ఉండబట్టే వచ్చిందని.. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కుంగిన ఒకటో రెండో పిల్లర్లకు మరమ్మతులు చేసి నీళ్ళు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా గోబెల్స్ ప్రచారం ఆపి, భూ సేకరణ చేసి, కాలువలు తవ్వి రైతాం గానికి నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్.. బుకీ అరెస్ట్



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న బుకీని పోలీసులు అరెస్టు చేసిన ఘటన హనుమకొండ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న హైదరాబాద్‌కు చెందిన ఏజెంట్ చింతపండు కృష్ణ, హనుమకొండకు చెందిన ఆటగాళ్లు మెడిశెట్టి నరేష్, పులి ఓంకార్, పల్లపు సురేష్‌ను పదిరోజుల కిందట హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,58,000 విలువైన సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో కాకినాడకు చెందిన బుకీ గట్టం వీరమణికుమార్ అలియాస్ పండును ఆదివారం హన్మకొండ జిల్లా పద్మాక్షి కాలనీ వద్ద పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అరెస్ట్ చేశారు. 2023లో వీరమణికుమార్ గోవాకు వెళ్ళినప్పుడు హైదరాబాద్‌కు చెందిన యోగేష్ గుప్తా అలియాస్ జోగేష్ గుప్తా పరిచయం అయ్యాడు. అతను ఆన్‌లైన్ గేమ్ క్రికెట్ బెట్టింగ్ యాప్ అయిన రాధే ఎక్స్ఛేంజీ యాప్ గురించి చెప్పి బెట్టింగ్ చేస్తే.. అందులో వచ్చిన లాభంలో 9శాతం వాటా ఇస్తానని చెప్పగా వీరమణికుమార్ ఒప్పుకున్నాడు. దాంతో యాప్ లింక్, యూజర్ నేమ్, పాస్వర్డ్ ఇచ్చాడు. వీరమణికుమార్ అతని అకౌంట్ నెంబర్‌తో పాటు అతని ఫ్రెండ్ అకౌంట్ నెంబర్ కూడా యాప్‌లో సేవ్ చేశాడు. దాంతో బెట్టింగ్ సమయంలో వారి అకౌంట్లలో రూ.5కోట్ల వరకు వచ్చాయి. ఇందులో రూ.3కోట్లు యోగేష్ గుప్తా అకౌంట్‌కు పంపాడు. మిగతా రూ.2కోట్లలో రూ.కోటి ఆట ఆడిన వారికి ఇవ్వగా వీరమణి కుమార్ వద్ద కోటి రూపాయలు ఉన్నాయి. దాంతో కాకినాడలో ఒక్క ప్లాట్, రెండు వైన్‌షాప్‌లు తీసుకున్నాడు. కాగా, ఇప్పుడు హనుమకొండకు రాగా పక్కా సమాచారంతో అతన్ని పట్టుకొని రూ.1,50,000 నగదు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కిలిరి రంజిత్, యోగేష్ గుప్తా అలియాస్ జోగేష్ గుప్తా పరారీలో ఉన్నట్టు ఏసీపీ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడి యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. నిందితుడిని పట్టుకున్న అధికారులను, పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



ఎస్‌ఎఫ్‌ఐ 5వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి

నవతెలంగాణ-భువనగిరి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర 5వ మహాసభలు 2025 ఏప్రిల్ 25,26,27 తేదీల్లో ఖమ్మం నగరంలో జరుగుతాయని, వాటిని జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి తెలిపారు. ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను జిల్లా నాయకత్వంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 10 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్‌ఎఫ్‌ఐ ఉన్నదని, నిత్యం విద్యారంగ సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. విద్యారంగంలో కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ, కేంద్రీకరణ, వ్యాపారీకరణతో పాటు నూతన సంస్కరణల పేరుతో విద్యారంగంలో తీసుకువస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ, విద్యార్థులందరినీ ఐక్యం చేసి దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నడుపుతున్నదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. పేదవిద్యార్థులకు విద్యను దూరం చేసేందుకు ఆధునాతన విద్యావిధానం పేరుతో నూతన విద్యా విధానం- 2020 తీసుకువచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ, గురుకుల వసతిగృహాలకు స్వంత భవనాలు నిర్మించాలని, పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యారంగ పరిరక్షణకు, విద్యార్థి పోరాటాలకు దిక్సూచి కానున్న ఎస్‌ఎఫ్‌ఐ 5వ రాష్ట్ర మహాసభలను విద్యార్థులు, మేధావులు, సామాజిక వేత్తలు అందరూ కలసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ, లావుడియ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల రాహుల్, పట్టణ అధ్యక్షులు నేహాల్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

- వికారాబాద్ జిల్లా దోమ మండలంలో ఘటన

నవతెలంగాణ-దోమ

పొలం వద్ద నిద్రిస్తున్న వ్యక్తి దారుణ హత్యకు గురయిన ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలం ఖమ్మం నాచారం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నాచారం గ్రామానికి చెందిన బోయిని మొగులయ్య (58) శనివారం రాత్రి తన పొలం వద్ద నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని గొడ్డలితో నరికి అతి దారుణంగా హత్య చేశారు. ఆదివారం ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా.. మంచంపై మృతిచెంది ఉన్నాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఐ నాగేందర్ పరిశీలించారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అల్లుడుపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నాగేందర్ తెలిపారు.

ఐఐడీఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి జి.టి. గోపాలరావు మృతి

- భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన సీఐటీయూ నేతలు
- సంతాపం ప్రకటించిన సీఐటీయూ, ఐలూ, ఉద్యోగ సంఘాల నేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐఐడీఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి జి.టి.గోపాలరావు(73) మరణించారు. ఆయన కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి హైదరాబాద్‌లో ఆదివారం చనిపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నాదర్‌గూల్‌లోని కుమారుడి ఇంటికి ఆయన మృతదేహాన్ని తరలించారు. సోమవారం ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు జరగనున్నాయి. నాలుగు దశాబ్దాల పాటు ఆయన రక్షణ రంగ ఉద్యోగుల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. రక్షణ రంగ ఉద్యోగుల సమస్యలతోపాటు కార్మికోద్యమంపై పాలక పార్టీల విధానాలకు వ్యతిరేకంగా తలపెట్టిన సమ్మెల్లో, ధర్నాల్లో ఆయన చురుగ్గా పాల్గొంటూ క్రియాశీలపాత్ర పోషించారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఆయన తుది శ్వాస వరకు నిబద్ధతతో పనిచేశారు. జి.టి గోపాలరావు భౌతికకాయాన్ని సీఐటీయూ సీనియర్ నాయకులు పి.రాజారావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు భూపాల్, జె.వెంకటేశ్, ఎస్వీ.రమ, ఎం.వెంకటేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి.సుధాకర్, ఎ.సునీత, సీహెచ్.రోజా, ఎం.శ్రావణ్‌కుమార్, టి.సత్తయ్య, ఎం.చంద్రమోహన్, ఏఐడీఈఎఫ్ నాయకులు శివలింగం, హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు జంగయ్య, బాలు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన మరణం సీఐటీయూకి తీరని లోటు అని తెలిపారు. సీఐటీయూకు ఆయన అందించిన సేవలను మననం చేసుకున్నారు.

జి.టి.గోపాలరావు మృతికి సీఐటీయూ సంతాపం

జి.టి.గోపాలరావు మృతికి సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగు దశాబ్దాల పాటు రక్షణరంగ ఉద్యోగుల హక్కుల కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం సీఐటీయూకి తీరని లోటు అని పేర్కొన్నారు.జి.టి.గోపాలరావు మరణం ఉద్యోగులు, కార్మికుల ఉద్యమాలకు తీరని నష్టమని ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, పీటీ నాయకులు డీఎఎస్‌వి.ప్రసాద్, మిట్ స్టాఫ్ మాజీ కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. రెండు రోజుల క్రితమే ఆయన్ను ఆస్పత్రిలో పరామర్శించామని గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి సామాజిక ఉద్యమాలకు కూడా తీరని నష్టమని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తెలంగాణలో బీజేపీయే సన్న బియ్యం ఇస్తే... దేశ ప్రజలకు ఎందుకివ్వట్లేదు?

- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి బీజేపీయే సన్నబియ్యం సరఫరా చేస్తుంటే, దేశ ప్రజలకు ఎందుకు ఇవ్వడం లేదని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. రోజురోజుకూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు అభద్రతాభావం పెరుగుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సొంత పార్టీలో గుర్తింపు కోసం, రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బండి సంజయ్ ఆరాటపడుతున్నారు. ఆయనకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపించకపోవడం విడ్డూరం. సీఎం రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టు వల్లే బీసీ రిజర్వేషన్లు, ఎస్సీవర్గీకరణ బిల్లులకు ఆమోదం లభించింది. హెచ్‌సీయూ అంశం ఉన్నత న్యాయస్థానం పరిధిలో ఉంది. రాజకీయ అవసరాల కోసం బండి సంజయ్ హెచ్‌సీయూపై మాట్లాడటం సమంజసం కాదు' అని పేర్కొన్నారు.

ప్రతికూల ఆలోచనతో ముప్పు



ఒక్కోసారి ఎంత వద్దనుకున్నా నెగెటివ్ థింకింగ్ మనసుని వేధిస్తుంటుంది. అనారోగ్యం వల్లనో, ఇంట్లోనో, ఉద్యోగంలోని సమస్యల కారణంగా నెగెటివ్ ఆలోచనలు వస్తుంటాయి. అప్పుడప్పుడూ ఇలా ప్రతికూల ఆలోచనలు ఎవరికైనా రావడం సహజం. కానీ కొంతమందిలో రోజూ ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ సమస్య దీర్ఘకాలం కొనసాగితే కుంగుబాటుకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ఆలోచనల వల్ల మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, శారీరక ఆరోగ్యం కూడా ప్రభావితం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. మరి ప్రతికూల ఆలోచన వల్ల వచ్చే సమస్యలేంటో, అనుకూల ఆలోచనల కోసం నిపుణులు ఏం చేయాలంటున్నారో తెలుసుకుందాం...

మానసికంగా ధృఢంగా లేకపోతే శారీరకంగానూ ఆరోగ్యంగా ఉండడం సాధ్యం కాదని చాలా పరిశోధనల్లో తేలింది. మానసిక ఒత్తిడికి గురైనప్పుడు శరీరం ఎక్కువ అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఏదైనా విషయంపై ఎక్కువగా ఆలోచిస్తే త్వరగా అనారోగ్యానికి గురవుతారని నిపుణులు చెబుతున్నారు. ప్రతికూల ఆలోచనలు అనేక వ్యాధుల బారిన పడేలా చేస్తాయని అంటున్నారు.

గుండె సంబంధిత వ్యాధులు

నెగెటివ్ థింకింగ్ వల్ల గుండెకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ ప్రతికూల ఆలోచనలు ఒత్తిడి, ఆందోళనకు దారితీస్తాయి. ఇది శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసాల్ హార్మోన్ అసమతుల్యతకు దారితీస్తుంది. దీర్ఘకాలం పాటు ఇలాంటి పరిస్థితి కొనసాగితే ఇది అధిక రక్తపోటు, వేగవంతమైన హృదయ స్పందన, కొలెస్ట్రాల్ వంటి సమస్యలకు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు.



జీర్ణవ్యవస్థ సమస్యలు

అధిక ప్రతికూల ఆలోచనలు జీర్ణవ్యవస్థను కూడా ప్రభావితం చేస్తాయి. ఇది జీర్ణాశయంలో ఉండే మంచి బాక్టీరియాకు హాని కలిగిస్తుంది. ఇది అల్సర్లు, అజీర్ణం, అతిసారం, పేగు సిండ్రోమ్, కడుపు సంబంధిత సమస్యలకు దారితీస్తుంది.

థైరాయిడ్

నిరాశాపూరితమైన ఆలోచనల వల్ల ఉత్సాహంగా ఏ పనులూ చేయాలనిపించదు. ఇది శరీరంలోని అనేక హార్మోన్ల పనితీరులో మార్పులకు దారితీస్తుంది. ఫలితంగా థైరాయిడ్, డయాబెటిస్, పీసీఓఎస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు.

బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ

నెగెటివ్ థింకింగ్స్ అనేవి రోగనిరోధక శక్తిని కూడా బలహీనపరుస్తాయి. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. కాబట్టి ప్రతికూల ఆలోచనలు అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించాలని నిపుణులు తెలియజేస్తున్నారు.

శారీరక నొప్పులు

ప్రతికూల ఆలోచనలు రోగనిరోధక శక్తిపై ప్రభావం చూపడంతోపాటు కండరాల నొప్పి, కండరాల బిగుతుకు దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు అంటున్నారు. దీంతో పాటు వెన్ను, మెడ నొప్పి సమస్యలను కూడా కలిగిస్తుంది.

ఇలా చేయండి

మనసు బాగలేనప్పుడు మళ్లీ పాజిటివ్ మూడ్‌లోకి రావాలంటే కొన్ని చిట్కాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతికూల ఆలోచనలు ఎక్కువగా ఉన్నప్పుడు నచ్చిన పాటలు వినడమో, పాడడమో చేయాలట. దీని వల్ల మనసుకు కాస్త ప్రశాంతత



లభిస్తుంది. ఫలితంగా పాజిటివ్‌గా ఆలోచించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

నచ్చిన పని

నెగెటివ్ థింకింగ్స్ ఎక్కువగా ఉన్నప్పుడు మీరు ఉన్న ప్రదేశం నుంచి బయటకు వచ్చి కాసేపు అటూ ఇటూ నడవండి. ఈ టైంలోనే మీకు బాగా నచ్చిన అంశాల గురించి ఆలోచించడానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చి చూడండి. లేకుంటే మీకు బాగా ఇష్టమైన అభిరుచి ఏంటో ఒక్కసారి గుర్తు చేసుకోండి. దానిపై దృష్టిని మళ్లించండి. ఇలా చేస్తే అసలు ప్రతికూలంగా ఆలోచించే సమయం కూడా ఉండదు.

పాజిటివిటీని పెంచే అంశాలు

- ఏ విషయంలోనైనా సాధ్యమైనంత మేరకు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. అందుకే వీలైంత వరకు పాటిజివ్‌గా ఆలోచించడానికి ప్రయత్నించండి.
- ఎంత ట్రై చేసినా నెగెటివ్ ఆలోచనలను నియంత్రించలేకపోతే ముందుగా మెదడుకు విశ్రాంతినివ్వాలని చెబుతున్నారు. ఇందుకోసం కొద్ది నిమిషాలపాటు శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేయాలని సూచిస్తున్నారు. ఈ తర్వాత పాజిటివిటీని పెంచే కథలను లేదా కొటేషన్స్ లాంటివి చదవడం, ప్రసంగాలు వినడం వల్ల మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు.
- మనసును వేధించే ఆలోచనల నుంచి బయటకు రావాలంటే ఏదో ఒక పని మీద మీ దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అంటే సమాజ సేవ చేయడం, ఇతరులకు సహాయం చేయడం లాంటి పనుల వల్ల కూడా మంచి ఫలితం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

నల్ల నువ్వులు రోజూ తింటే..

నువ్వుల గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. నువ్వుల్లో రెండు రకాలు ఉన్నాయన్న విషయం తెలిసిందే. ఒకటి తెల్ల నువ్వులు.. మరొకటి నల్ల నువ్వులు. వీటిని తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నువ్వుల్లో ఫైబర్, ఐరన్,



క్యాల్షియం, యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఅన్ శాచురేటెడ్ కొవ్వులు, ఫాస్పరస్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే చాలా మంది కేవలం తెల్ల నువ్వులు మాత్రమే తింటారు. కానీ నల్ల నువ్వుల్లో కూడా అంతే పోషకాలు ఉన్నాయని, ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. మరి నల్ల నువ్వుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది

నువ్వుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, పాలీ అన్ శాచురేటెడ్ కొవ్వులు మెండుగా ఉంటాయి. ఇవి రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయం చేస్తాయి. దీనివల్ల ముఖ్యంగా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

రోగ నిరోధక శక్తి పెరుగుతుంది

నువ్వుల్లో పోషకాలు, ఖనిజాలు, విటమిన్లు చాలా ఎక్కువ. కాబట్టి వీటిని రెగ్యులర్‌గా తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో వాతావరణ మార్పులతో వచ్చే రోగాలతో పోరాడే శక్తి లభిస్తుంది.

ఎముకలు ధృఢంగా ఉంటాయి

నువ్వుల్లో జింక్, క్యాల్షియం అనేవి అధికం. ఇవి ఎముకలను ధృఢంగా మార్చడంలో సహాయ పడతాయి. ప్రతి రోజూ ఉదయం పరగడుపున నల్ల నువ్వులను బెల్లంతో కలిపి తింటే.. ఎముకలు, వెన్నుపూస బలంగా మారతాయి.

జీర్ణ సమస్యలు మటుమాయం

నల్ల నువ్వుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గించడంలో బాగా పనిచేస్తుంది. దీంతో కడుపులో నొప్పి, ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు ఉండవు. అంతే కాకుండా పేగుల కదలికలను సరి చేస్తుంది. దీంతో జీర్ణ క్రియ కూడా సాఫీగా జరుగుతుంది.

ఒత్తిడి తగ్గుతుంది:

నల్ల నువ్వుల్లో ఉండే పోషకాలు ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. నల్ల నువ్వులు తినడం వల్ల శరీరంలో సెరొటోనిన్ అనేది ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇది ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది. అంతే కాకుండా నిద్ర లేమి, నొప్పులు వంటివి కూడా తగ్గించేందుకు సహాయ పడుతుంది. ■

---

132 రోజుల తర్వాత దల్లేవాల్ దీక్ష విరమణ

న్యూఢిల్లీ : 132 రోజుల తర్వాత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరాహార దీక్షను విరమించారు. దేశంలో రైతుల సమస్యల పరిష్కారానికి క షి చేస్తూ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ తన దీక్షను ఆదివారం విరమించారు. పంటలకు కనీస మద్దతు ధర పై చట్టబద్ధ హామీతో పాటు ఇతర కీలక డిమాండ్ల సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడమే ఈ దీక్ష లక్ష్యంగా సాగింది. గతేడాది నవంబర్ 26న దల్లేవాల్ ఈ దీక్ష ప్రారంభించారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రైల్వేశాఖ సహాయ మంత్రి రణ్‌వీత్‌సింగ్ బిట్టు ఆయనను దీక్ష విరమించుకోవాలని కోరిన మరుసటి రోజు, ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. పంజాబ్ రాష్ట్రంలోని ఫతేగఢ్ సాహిబ్ జిల్లా సిర్హింద్‌లో జరిగిన 'కిసాన్ మహా పంచాయత్'లో దీక్షను విరమిస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు.

మీ ఆదేశాలకు లోబడి దీక్షను విరమిస్తున్నా : జగ్జీత్ సింగ్ దల్లేవాల్

" ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని మీరు కోరారు. ఉద్యమాన్ని నిశ్శబ్దంగా, శాంతియుతంగా ముందుకు తీసుకెళ్లినందుకు మీ అందరికీ రుణపడి ఉంటాను. మీ భావోద్వేగాలను గౌరవిస్తూ, మీరు ఇచ్చిన ఆదేశాలకు లోబడి దీక్షను విరమిస్తున్నా " అని హృదయపూర్వకంగా స్పందించారు.

దల్లేవాల్ ప్రధానంగా సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) ఆధ్వర్యంలో ఏర్పాటైన వేదికలో కీలక నేతగా ఉన్నారు. కేంద్రం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ దీర్ఘకాలం పాటు పోరాటం చేశారు. కేంద్ర ప్రభుత్వం జనవరిలో చర్చల కోసం రైతులను ఆహ్వానించగా, దల్లేవాల్ తాను దీక్ష చేస్తున్న స్థలంలోనే వైద్య సాయం పొందేందుకు అంగీకరించారు. అయినా ఆయన తన నిరాహార దీక్షను కొనసాగిస్తూనే ఉన్నారు.

మే 4 న సమావేశం : శివరాజ్‌సింగ్ చౌహాన్ ట్వీట్

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ట్వీట్ ద్వారా రైతు సంఘాలతో కేంద్రం చర్చలు జరుపుతోందని వెల్లడించారు. మే 4న ఉదయం 11 గంటలకు తదుపరి సమావేశం జరుగుతుందని ప్రకటించారు. అంతేగాక, దల్లేవాల్ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తన సహానుభూతిని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 132 రోజులపాటు కొనసాగిన దీక్షకు ముగింపు పలికిన దల్లేవాల్ ధైర్యం, పట్టుదల దేశవ్యాప్తంగా రైతుల్లో కొత్త ఉద్వేగం కలిగించింది.

మైనారిటీలు..
అణగారిన వర్గాలే టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగ కేసులలో ఎక్కువ ఇవే ఉంటున్నాయని చెప్పారు. మత, కుల పరంగా మైనారిటీలు, షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ) వంటి అణగారిణ వర్గాలకు వ్యతిరేకంగా ఇలాంటి ప్రసంగాలు ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొలంబియా లా స్కూల్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన వర్చువల్ మోడ్‌లో పాల్గొని, ప్రసంగించారు. "75 ఏండ్ల రాజ్యాంగ వేడుకల కార్యక్రమాన్ని ఈ ఏడాది జనవరి 26న జరుపుకున్నాం. 75 ఏండ్ల తర్వాత కూడా విద్వేష ప్రసంగాలకు సంబంధించిన అనేక సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి ప్రసంగాలు ఎక్కువగా మత, కుల పరంగా మైనారిటీలు, షెడ్యూల్డ్ కులాలు వంటి అణగారిన వర్గాలపై ఉంటున్నాయి. మతపరంగా మైనారిటీలపై చేస్తున్న ద్వేషపూరిత ప్రసంగాలు, వారిపై దాడులు జరిపేలా మెజారిటీ సభ్యులను రెచ్చగొడుతున్న సందర్భాలు భారత్‌లో ఉన్నాయి" అని ఆయన అన్నారు. రాజకీయ కారణాలతో జరిగే ద్వేషపూరిత ప్రసంగాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రసంగాలు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తున్నాయని అన్నారు. భారత్‌లో వీటిపై అధ్యయనం జరుపుతున్నవారు ద్వేషపూరిత ప్రసంగాలకు రాజకీయ కారణాలుంటాయని చెప్పగలరని తెలిపారు. రాజకీయ ప్రయోజనాలు, ఓట్లు పొందటం కోసం కొందరు రాజకీయ నాయకులు ఇలాంటి ప్రసంగాలు చేస్తుండొచ్చని ఆయన అన్నారు. రాజకీయ శక్తులు ద్వేషపూరిత ప్రసంగాలను వాడుకోవటం ఆందోళనకరమని చెప్పారు. ప్రజాస్వామ్యంలో అసమ్మతి హక్కు, నిరసనలు కీలకమని జస్టిస్ ఓకా అన్నారు. ద్వేషపూరిత ప్రసంగాలపై ప్రజల్లో అవగాహన కల్పించటం అసలైన సవాల్ అని ఆయన తెలిపారు. "మనం సోదరభావాన్ని కాపాడుకోగలిగితే.. సోదరభావం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించగలుగుతాం. ద్వేషపూరిత ప్రసంగాలు చాలా తగ్గుతాయి. ఈ విద్య చాలా ముఖ్యం" అని ఆయన చెప్పారు.

అమెరికాలో భారీ ఆందోళనలు

(మొదటిపేజీ తరువాయి)

నిరసన కార్యక్రమాన్ని మూవ్ ఆన్, ఇన్‌డివిజబుల్, ది ఉమెన్స్ మార్చ్, కార్మిక సంఘాలు, ఎల్‌జీబీటీక్యూప్లస్, న్యాయవాదులు, అనుభవజ్ఞుల సంస్థలు వంటి 150కి పైగా గ్రూపుల సంకీర్ణం నిర్వహించింది. ట్రంప్ మొదటి పదవీకాలంలో ఎదురైన అనుభవాల నేపథ్యంలో అప్రమత్తమై ప్రస్తుతం ఈ ఆందోళనలను జరిపింది. యూఎస్‌లోని అన్ని 50 రాష్ట్రాలతో పాటు యూరప్‌లోని బెర్లిన్, లండన్ వంటి కీలక నగరాల్లోనూ ఆందోళనకారులు నిరసనలు నిర్వహించారు. 'హ్యాండ్స్ ఆఫ్'గా పిలవబడే ఈ ప్రదర్శనలు.. ట్రంప్ శ్వేత సౌధంలోకి అధ్యక్షుడిగా మళ్లీ అడుగుపెట్టిన తర్వాత నిరసనకారుల నుంచి ఎదురైన అతిపెద్ద ప్రతిఘటన ఇదే కావటం గమనార్హం.

ట్రంప్ నిర్ణయాలపై ఆగ్రహం

యూఎస్‌లోని ట్రంప్ యంత్రాంగం తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై ఆందోళనకారులు నిరసనలు చేశారు. ఇందులో ఫెడరల్ వర్క్‌ఫోర్స్‌లో భారీ తొలగింపులు, అబార్షన్ ఆంక్షలు, ట్రేడ్ టారిఫ్‌లు, ప్రజాసేవలను నిలిపివేయటం వంటివి ఉన్నాయి. యూఎస్‌లోని యాంకరేజ్ నుంచి అట్లాంట వరకు.. ప్రదర్శనకారులు ట్రంప్ పాలనలో పెరుగుతున్న నిరంకుశత్వం, పడిపోతున్న జీవన ప్రమాణాల గురించి హెచ్చరించే సంకేతాలను ప్రదర్శించారు. "ఈ దారుణమైన పాలన ప్రపంచవ్యాప్తంగా మన మిత్రదేశాలను కోల్పోయేలా చేస్తున్నది. ఇక్కడ స్వదేశంలోని ప్రజలకూ హాని కలిగిస్తోంది" అని నిరసనకారుడు డయాన్ కోలిఫ్రాత్ (64) అన్నారు. ఆయన న్యూహాంప్‌షైర్ నుంచి 100 మందితో కలిసి వాషింగ్టన్‌లో నిరసన తెలియజేసేందుకు రావటం గమనార్హం.

దేశవ్యాప్తంగా నిరసనల వెల్లువ

యూఎస్‌లోని వివిధ ప్రాంతాలు అమెరికా యంత్రాంగానికి వ్యతిరేకంగా నిరసనలతో హోరెత్తాయి. ఇటు మెక్సికో, కెనడా, పలు యూరోపియన్ నగరాల్లోనూ ఆందోళనలు జరిగాయి. 1200కు పైగా ర్యాలీల్లో ఆరు లక్షల మందికి పైగా పాల్గొన్నారని నిర్వాహకులు అంచనా వేశారు. మానహట్టన్‌లోని ఐదో అవెన్యూలో 20 బ్లాక్‌లను నిరసనలు విస్తరించాయి. వాషింగ్టన్ మాన్యుమెంట్‌ను వేలాది మంది చుట్టుముట్టారు. అట్లాంటాలో 20 వేల మందికి పైగా నిరసనల్లో పాల్గొన్నారని పోలీసులు అంచనా వేశారు. " కురుస్తున్న వర్షం, 43 డిగ్రీల ఎండ, తీవ్రమైన గాలి.. ఇప్పటికీ అల్బానీలో వేల సంఖ్యలో నిరసనకారులున్నారు" అని రచయిత రోన్ మార్జ్ పోస్ట్ చేశారు. రిప్రోడక్టివ్ రైట్స్ విషయంలో ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా లాస్ ఏంజెల్స్‌లో మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. జెండాలపై నినాదాలతో తమ నిరసనను వ్యక్తం చేశారు.



మస్క్ నేతృత్వంలోని డోజ్‌పై ఆందోళన

ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్ మస్క్ నేతృత్వంలో ట్రంప్ సర్కారు ఏర్పాటు చేసిన వివాదాస్పద 'డోజ్' పైనా నిరసనకారులు గొంతెత్తారు. బిలియన్ల మొత్తంలో పన్ను చెల్లింపుదారులు డబ్బు ఆదా అవుతుందని యంత్రాంగం చెప్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయని చెప్పారు. ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ ఒక్కటే.. గతవారం 20 వేల మందికి పైగా కార్మికులను తొలగించింది. "నాకు భయంగా, కోపంగా, దిగ్భ్రాంతికరంగా ఉన్నది. నాకు నా డబ్బు కావాలి. నా ప్రయోజనాలు కావాలి" అని బాల్టిమోర్ దగ్గర సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ హెడ్‌క్వార్టర్ బయట ఆందోళనలో పాల్గొన్న లిండా ఫాల్కావో (65) అన్నారు. అక్కడున్న నిరసనకారులంతా 'ఇదంతా మా డబ్బు' అని ఒక్కసారిగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ప్రపంచదేశాలపై టారిఫ్‌ల గందరగోళం

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై విధించిన



ప్రతీకార సుంకాల ప్రభావం ఆర్థిక మార్కెట్లను కుదిపివేసింది. ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం గురించి హెచ్చరిస్తున్న ఆర్థికవేత్తలనూ ఇది ఆందోళనకు గురి చేసింది. ట్రంప్ టారిఫ్‌ల నిర్ణయం పైనా నిరసనకారులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పలు నగరాల్లో ఆందోళనకారులు రిపబ్లికన్ యంత్రాంగానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. "అమెరికాలో జరుగుతున్నది ప్రతీ ఒక్కరి సమస్య. ఇది ఆర్థిక ఉన్మాదం. అతను (ట్రంప్) మనల్ని ప్రపంచ మాంద్యంలోకి నెట్టబోతున్నాడు" అని లండన్‌లో నిర్వహించిన ర్యాలీలో యూఎస్-బ్రిటీష్ ద్వంద్వ పౌరసత్వం కలిగిన లిజ్ చాంబర్లిన్ అన్నాడు.

'గౌరవం, భద్రత, స్వేచ్ఛ..అందరికీ చెందుతాయి'

బోస్టన్‌లో నిర్వహించిన ఆందోళనల్లో నిరసనకారులను ఉద్దేశిస్తూ మేయర్ మిచెల్ వు ప్రసంగించారు. తమ అమ్మమ్మ తాతయ్య లాంటి వలసదారులను స్వయంచాలకంగా నేరస్థులుగా భావించే ప్రపంచంలో పెరగొచ్చనే విషయాన్ని తాను అంగీకరించను అని చెప్పారు. మానవ హక్కుల ప్రచార అధ్యక్షురాలు కెల్లీ రాబిన్సన్ వాషింగ్టన్ ర్యాలీలో పాల్గొన్నారు. "మనం చూస్తున్న దాడులు రాజకీయపరమైనవి కావు. అవి వ్యక్తిగతమైనవి. మనకు ఈ అమెరికా వద్దు. మనకు అర్హత ఉన్న అమెరికా కావాలి. ఇక్కడ గౌరవం, భద్రత, స్వేచ్ఛ అనేవి మనలో కొందరికి కావు.. అందరికీ చెందుతాయి" అని ఆమె అన్నారు. ఇంత పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమైనా.. శ్వేతసౌధం మాత్రం దీనిని తోసిపుచ్చుతున్నది. ట్రంప్ యంత్రాంగాన్ని సమర్థించుకున్నది. అధ్యక్షుడు ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉన్నదనీ, ఆయన ఎల్లప్పుడూ అర్హులైన లబ్దిదారుల సామాజిక భద్రత, మెడికేర్, మెడికేడ్‌ను రక్షిస్తారని అసిస్టెంట్ ప్రెస్ సెక్రెటరీ లిజ్ హస్టన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పాంబన్ వంతెన ప్రారంభం

చెన్నై: భారత ప్రధాన భూభాగాన్ని రామేశ్వరంతో కలుపుతూ ఆధునిక సాంకేతికతతో నిర్మించిన పాంబన్ వంతెన ను ప్రధాని నరేంద్ర మోడీ జాతికి అంకితం చేశారు. దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెన ఇది. సముద్రంలో 2.08 కి.మీ. పొడవు ఉండే ఈ వంతెన దిగువన ఓడల రాకపోకలకు వీలుగా కీలకమైన వర్టికల్ లిఫ్ట్ ఉంటుంది. తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో రూ.535 కోట్లతో దీన్ని నిర్మించారు. 2019 మార్చి 1న ప్రధాని మోడీ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, 2020లో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) పనులు చేపట్టి, నాలుగేండ్లలో పూర్తిచేసింది. ఈ క్రమంలోనే రామేశ్వరం - తాంబరం ప్రత్యేక రైలును ప్రధాని మోడీ ప్రారంభించారు. ఇది కొత్త వంతెన మీదుగా పరుగులు తీసింది. రైల్లో విద్యార్థులు, ఇతర ప్రయాణికులు సందడి చేశారు. అదేవిధంగా వంతెన కిందుగా ప్రయాణించిన కోస్ట్ గార్డ్ నౌకకూ పచ్చజెండా ఊపారు. రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, తమిళనాడు ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తమిళనాడు సీఎం స్టాలిన్ గైర్హాజరు

పాంబన్ వంతెన ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గైర్హాజరయ్యారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు సంబంధించి కేంద్రానికి, తమిళనాడు ప్రభుత్వానికి మధ్య వివాదం జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని కార్యక్రమానికి సీఎం హాజరుకాకపోవడం గమనార్హం. పాంబన్ వంతెనను ప్రధాని మోడీ ప్రారంభించిన సమయంలోనే.. మరోచోట ఓ కార్యక్రమంలో పాల్గొన్న స్టాలిన్ పాల్గొని ప్రసంగిస్తూ.. పార్లమెంటులో రాజ్యాంగ సవరణతో న్యాయమైన డీలిమిటేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియ విషయంలో రాష్ట్ర ప్రజలకు ఉన్న భయాలను తొలగిస్తానని ప్రధాని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటరీ సీట్లలో తమ రాష్ట్ర వాటా శాతంలో మార్పు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 2001లో అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పాయి పాటించిన నిబద్ధతను నిలబెట్టుకోవాలని కేంద్రానికి సూచించారు. 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ అమలు చేస్తే తమిళనాడు, ఇతర దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో న్యాయమైన ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన 2026లో జరగనుంది. ఇందుకు అనుసరించే విధివిధానాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందన్న ఆందోళన రేగుతోంది. ఇటీవల డీఎంకే నేత త్వంలో నిర్వహించిన సమావేశంలో జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల తయారీలో ప్రాతినిధ్యం తగ్గుతుందని స్టాలిన్ ఆరోపించారు. సొంత దేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతామన్నారు. ఈ సందర్భంగా తమ నిరసన పునర్విభజనకు వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. న్యాయబద్ధంగా, పారదర్శకంగా డీలిమిటేషన్ చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

ఆర్థిక లాభం కోసమే పర్యావరణంపై దాడి

కంచ గచ్చిబౌలి భూములపై మా పోరాటం ముగియలేదు
విద్యార్థుల పర్యావరణ ఉద్యమానికి మద్దతివ్వండి :తెలంగాణ ప్రజలకు కేటీఆర్ బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్థిక ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణంపై దాడికి పూనుకుందనీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆయన తెలంగాణ ప్రజలకు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. హెచ్‌సీయూ విద్యార్థులు 400 ఎకరాల కంచ గచ్చిబౌలి అడవిని కాపాడేందుకు చేపట్టిన ఆందోళనకు చివరిదాకా బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రభుత్వం తక్కువ చేసి చూపాలన్న కుట్రతో అనేక అపవాదులు వేస్తున్నా, నిస్వార్థమైన విద్యార్థి-ప్రజా పోరాటాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయని తన లేఖలో పేర్కొన్నారు. వందల రకాల జంతుజాలం, వృక్షజాతులతో ఉన్న ప్రాంతాన్ని కాపాడి, భవిష్యత్ తరాలకు అందించేందుకు వారు చేసిన పోరాటానికి దేశంలోని వివిధ రంగాల ప్రముఖులు కలిసి రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాదిరిగా ఆర్థిక ప్రయోజనాల కోసం ఆలోచించకుండా, భవిష్యత్ ప్రయోజనాల కోసం కంచ గచ్చిబౌలి భూముల వేలాన్ని విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ కోసం, బెదిరింపు ధోరణిలో ఏకో పార్క్ ఏర్పాటు అంటూ, ఫోర్త్‌సిటీకి సెంట్రల్ యూనివర్సిటీ తరలింపు అంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మొదలుకొని ప్రతి కాంగ్రెస్ నాయకుడి వరకూ పక్కా కుట్రతో మాట్లాడుతున్న మాటలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. విద్యార్థుల పోరాటం ఫలించి ప్రభుత్వం చేసిన పర్యావరణ హత్యను సుప్రీంకోర్టు అడ్డుకున్నదనీ, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రల నేపథ్యంలో ఈ పోరాటం పూర్తిగా అయిపోలేదని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ కుట్రలను, బెదిరింపులను, దుష్ప్రచారాన్ని దాటుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. హెచ్‌సీయూ పర్యావరణ



కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మేధావులు, పర్యావరణ వేత్తలతో పాటు తెలంగాణ సమాజమంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు.





భవిష్యత్తు ఎర్రజెండాదే

సీపీఐ(ఎం) నూతన ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించారు. ఈ సందర్భంగా బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం పెద్దఎత్తున హర్షధ్వానాలు చేశారు. ఆయన ప్రసంగం సాగుతున్న సమయంలోనే ఒక్కసారిగా వర్షం ప్రారంభమవడంతో కలకలం రేగింది. సభ నుంచి కొందరు వెళ్లిపోవడం ప్రారంభించారు. దీంతో ' ఇప్పుడు మన ముందు రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి సభను అర్థంతరంగా ముగించుకుని వెళ్లడం, రెండవది అవాంతరాలు ఎదురైనా సభను నిర్వహించుకుని ముందుకు వెళ్లడం. ఎంతటి త్యాగానికైనా సిద్ధమని చెప్పే మనం ఈ చిన్నపాటి వర్షానికే భయపడతామా? మనకు భయం లేదు. ఏ శక్తులు మనల్ని భయపెట్టలేవు. ఎంత కష్టం వచ్చినా, ఎన్ని నష్టాలు వచ్చినా మన ప్రయాణం ముందుకే..' అని అన్నారు. దీంతో ఎక్కడి ప్రజానీకం అక్కడే ఆగిపోయారు. కుర్చీలను తలలమీద పెట్టుకుని బేబి ప్రసంగాన్ని చివరి వరకూ విన్నారు. ఉపన్యాసాన్ని కొనసాగించిన బేబీ క్యూబా, ఉత్తర కొరియా, చైనా తదితర దేశాలలో కమ్యూనిస్టుల పాలనను ప్రస్తావించారు. అనేక లాటిన్ అమెరికా దేశాల్లోనూ వామపక్ష విధానాలను ఆమోదించే పార్టీలు అధికారంలోకి వచ్చాయని చెప్పారు. మనకు పొరుగునే ఉన్న శ్రీలంకలోనూ వామపక్షం అధికారంలోకి వచ్చిందని వివరించారు. నేరుగా కమ్యూనిస్టు పార్టీలు, వామపక్ష భావజాలంతో అధికారంలో ఉన్న దేశాల్లోని ప్రజలను కలుపుకుంటే, 25 శాతం కన్నా ఎక్కువ జనాభా సోషలిజం నీడలో ఉందని వివరించారు, పెట్టుబడిదారి విధానపు సంక్షోభంతో ఎన్నో దేశాల ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని వివరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న రక్షణాత్మక విధానాలు పెట్టుబడిదారీ విధానపు అసలు స్వభావాన్ని, దానిలోని భయాన్ని ప్రపంచ ప్రజానీకం ముందు బట్టబయలు చేస్తున్నాయని చెప్పారు. దీనికి భిన్నంగా చైనా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించి ముందుకు సాగుతూ, ప్రపంచ ప్రజలకు కొత్త మార్గాన్ని చూపుతోందని అన్నారు. అదే సమయంలో కమ్యూనిస్టు ఉద్యమంలోని బలహీనతలనూ ఆయన ప్రస్తావించారు. 'ఈ మాటలు మనం చెబుతున్నామంటే దీనర్థం అంతా బాగుందని కాదు. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం కొన్ని సంవత్సరాలుగా బలహీనపడింది. ఎదురుదెబ్బలు తగిలాయి. దీనిని మనం అంగీకరించాలి. కేరళలో వరుస ఎన్నికల్లో గెలిచి చరిత్ర సృష్టించాం. అదే సమయంలో బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో ఎదురుదెబ్బలు తాకాయి. వీటిని గుర్తించి సరిదిద్దుకుని ముందుకు సాగాలి. అక్కడ మన కామ్రేడ్లు పోరాడుతున్నారు' అని అన్నారు. దేశంలో ప్రస్తుతం తిరోగామి శక్తులు అధికారంలో ఉన్నాయని అన్నారు. మతోన్మాద, కార్పొరేట్ శక్తుల కూటమి అధికారంలో ఉందని, నయా ఫాసిస్టు విధానాలను దేశంపై రుద్దుతూ భయోత్పాతాన్ని సృష్టిస్తోందని చెప్పారు. ఈ విధానాలను ఎదిరించి, ప్రజలను సంఘటితం చేసి ముందుకు సాగాలని 24వ మహాసభ పిలుపునిచ్చిందని, ఆ లక్ష్యాలను సాధించడానికి సీపీఐ(ఎం)ను, వామపక్షాలను బలోపేతం చేయాలని అన్నారు. తన ప్రసంగంలో ఆయన ఇటీవల మరణించిన సీతారాం ఏచూరి, కొడియేరి బాలకృష్ణన్, బుద్ధదేవ్ భట్టాచార్యలకు నివాళు లర్పించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



























Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.